
ప్రకటనల కోసం సంప్రదించండి
98483 28698

తెలంగాణ స్వరాష్ట్ర సమరయోధ పత్రిక
Estd : 2002
జనంసాక్షి
www.janamsakshi.org
శుక్రవారం 29.05.2026 | సంపుటి :12 సంచిక : 309 | పేజీలు :12 వెల : రూ. 4/-
RNI NO.TELTEL / 2013 /50370
సామాన్యుని స్వరం
JANAMSAKSHI TV
హైదరాబాద్ | Simultaneously Published from Hyderabad & Karimnagar | ఎడిటర్ : ఎం.ఎం. రహమాన్

# బొక్కతింటూ.. పుట్టిన గడ్డకు పోటు..

# ప్రభువు పాదాల వద్ద లాంగుబాటు



## పరాయిగడ్డపై 'బక్కని' ఆత్మవంచన

## గద్దె కోసం గడ్డి తింటారా..!?

**నరసింహులు వ్యాఖ్యలపై మండిపడుతున్న తెలంగాణవాసులు**

**తెలుగు భాషకు ప్రాచీన భాష హోదా వచ్చిందే తెలంగాణ నుంచి కదా..!**

**తెలంగాణ అస్తిత్వాన్ని దెబ్బతీసేందుకు కొందరు చేస్తున్న కుట్రలు ఇంకా కొనసాగుతూనే ఉన్నాయి. ఇటీవలే ఓ పార్టీ ఎంపీ పార్లమెంట్ సాక్షిగా తెలంగాణ విభజనను పాకిస్తాన్‌తో పోల్చగా.. తాజాగా మంగళగిరి మహానాడు సాక్షిగా టీటీడీపీ నేత చేసిన వ్యాఖ్యలు తెలంగాణ ప్రజల ఆత్మగౌరవాన్ని దెబ్బతీసేలా ఉన్నాయి. పరాయివాళ్ల పంచన చేరి చరిత్ర గుర్తెరకుండా పుట్టిన గడ్డను అవమానపరిచేలా ఆత్మవంచనకు పాల్పడటం నిజంగా ఆత్మహత్యా సదృశ్యమే..!!**

హైదరాబాద్ (జనంసాక్షి) :

తెలంగాణ రాష్ట్ర తెలుగుదేశం పార్టీ అధ్యక్షుడు బక్కని నర్సింహులు తెలుగు నాడు వేదికపై చేసిన వ్యాఖ్యలు "తెలంగాణకు చరిత్ర లేదు, డిక్షనరీలో తెలంగాణ పదమే లేదు" అజ్ఞానానికి నిదర్శనం మాత్రమే కాదు, తెలంగాణ ప్రజల మనోభావాలను దెబ్బతీసే అపహాస్యం. తెలంగాణకు చరిత్ర లేదని అనేవారికి కాకతీయ సామ్రాజ్యం గురించి తెలుసా? వేయి స్తంభాల గుడి, రామప్ప దేవాలయం యునెస్కో గుర్తింపు పొందిన వారసత్వ సంపద తెలంగాణ మట్టిలో పుట్టింది. శాతవాహనులు, చాళుక్యులు, కాకతీయులు, ముసునూరి నాయకులు, బహమనీ సుల్తానులు, కుతుబ్ షాహీలు, నిజాం నవాబులు ఒక్కొక్కరూ తెలంగాణ చరిత్రకు బంగారు పేజీ రాశారు. కరీంనగర్ జిల్లా గంగాధర మండలం కురికియాలలో దొరికిన శిలాశాసనం ద్వారా తెలుగు భాషకు ప్రాచీన భాష హోదా లభించింది. తెలుగు భాషకు గుర్తింపు ఇచ్చిన నేల తెలంగాణది ఇది చరిత్ర కాదా? సాహిత్యం, పోరాటం.. తెలంగాణ గొప్పతనం మహాకవి పోతన తెలంగాణ నేలపై పుట్టి భాగవతాన్ని రాశాడు. అది తెలుగు సాహిత్యానికి కిరీటం. కాళోజీ నారాయణరావు తెలంగాణ గొంతుకయ్యారు. సురవరం ప్రతాపరెడ్డి ఆంధ్ర సారస్వత చరిత్ర రాసి తెలుగు వారసత్వాన్ని నిలబెట్టారు. నిజాం నిరంకుశత్వానికి వ్యతిరేకంగా జరిగిన సాయుధ తెలంగాణ రైతాంగ పోరాటం భారత విప్లవ చరిత్రలో మైలురాయి. ఆ త్యాగాల రక్తంతో తడిసిన నేలకు చరిత్ర లేదా?

**మద్రాసిల్లు' అద్దం చూపిస్తే కోపమెందుకు?**

1952కి పూర్వం ఆంధ్ర ప్రాంతం మద్రాస్ రెసిడెన్సీలో భాగంగా ఉంది. 'ఆంధ్ర రాష్ట్రం' అని పిలవబడే ప్రత్యేక రాష్ట్రం 1953లో ఏర్పడింది. అంతకు ముందు తెలంగాణకు వేల సంవత్సరాల స్వతంత్ర పరిపాలనా చరిత్ర ఉన్నది. ఇప్పుడు చెప్పండి చరిత్ర లేనిది ఎవరికి?

**రాజకీయ ప్రయోజనం కోసం..**

బక్కని నర్సింహులు చేసిన వ్యాఖ్యలు పార్టీ అధినేత చంద్రబాబు నాయుడు మెప్పు కోసం చేసిన వ్యాఖ్యలని స్పష్టంగా కనిపిస్తోంది. రాజకీయ ప్రయోజనం కోసం తెలంగాణ చరిత్రను కించపరచడం తెలంగాణ ప్రజలను అవమానించడమే. ఒక పార్టీ అధ్యక్షుడు నిఘంటువు మొదటి పేజీ తెరవకుండా చేసే వ్యాఖ్యలు ఆ పార్టీ స్థాయిని చెప్పకనే చెబుతాయి. చరిత్రను అబద్ధంగా చెప్పవచ్చు, కానీ చరిత్రను తుడిచిపెట్టలేరు. కాకతీయుల కోటగోడలు, రామప్ప శిల్పాలు, పోతన పద్యాలు, కాళోజీ కవితలు, రైతాంగ పోరాటం ఇవన్నీ జీవంగా ఉన్నాయి. బక్కని వంటివారి మాటలు చరిత్రను మార్చలేవు, తెలంగాణ ఆత్మగౌరవాన్ని అణగదొక్కలేవు. తెలంగాణ పదం డిక్షనరీలో లేదు అనేవారికి వారి డిక్షనరీయే తప్పు రాసిందని తెలుసుకోవాల్సిన అవసరం ఉంది.


# కర్ణాటక తదుపరి సీఎంగా డీకే శివకుమార్

**ఎట్టకేలకు సీఎం పదవికి సిద్దరామయ్య రాజీనామా**

**గవర్నర్ కార్యదర్శికి రాజీనామా లేఖ అందజేత**

**అధిష్టానం ఆదేశాల మేరకు వైదొలుగుతున్నట్లు ప్రకటన**

**జాతీయ రాజకీయాలకు వెళ్లే ఆలోచన లేదని వెల్లడి**



బెంగళూరు(జనంసాక్షి):కర్నాటకానికి తెరపడింది. గతకొంతకాలంగా ఊహాగానాలతో సాగిన రాజకీయాలు మలుపు తిరిగాయి. కర్నాటకలో సిద్ధరామయ్య జమానా ముగిసింది. ఎట్టకేలకు కర్ణాటకలో నాయకత్వ మార్పు చోటుచేసుకుంది. ముఖ్యమంత్రి పదవికి సిద్ధరామయ్య రాజీనామా చేశారు. గురువారం మధ్యాహ్నం డీకే శివకుమార్‌తో కలిసి ఆయన లోక్‌భవన్‌కు వెళ్లారు. అయి తే, ఆ సమయంలో గవర్నర్ థావర్ చంద్ గహ్లోత్ అందుబాటులో లేకపోవడంతో ఆయన కార్యదర్శికి సిద్ధరామయ్య తన రాజీనామా లేఖను సమర్పించారు. ఈ విషయాన్ని గవర్నర్ ప్రత్యేక కార్యదర్శి సైతం ధ్రువీకరించారు. సీఎం రాజీనామా లేఖను తీసుకున్నామని, గవర్నర్ తిరిగొచ్చాక దీనిపై నిర్ణయం తీసుకుంటారని వెల్లడించారు. గహ్లోత్ ఈ సాయంత్రం బెంగళూరు చేరుకోనున్నారు. అనం తరం మంత్రులు డీకే శివకుమార్, పరమేశ్వరతో కలిసి సిద్ధరామయ్య మీడియాతో మాట్లాడారు. అధిష్ఠానం సూచనలతో సీఎం పదవికి రాజీనా మా చేశా. హైకమాండ్ ఆదేశాలకు అందరం కట్టుబడి ఉంటాం. రాష్ట్ర ప్రయోజనాల కోసమే వైదొలిగా. నిబంధనల ప్రకారం

మిగతా 2లో..

### ముఖ్యమంత్రి డీకే పేరును ప్రతిపాదించిన సిద్ధూ



కర్ణాటక నూతన ముఖ్యమంత్రిగా డీకే శివకుమార్ ఎంపిక లాంఛనంగా కన్పిస్తోంది. సీఎం పదవి నుంచి వైదొలుగుతున్నట్లు ప్రకటించిన సిద్ధరామయ్య.. తదుపరి సీఎంగా డీకే

మిగతా 2లో..

# ఫ్యూచర్ సిటీని దేశానికి ఆదర్శంగా నిలుపుతాం

**నిర్మాణ పనులను పరిశీలించిన మంత్రులు పొంగులేటి, శ్రీధర్‌బాబు**

హైదరాబాద్(జనంసాక్షి): రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా అభివృద్ధి చేస్తున్న ఫ్యూచర్ సిటీ దేశానికే ఆదర్శంగా నిలిచే విధంగా రూపుదిద్దుకుంటోందని రాష్ట్ర మంత్రులు పొంగులేటి శ్రీనివాస రెడ్డి, శ్రీధర్ బాబు పేర్కొన్నారు. గురువారం ఫ్యూచర్ సిటీలో నిర్మాణంలో ఉన్న ఫ్యూచర్ సిటీ డెవలప్‌మెంట్ అథారిటీ (ఎఫ్‌సీడీఏ) కార్యాలయ భవనం, స్కిల్ యూనివర్సిటీ నిర్మాణ పనులను వారు పరిశీలించారు. ఈ సందర్భంగా మంత్రులు మాట్లాడుతూ..

ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలో రాష్ట్ర ప్రభుత్వం భవిష్యత్

మిగతా 2లో..





## సవాళ్లు చేయడం, పారిపోవడం కాంగ్రెస్‌కు అలవాటే

ఆ పార్టీ నాయకులు డబుల్ ఇళ్లపై ఇచ్చిన మాటకు కట్టుబడి ఉండాలి: కేటీఆర్

2 లో..



## తెలుగుజాతికి స్ఫూర్తి నింపిన నాయకుడు ఎన్టీఆర్

**మైత్రీవనం సర్కిల్‌లో ఎన్టీఆర్ విగ్రహాన్ని ఆవిష్కరించిన సీఎం రేవంత్ రెడ్డి**

అమీర్‌పేట్(జనంసాక్షి): దేశం గర్వించదగిన గొప్ప నేత ఎన్టీఆర్ అని తెలంగాణ సీఎం రేవంత్‌రెడ్డి అన్నారు. ఎన్టీఆర్, ఇందిరాగాంధీ స్ఫూర్తితో తమ ప్రభుత్వం పాలన కొనసాగిస్తోందని తెలంగాణ సీఎం రేవంత్‌రెడ్డి అన్నారు. తమకు ఇందిరాగాంధీ ఎంత ముఖ్యమో.. ఎన్టీఆర్ కూడా అంతే ముఖ్యమని చెప్పారు. అమీర్‌పేట మైత్రీవనం సర్కిల్‌లో ఎన్టీఆర్ విగ్రహాన్ని ఆవిష్కరించిన అనంతరం నిర్వహించిన కార్యక్రమంలో రేవంత్‌రెడ్డి మాట్లాడారు. "దేశ చరిత్రను ఎవరూ చదవాలన్నా, స్ఫూర్తి పొందాలన్నా ముగ్గురు జాతిరత్నాలను

మిగతా 2లో..

## మద్దతు ధరకే

**ధాన్యం కొనుగోళ్లపై విపక్షాలది అనవసర రాద్ధాంతం: మంత్రి ఉత్తమ్**

# తడిసిన ధాన్యాన్నీ కొంటాం

- రైతులు పండించిన ధాన్యం చివరి గింజ వరకు కొనుగోలు చేస్తాం
- దేశంలోనే అత్యధిక వరి ధాన్యం పండించిన తెలంగాణ రాష్ట్రం
- ప్రభుత్వాన్ని బదనాం చేయాలని విపక్షనేతల కుట్రలు
- ధాన్యం కొనుగోళ్లు సజావుగా సాగుతున్నాయని వెల్లడి



యాదాద్రి ప్రతినిధి, మే 28 (జనంసాక్షి):

రైతులు పండించిన ధాన్యం చివరి గింజ వరకు కొనుగోలు చేస్తామని రాష్ట్ర నీటి పారుదల ,పౌర సరఫరాల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి అన్నారు. గురువారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో ధాన్యం కొనుగోలుపై రెవెన్యూ, హౌసింగ్, సమాచార పౌర సంబంధాల శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి, ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు, భువనగిరి ఎంపీ చామల కిరణ్ కుమార్ రెడ్డి, ప్రభుత్వ విప్ ఆలేరు ఎమ్మెల్యే బీర్ల ఐలయ్య, భువనగిరి ఎమ్మెల్యే కుంభం అనిల్ కుమార్ రెడ్డి, నకిరేకల్ ఎమ్మెల్యే వేముల వీరేశం, తుంగతుర్తి ఎమ్మెల్యే మందుల సామేలు, రాష్ట్ర పౌర సరఫరాల కమిషనర్ స్టీఫెన్ రవీంద్ర, జిల్లా కలెక్టర్ అనురాగ్ జయంతి, జిల్లా ఎస్పీ అక్షాంశ్ యాదవ్, స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ భాస్కర్ రావు, రెవెన్యూ అదనపు కలెక్టర్ వెంకా రెడ్డి తో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా రాష్ట్ర పౌర సరఫరా శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి మాట్లాడుతూ రైతులు పండించిన వరి ధాన్యం కొనుగోలు వేగవంతం చేయడానికి ఈ పర్యటనలు సమావేశాలు ఏర్పాటు చేయడం జరిగిందని అన్నారు. ప్రభుత్వం రైతుల పక్షాన ఉంటుందని, ఎలాంటి పరిస్థితులు ఎదురైనా రైతులు పండించిన ధాన్యం కొనుగోలు చేయడం జరుగుతుందని అన్నారు. అకాల వర్షాల వల్ల ధాన్యం తడిస్తే రైతులు ఆందోళన చెందవద్దని, తడిసిన ధాన్యాన్ని కూడా కొనుగోలు చేయడం జరుగుతుందని, రైతులకు నష్టం జరగనివ్వమని మంత్రి తెలిపారు. రెవెన్యూ, సివిల్ సప్లై, పోలీస్ శాఖలు పరస్పరం సమన్వయం చేసుకుంటూ ధాన్యం సేకరణను వేగవంతంగా పూర్తి చేయాలని రైతులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా చూడాలన్నారు. ధాన్యం కొనుగోలు చేసిన 48 గంటల్లో రైతులు ఖాతాలో డబ్బులు జమ చేయడం జరుగుతుందని అన్నారు. నాలుగు, ఐదు రోజులు పాటు ఇసుక వాహనాలను

మిగతా 2లో..

# కాజీపేటలో త్వరలో ఇంటర్ సిటీ రైళ్ల తయారీ

**రైల్వే మంత్రి అశ్వినీ వైష్ణవ్**

కాజీపేట(జనంసాక్షి): కాజీపేటలో రైళ్ల తయారీ యూనిట్ పూర్తి కావొచ్చిందని రైల్వే మంత్రి అశ్వినీ వైష్ణవ్ తెలిపారు. త్వరలో అక్కడ ఇంటర్ సిటీ రైళ్ల తయారీ ప్రారంభమవుతుందని చెప్పారు. కాజీపేట రైల్వే తయారీ యూనిట్‌పై అశ్వినీ వైష్ణవ్ కీలక సమీక్ష నిర్వహించారు.

మిగతా 9లో..



# ఎకరం రూ.237 కోట్లు..

**రాయదుర్గంలో రికార్డు ధర**

నగరంలో టీజీఐఐసీ భూముల వేలానికి అనూహ్య స్పందన లభించింది. రాయదుర్గంలోని పాన్‌మక్తాలో భూమి రికార్డు ధర పలికింది. ఎకరం రూ.237 కోట్లు పలికినట్లు అధికారులు తెలిపారు. సర్వే నంబర్ 83/1లో 6 ఎకరాల 29 గుంటలకు ఇంకా వేలం కొనసాగుతోంది. గతేడాది అక్టోబర్‌లో ఇదే ప్రాంతంలో ఎకరం ధర రూ.177 కోట్లు పలికింది.



# జల వివాదాలను సహకార ధోరణితో పరిష్కరించుకోవాలి

**రాష్ట్రాలకు మోదీ కీలక సూచన**

**కెన్-బెట్వా నదుల అనుసంధాన ప్రాజెక్టుపై ప్రధాని సమీక్ష**


న్యూఢిల్లీ(జనంసాక్షి):అంతర్రాష్ట్ర జల వివాదాలను సహకార ధోరణితో పరిష్కరించుకోవాలని రాష్ట్రాలకు ప్రధాని నరేంద్ర మోదీ సూచించారు. సకాలంలో అనుమతులు, సాంకేతిక ఆధారిత పర్యవేక్షణ ద్వారా ఈ సమస్యలను అధిగమించాలన్నారు. ఈ విషయంలో కెన్–బెట్వా ప్రాజెక్టు ఓ నమూనాగా నిలవాలని చెప్పారు. కెన్–బెట్వా నదుల అనుసంధాన ప్రాజెక్టు సహా

మిగతా 9లో..



# ఆగని ఘర్షణలు

**అమెరికా స్థావరాలపై ఇరాన్ ప్రతీకార దాడులు**



## హర్మూజ్ సమీపంలో అమెరికా దాడులు..!

2 లో..

టెహ్రాన్(జనంసాక్షి):పశ్చిమాసియాలో మరోసారి ఉద్రిక్త పరిస్థితులు నెలకొన్నాయి. ఓవైపు శాంతి ఒప్పందంపై చర్చలు కొనసాగుతుండగానే.. అమెరికా– ఇరాన్ మధ్య భీకర ఘర్షణలు చోటుచేసుకున్నాయి. హర్మూజ్ సమీపంలో అమెరికా దాడులకు ప్రతీకారంగా ఇరాన్ క్షిపణులు ప్రయోగించింది. అగ్రరాజ్య సైనిక స్థావరాలే లక్ష్యంగా దాడులు చేపట్టింది.హర్మూజ్ జలసంధి సమీపంలోని ఇరాన్ సైనిక స్థావరాలపై అమెరికా దళాలు దాడులు చేశాయి. ఇది జరిగిన కాసేపటికే బందర్ అబ్బాస్ పోర్టు వద్ద కూడా పలుమార్లు పేలుడు శబ్దాలు వినిపించాయి. ఈ దాడులను ఇస్లామిక్ రివల్యూషనరీ గార్డ్ కోర్ దురాక్రమణ చర్యగా అభివర్ణించింది. అమెరికా పదే పదే కాల్పుల విరమణ ఒప్పందాన్ని ఉల్లంఘిస్తోందని ఇరాన్ ఆరోపించింది. ఇలాంటి దురాక్రమణలు కొనసాగితే.. తీవ్ర పరిణామాలు ఎదుర్కోవాల్సి ఉంటుందని హెచ్చరించింది.అంతేగాక, తాజా దాడులకు ప్రతీకారంగా గల్ఫ్ దేశాల్లోని అమెరికా బేస్‌లను తాము లక్ష్యంగా చేసుకున్నట్లు ఐఆర్‌జీసీ తెలిపింది. కానీ, అది ఎక్కడి

మిగతా 2లో..

## ప్రధాని కార్యాలయం పర్యవేక్షణలో..
# నీట్ రీటెస్ట్

**న్యూఢిల్లీ(జనంసాక్షి):**నీట్ పేపర్ లీక్ వ్యవహారం దేశవ్యాప్తంగా సంచలనం సృష్టించింది. దాంతో మే 3న జరిగిన ప్రవేశపరీక్ష రద్దు కావడంతో.. జూన్ 21 రీటెస్ట్ నిర్వహించేందుకు కేంద్ర విద్యాశాఖ నిర్ణయించిన సంగతి తెలిసిందే. ఈ నేపథ్యంలో మరోసారి ఎలాంటి లోపాలు తలెత్తకుండా కేంద్రం చర్యలు తీసుకుంటోంది. ఈసారి రీటెస్ట్ ప్రక్రియను ప్రధానమంత్రి కార్యాలయం నిశితంగా పరిశీలిస్తున్నట్లు జాతీయ మీడియా కథనాలు వెల్లడించాయి. దిల్లీలోని తన నివాసంలో రక్షణశాఖ మంత్రి రాజ్‌నాథ్ సింగ్ ఉన్నతస్థాయి సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా నీట్ రీటెస్ట్‌లో ఎలాంటి అవకతవకలు జరగకుండా తీసుకోవాల్సిన చర్యలపై చర్చించారు. తాజాగా జరిగిన సమావేశంలో కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్, కేంద్రమంత్రి జ్యోతిరాదిత్య సింధియా, ఎన్టీఏ డైరెక్టర్ జనరల్ అభిషేక్ సింగ్, పీఎంఓ ఉన్నతాధికారులు పాల్గొన్నారు. పేపర్ తయారు చేయడం, ప్రింటింగ్, ట్రాన్స్‌పోర్టేషన్, పరీక్షా కేంద్రాలకు చేర్చడం వంటి ప్రతి ప్రక్రియను ప్రధాన మంత్రి కార్యాలయం పర్యవేక్షించనుందని సంబంధిత వర్గాలు వెల్లడించాయి. ఈ పరీక్షకు సంబంధించి ప్రతి అప్‌డేట్‌ను మోదీ తెలుసుకుంటున్నారని పేర్కొన్నాయి. ఈ రీటెస్ట్‌కు దేశవ్యాప్తంగా 23 లక్షల మంది హాజరుకానున్నారు.

# నేను బాధ్యత తీసుకుంటున్నా

### సీబీఎస్ఈ ఓఎస్ఎం వివాదంపై ధర్మేంద్ర ప్రధాన్

న్యూఢిల్లీ(జనంసాక్షి):సీబీఎస్ఈ 12వ తరగతిలో ఈ ఏడాది కొత్తగా ప్రవేశపెట్టిన ఆన్‌స్క్రీన్ మార్కింగ్ పద్ధతిపై తీవ్ర ఆందోళనలు వ్యక్తమవుతున్నాయి. ఈ విధానం కారణంగానే తమ సమాధాన పత్రాలు తారుమారయ్యాయని కొందరు విద్యార్థులు ఆరోపించడంతో సీబీఎస్ఈ తీరుపై విమర్శలు వ్యక్తమయ్యాయి. ఈ నేపథ్యంలో కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ స్పం దించారు. మూల్యాంకన ప్రక్రియలో అవకతవకలు జరిగినట్లు తేలితే.. బాధ్యులను వదిలిపెట్టబోమని విద్యార్థులు, తల్లిదండ్రులకు హామీ ఇచ్చారు. అలాగే ఈ వైఫల్యాలకు తాను బాధ్యత తీసుకుంటున్నట్లు వెల్లడించారు. "వాటిని సరిచేస్తాం. పరిష్కారాలను కనుగొంటాం" అని దిల్లీలో సీబీఎస్ఈ అధికారులతో నిర్వహించిన సమావేశం అనంతరం ప్రధాన్ మీడియాకు తెలిపారు."98 లక్షల సమాధాన పత్రాల కాపీలను ఆన్‌లైన్‌లో అందుబాటులో ఉంచాం. ఒక్కో సమాధాన పత్రంలో 40 పేజీలు ఉంటాయి. ఆ లెక్కన 40 కోట్ల కాపీలను స్కాన్ చేశాం. ఆన్‌స్క్రీన్ మార్కింగ్ సిస్టమ్ అనేది ఒక ముందడుగు. ఇప్ప టికే అంతర్జాతీయంగా దీనిని వినియోగిస్తున్నారు. ఇది విద్యా ర్థుల కోసం తీసుకువచ్చింది. వారి మార్కుల గురించి పారదర్శక సమాచారం అందించేలా దీనిని ఏర్పాటు చేశాం" అని మంత్రి వివరించారు. డిజిటల్ ఇండియా, శాస్త్రీయ పురోగతికి సం బంధించిన వ్యవస్థలను కొందరు పదేపదే వ్యతిరేకిస్తున్నారంటూ కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీని ఉద్దేశించి ప్రధాన్ విమర్శలు చేశారు. "రాజకీయాలు తర్వాత చేయొచ్చు. విద్యార్థులపై మానసిక ఒత్తిడి పెరగకుండా చూడటమే ఇప్పుడు ముఖ్యమైన విషయం. ఇప్పటికే మార్కులు, వెరిఫికేషన్, రీవాల్యుయేషన్ వంటి వాటితో ఆందోళనకు గురవుతున్న విద్యార్థులపై మరింత ఒత్తిడి పెంచేలా బహిరంగ ప్రకటనలు చేయొద్దు" అని అన్ని వర్గాలను కోరారు.

స్పందించిన సీబీఎస్ఈ..

ఓఎస్ఎం విధానంపై సీబీఎస్ఈ స్పందించింది. ఇది సురక్షితమైన ఐటీ ప్లాట్‌ఫామ్ అని పేర్కొంది. మూల్యాంకన పోర్టల్‌లో ఎలాంటి లోపాలు బయటపడలేదని తెలిపింది. సమాధాన పత్రాల స్కానింగ్, ప్రాసెసింగ్‌కు డిజిటల్ వ్యవస్థ ఉందని పేర్కొంది.

ఏంటీ 'ఓఎస్ఎం' వివాదం..?

మే 13వ తేదీన సీబీఎస్ఈ బోర్డు 12వ తరగతి పరీక్షల ఫలితాలను విడుదల చేసింది. ఇందులో ఉత్తీర్ణత గతేడాదితో పోలిస్తే 3 శాతం తగ్గింది. అయితే, ఈ ఏడాది జవాబు పత్రాల మూల్యాంకనం కోసం కొత్తగా తీసుకొచ్చిన ఆన్-స్క్రీన్ మార్కింగ్ (ఓఎస్ఎం) వల్లే తమకు తక్కువ మార్కులు వచ్చాయని కొంతమంది విద్యార్థులు ఆందోళన వ్యక్తంచేశారు. దీంతో స్పందించిన బోర్డు.. విద్యార్థులకు జవాబు పత్రాల స్కానింగ్ కాపీలను అందిస్తామని తెలిపింది. దాన్ని సరిచూసుకొని పునర్‌మూల్యాంకనానికి దరఖాస్తు చేసుకోవచ్చని సూచించింది. అయితే, ఈ పత్రాలు తారుమారయ్యాయని కొందరు విద్యార్థుల నుంచి ఫిర్యాదులొచ్చాయి. పునర్‌మూల్యాంకన ప్రక్రియలో భాగంగా సీబీఎస్ఈ అప్‌లోడ్ చేసిన భౌతికశాస్త్ర సమాధానపత్రం తనది కాదని దిల్లీకి చెందిన వేదాంత్ అనే విద్యార్థి ఆరోపించారు. సంజన అనే 12వ తరగతి విద్యార్థిని కూడా తన రసాయనశాస్త్ర సమాధాన పత్రం తారుమారైందని ఫిర్యాదు చేశారు. దీనిపై స్పందించిన బోర్డు సమస్యలను పరిష్కరిస్తామని హామీ ఇచ్చింది.

# తెలంగాణకు రెండురోజుల్లో నైరుతి




హైదరాబాద్(జనంసాక్షి):తీవ్రమైన ఎండలు, ఉక్కపోతతో అల్లాడిపోతున్న తెలంగాణ ప్రజలకు వాతావరణ శాఖ ఓ చల్లని కబురు అందించింది. ఎప్పుడెప్పుడా అని ఎదురుచూస్తున్న నైరుతి రుతుపవనాలు చురుగ్గా కదులుతూ రెండు రోజుల్లో రాష్ట్రంలోకి ప్రవేశించనున్నాయని వెల్లడించింది. ఈ రుతుపవనాల ప్రభావంతో రాష్ట్రవ్యాప్తంగా వాతావరణం ఒక్కసారిగా చల్లబడటమే కాకుండా, రాగల మూడు రోజుల పాటు విస్తారంగా వర్షాలు కురిసే అవకాశం ఉందని హైదరాబాద్ వాతావరణ కేంద్రం వెల్లడించింది. రుతుపవనాలు రాష్ట్రవ్యాప్తంగా పూర్తిగా విస్తరించడానికి ముందు రాబోయే రెండు రోజుల్లో గరిష్ఠ ఉష్ణోగ్రతలు నమోదయ్యే అవకాశముందని వాతావరణ శాఖ హెచ్చరించింది. ఉత్తర, తూర్పు తెలంగాణ జిల్లాల్లో వడగాలుల తీవ్రత ఎక్కువగా ఉంటుందని, పగటిపూట ఉష్ణోగ్రతలు సాధారణం కంటే మరింత ఎక్కువయ్యే ప్రమాదం ఉందని పేర్కొంది. అందువల్ల రుతుపవనాలు పూర్తిగా ప్రవేశించే వరకు ప్రజలు అప్రమత్తంగా ఉండాలని, ఎండ తీవ్రత దృష్ట్యా మధ్యాహ్నం వేళల్లో తగు జాగ్రత్తలు తీసుకోవాలని అధికారులు సూచించారు.

# మద్దతు ధరకే తడిసిన ధాన్యాన్ని కొంటాం



పంట కొనుగోలు కోసం, అన్లోడింగ్ కోసం ఉపయోగించుకోవాలని తెలిపారు.రెవెన్యూ, హౌసింగ్, సమాచార పౌర సంబంధాల శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి మాట్లాడుతూ ఈ సారి వరి ధాన్యం రికార్డు స్థాయిలో పండిందని రైతులు పండించిన ధాన్యాన్ని చివరి గింజ వరకు కొనుగోలు చేయటం జరుగుతుందని ఎవరు ఆందోళన చెందవద్దని అన్నారు. గత ప్రభుత్వం రైతుల బాధలు పట్టించుకోకుండా నేడు మొసలి కన్నీరు కారుస్తూ రైతులను, ప్రజలను మభ్య పెట్టేందుకు ప్రయత్నిస్తుందని దయ్యాలు వేదాలు వల్లిస్తున్నట్లుందని అన్నారు. మద్దతు ధర ప్రకటించిన ప్రకారం రైతులు పండించిన ధాన్యాన్ని సేకరిస్తూ అత్యధిక మొత్తంలో డబ్బులు జమ చేయడం జరిగిందని అన్నారు.ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు మాట్లాడుతూ ఈసారి వరి ధాన్యం ఎక్కువ దిగుబడి వచ్చిందని, రైతుల పక్షాన ప్రభుత్వం ఉందని, రైతులు పండించిన ప్రతి గింజను కొనుగోలు చేయడం జరుగుతుందని అన్నారు.జిల్లా కలెక్టర్ అనురాగ్ జయంతి మాట్లాడుతూ జిల్లాలో ఇప్పటి వరకు 2,75,686.220 మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలు చేయడం జరిగింది. జిల్లాలో రైతులు పండించిన ధాన్యాన్ని కొనుగోలు చేస్తున్నామని, రైతులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా తడిసిన ధాన్యాన్ని కూడా కొనుగోలు చేయడం జరుగుతుందని అన్నారు. ఈ కార్యక్రమంలో రెవెన్యూ డివిజనల్ అధికారులు కృష్ణా రెడ్డి, శేఖర్ రెడ్డి, జిల్లా గ్రామీణాభివృద్ధి అధికారి నాగిరెడ్డి, జిల్లా సివిల్ సప్లై మేనేజర్ హరికృష్ణ, జిల్లా పౌర సరఫరాల అధికారి రోజా రాణి, జిల్లా వ్యవసాయ అధికారి రమణారెడ్డి, మండల తహసిల్దార్లు, ఏఈఓలు, సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

# దేశానికి ఆదర్శంగా ఫ్యూచర్ సిటీ



అవసరాలను దృష్టిలో ఉంచుకుని ఫ్యూచర్ సిటీని అత్యాధునిక సౌకర్యాలతో అభివృద్ధి చేస్తోందన్నారు. విద్య, నైపుణ్యాభివృద్ధి, ఉపాధి అవకాశాల కల్పనకు కేంద్రంగా స్కిల్ యూనివర్సిటీ నిలవబోతోందని చెప్పారు. ఫ్యూచర్ సిటీ డెవలప్‌మెంట్ అథారిటీ కార్యాలయం ద్వారా నగర అభివృద్ధి పనులకు మరింత వేగం చేకూరుతుందని పేర్కొన్నారు. నిర్మాణ పనులను నాణ్యతతో, నిర్దేశిత గడువులో పూర్తి చేయాలని అధికారులకు సూచించారు. ఫ్యూచర్ సిటీ అభివృద్ధిపై ప్రభుత్వం దృష్టి సారించిందని మంత్రులు శ్రీధర్ బాబు, పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి అన్నారు. స్కిల్ యూనివర్సిటీ శాశ్వత క్యాంపస్ పనులను తనిఖీ చేశారు. క్షేత్రస్థాయిలో పనుల పురోగతిని సమీక్షించారు. నిర్మాణ పనుల్లో వేగం పెంచాలని అధికారులకు మంత్రులు ఆదేశాలు జారీ చేశారు. ఎఫ్‌సీడీఏ కార్యాలయం, స్కిల్ యూనివర్సిటీ పనులపై మార్గనిర్దేశర చేశారు. నిర్దేశిత గడువులో పనులు పూర్తి చేయాలని సూచించారు. ఆధునిక మౌలిక వసతులతో ఫ్యూచర్ సిటీ రూపుదిద్దుకుంటోందని తెలిపారు. ఫ్యూచర్ సిటీ దేశానికి తలమానికంగా నిలవడం ఖాయమని మంత్రులు స్పష్టం చేశారు.

# సవాళ్లు చేయడం, పారిపోవడం కాంగ్రెస్‌కు అలవాటే

### డబుల్ ఇళ్లపై ఇచ్చిన మాటకు కట్టుబడి ఉండాలి: కేటీఆర్

**హైదరాబాద్(జనంసాక్షి):** సవాళ్లు చేయడం, పారిపోవడం కాంగ్రెస్ నేతలకు అలవాటేనని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ విమర్శించారు. రాష్ట్రంలో ఇందిరమ్మ ఇళ్లు లేని గ్రామాల్లో కాంగ్రెస్ పార్టీ ఓట్లు అడగదని.. డబుల్ బెడ్‌రూం ఇళ్లు లేని గ్రామాల్లో బీఆర్ఎస్ ఓట్లు అడగకూడదని ఇటీవల కేటీఆర్‌కు మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి సవాల్ విసిరారు. ఈ నేపథ్యంలో కేటీఆర్ స్పందించారు. "ఆత్మగౌరవ గృహాలు కట్టిన ఆత్మగౌరవ పార్టీ మాది. స్వరాష్ట్రాన్ని సాధించాం.. స్వగృహ స్వప్నాలను సాకారం చేశాం. డబ్బా ఇళ్లు కాదు.. డబుల్ బెడ్ రూం ఇళ్లు నిర్మించాం. 20 లక్షల ఇందిరమ్మ ఇళ్లు ఇచ్చాకే ఓట్లు అడుగుతామని ఛాలెంజ్ చేసిన మంత్రికి మాట నిలబెట్టుకునే దమ్ముందా? శపథం చేయడం కాదు.. చేతనైతే చేసి చూపించాలి. 20 లక్షల గృహ ప్రవేశాలు చేయించాకే.. ఓట్లు అడుగుతాం అనే సవాల్‌కు కట్టుబడి ఉండాలి. హైదరాబాద్ నగరంలో లక్ష డబుల్ బెడ్ రూం ఇళ్లు నిర్మించిన ఘనత మాది. రూ.70 వేలతో మేం అగ్గిపెట్టె ఇళ్లు కట్టలేదు. మేం కట్టిన ఒక్కో ఇల్లు.. 7 ఇందిరమ్మ ఇళ్లతో సమానం. వీకెండ్‌లో ప్రజలు ఇళ్లు కూల్చి వికృతానందం పొందుతున్నారు. రెండున్నరేళ్లలో నగరంలో కట్టిన ఇళ్లు ఎన్ని?పడగొట్టిన ఇళ్లు ఎన్ని?.. దీనిపై శ్వేతపత్రం ప్రకటించే ధైర్యం ఉందా? మీరెన్ని ప్రగల్భాలు పలికినా, డైవర్షన్ డ్రామాలు ఆడినా 420 హామీల ఎన్నికల మోసాన్ని ఎండగట్టకుండా వదిలిపెట్టం" అని కేటీఆర్ పేర్కొన్నారు.




# జూన్ 2ను ఆర్టీసీ విలీనం దినంగా ప్రకటించాలి

**ఎంపిలను కలిసి విన్నవించిన జెఎసి నేతలు**

**ఆర్టీసీ విలీనంపై స్పష్టత కోరుతూ 1న ఇందిరాపార్క్ వద్ద దీక్ష**

**తెలంగాణ జాతీయ మజ్దూర్ యూనియన్ ప్రకటన**

హైదరాబాద్(జనంసాక్షి):ఆర్టీసీ ఎన్నికల కంటే ముం దుగానే జూన్ 2న విలీనం అపాయింటెడ్ డేట్ ను ప్రభుత్వం ప్రకటించాలని టీజీఎస్ ఆర్టీసీ జేఏసీ నాయకులు డిమాండ్ చేశారు. గురువారం ముఖ్యమం త్రి రాజకీయ ప్రధాన సలహాదారులు, ఎంపీ వేం నరేందర్ రెడ్డి కి, ఎంపీ రఘురామ్‌రెడ్డిని జేఏసీ నాయకులు కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా జేఏసీ చైర్మన్ ఈదురు వెంకన్న, వైస్ చైర్మన్ థామస్ రెడ్డి మాట్లాడుతూ రవాణా శాఖ మంత్రి ఇటీవల ఆర్టీసీలో గుర్తింపు ఎన్నికలు జరిగిన తరువాతనే విలీనం పక్రియను ప్రారంభిస్తామని వెల్లడించడంపై వారు అభ్యంతరం వ్యక్తం చేశారు. రిటైర్డ్ ఉద్యోగుల బకాయిలను చెల్లించడానికి ప్రభుత్వం తగిన నిధులను విడుదల చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో కన్వీనర్ ఎండీ మౌలానా, కో కన్వీనర్ కత్తుల యాదయ్య, కో కన్వీనర్లు సుద్దాల సురేష్, యాదగిరి, బాబు, బుద్ద విశాల్, రవికిరణ్ పాల్గొన్నారు.ఇదిలావుంటే ఆర్టీసీ ఉద్యోగులను ప్రభుత్వంలో విలీనం చేస్తున్నట్లుగా అపాయింటెడ్ డే ప్రకటించాలని తెలంగాణ జాతీయ మజ్దూర్ యూనియన్ నాయకులు డిమాండ్ చేశారు. ఈ మేరకు జూన్ 1వ తేదీన హైదరాబాద్‌లోని ఇందిరా పార్క్ వద్ద సామూహిక దీక్ష నిర్వహించనున్నట్లు ప్రకటించారు. అత్యవసర సమావేశంలో ఈ నిర్ణయం తీసుకున్నట్లుగా తెలిపారు. యూనియన్ ఎన్నికలకు ముందుగా ఉద్యోగుల పక్రియ పూర్తి చేయాలని.. 2026 మే 1 నుంచి అపాయింటెడ్ డే ప్రకటించాలని టీజేఎం యూ నాయకులు డిమాండ్ చేశారు. అపాయింటెడ్ డే కంటే ముందుగా యూనియన్ ఎన్నికలు నిర్వహిస్తామని రాష్ట్ర రవాణా శాఖ మంత్రి ప్రకటించడంతో ఉద్యోగుల్లో అయోమయం నెలకొందని వారు అభిప్రాయపడ్డారు. జూన్ 1వ తేదీ ఉదయం 10 గంటల నుంచి సాయంత్రం 4 గంటల వరకు ఇందిరాపార్క్ వద్ద దీక్ష నిర్వహించనున్నట్లు టీజేఎంయూ వ్యవస్థాపక రాష్ట్రకార్యదర్శి హనుమంతు ముదిరాజ్ తెలిపారు. ప్రభుత్వంలో విలీనం కోరుకునే ఉద్యోగులంతా యూనియన్లకు అతీతంగా దీక్షలో పాల్గొని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు.

## ఆగని ఘర్షణలు

స్థావరం అనే విషయాన్ని వెల్లడించలేదు. అయితే తమ గగనతలంపైకి క్షిపణులు, డ్రోన్‌లు దూసుకొచ్చాయని కువైట్ దళాలు పేర్కొన్నాయి. వాటిని సమర్థవంతంగా అడ్డుకున్నట్లు వెల్లడించాయి.

# హర్మూజ్ సమీపంలో అమెరికా దాడులు..!

ఇరాన్‌పై అమెరికా మరోసారి దాడులకు దిగింది. హర్మూజ్ జలసంధి సమీపంలోని ఒక సైనిక స్థావరాన్ని యూఎస్ దళాలు లక్ష్యంగా చేసుకున్నాయి. జలసంధి సమీపంలో ఉన్న అమెరికా బలగాలకు, నౌకల రవాణాకు ముప్పు పొంచి ఉందనే కారణంతో ఈ దాడులు చేసినట్లు తెలుస్తోంది. వ్యూహాత్మకంగా సున్నితమైన హర్మూజ్ జలసంధి ప్రాంతంలో భద్రతాపరమైన చర్యల్లో భాగంగానే ఈ ఆపరేషన్ చేపట్టినట్లు యూఎస్ అధికారి పేర్కొన్నారు. ఇక్కడి ఒక అమెరికా వాణిజ్య నౌకను లక్ష్యంగా చేసుకుని ఇరాన్ నాలుగు డ్రోన్‌లను ప్రయోగించిందని తెలిపారు. ఆ డ్రోన్‌లను అమెరికా దళాలు సమర్థవంతంగా అడ్డుకున్నాయని వెల్లడించారు. టెహ్రాన్ మరిన్ని దాడులకు పాల్పడకముందే.. తమ దళాలు దాని సైనిక స్థావరాన్ని లక్ష్యంగా చేసుకున్నాయని పేర్కొన్నారు. ఇవి ముందుచూపుతో, పూర్తిగా ఆత్మరక్షణ కోసం చేపట్టిన చర్యలని సమర్థించుకున్నారు. ఈ దాడి కారణంగా ఎవరైనా ప్రాణాలు కోల్పోయారా లేదా అనే విషయం ఇంకా తెలియరాలేదు. కాగా.. హర్మూజ్ సమీపంలో యూఎస్ పదే పదే సైనిక చర్యలకు దిగడంపై ఇరాన్ తీవ్రంగా మండిపడింది. ఇరుదేశాల మధ్య కుదిరిన కాల్పుల విరమణ ఒప్పందాన్ని ఆ దేశం ఉల్లంఘించిందని ఆరోపించింది. ఇదిలాఉండగా.. ఈ దాడులకు ముందు ఇరాన్‌లోని బందర్ అబ్బాస్ ఓడరేవు పట్టణ సమీపంలో పేలుళ్లు వినిపించాయి. మూడుసార్లు పేలుడు శబ్దాలు వినిపించడంతో.. ఇరాన్ వైమానిక దళాలు అప్రమత్తమయ్యాయి. అయితే, ఈ పేలుళ్లు ఎలా జరిగాయనే దానిపై స్పష్టత లేదు.

**అబ్రహాంపై సంతకాలు చేస్తేనే.. ఇరాన్‌తో ఒప్పందం**

అబ్రహాం ఒప్పందంపై సంతకాల విషయంలో గల్ఫ్ దేశాలపై అమెరికా అధ్యక్షుడు ట్రంప్ ఒత్తిడిని తీవ్రతరం చేశారు. క్యాబినెట్ సమావేశం అనంతరం నిర్వహించిన విలేకరుల సమావేశంలో ట్రంప్ మాట్లాడుతూ పలు కీలక వ్యాఖ్యలు చేశారు. అబ్రహాం ఒప్పందాల పై పాకిస్థాన్, ఈజిప్ట్, తుర్కియే, ఖతార్, సౌదీ అరేబియా సంతకాలు చేయడానికి అంగీకరిస్తేనే.. ఇరాన్‌తో ఒప్పందం చేసుకుంటామని తేల్చి చెప్పేశారు.

# కర్ణాటక తదుపరి సీఎంగా డీకే శివకుమార్

ముఖ్యమంత్రి పదవికి రాజీనామా చేశా. దాన్ని గవర్నర్ ఆమోదిస్తారనే విశ్వాసం ఉంది. అసెంబ్లీలో కాంగ్రెస్‌కు సంపూర్ణ మెజార్టీ ఉంది. రాజ్యాంగబద్ధంగా కొత్త ప్రభుత్వం ఏర్పడుతుంది. ఇప్పటివరకు ప్రభుత్వ నిర్వహణలో నాకు సహకరించిన అందరికీ ధన్యవాదాలు. సీఎంగా నాకు అవకాశమిచ్చిన సోనియా, రాహుల్, ఖర్గేకు కృతజ్ఞతలు. 7 కోట్ల మంది కర్ణాటక ప్రజలకు సేవ చేసే అవకాశం లభించింది. రాజ్యాంగమే మా ధర్మం. ప్రజలే మాకు దేవుళ్లు అని సిద్ధరామయ్య తెలిపారు. జాతీయ రాజకీయాల్లోకి రావాలని హైకమాండ్ అడిగింది. రాజ్యసభ సీటు ఆఫర్ చేసింది. కానీ, నేను సున్నితంగా తిరస్కరించా. జాతీయ స్థాయి రాజకీయాలపై నాకు ఆసక్తి లేదు. అయితే, రాజకీయాల నుంచి వైదొలిగే ప్రసక్తే లేదు. ప్రజలు నన్ను 5 ఏళ్ల కాలానికి ఎన్నుకున్నారు. ఇంకా రెండేళ్లు మిగిలి ఉన్నాయి. అప్పటివరకు ఎమ్మెల్యేగానే కొనసాగుతానని స్పష్టం చేశారు. ఈ సందర్భంగా తన రాజకీయ ప్రస్థానాన్ని, పదవీకాలాన్ని గుర్తుచేసుకుంటూ సిద్ధరామయ్య ఒకింత భావోద్వేగానికి గురయ్యారు. నేను పొరపాటున రాజకీయాల్లోకి వచ్చా. మా కుటుంబంలో అంతకుముందు ఎవరూ రాజకీయాల్లో లేరు. 2006లో కాంగ్రెస్‌లో చేరినప్పటి నుంచి హైకమాండ్ నన్ను ఆదరించింది. సీఎం అవుతానని కలలో కూడా అనుకోలేదు. అలాంటిది ముఖ్యమంత్రిగా, ప్రతిపక్ష నేతగా రెండేసిసార్లు సేవలందించాను. మ్యానిఫెస్టోలో ఇచ్చిన 160 హామీల్లో 158 నెరవేర్చా. మొదటి ఏడాదిలోనే ఐదు గ్యారెంటీలు అమలు చేశాం. నాపై ప్రతిపక్షాలు వదంతులు ప్రచారం చేశాయి. కానీ, నా రాజకీయ జీవితం తెరిచిన పుస్తకం. పదవి కోసం, డబ్బు కోసం ఏనాడూ పాకులాడలేదని సిద్ధరామయ్య వివరించారు. ఈ క్రమంలో అధిష్టానంతో భేటీకి సిద్ధరామయ్య దిల్లీ వెళ్లనున్నట్లు సమాచారం. కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీతో భేటీ కానున్నారు. కర్ణాటక కాంగ్రెస్ ఎమ్మెల్యేల సమావేశానికి సంబంధించి నిర్ణయం తీసుకోనున్నట్లు సమాచారం. సిద్ధరామయ్య స్థానంలో రాష్ట్ర నూతన ముఖ్యమంత్రిగా డీకే శివకుమార్ బాధ్యతలు చేపట్టడం దాదాపు ఖాయంగానే కనిపిస్తోంది. శనివారం జరిగే సీఎల్పీ సమావేశంలో కొత్త శాసనసభాపక్ష నేతను ఎన్నుకునే అవకాశం ఉంది. ప్రమాణస్వీకార కార్యక్రమంపై అధికారిక ప్రకటన ఇంకా వెలువడలేదు.

**సిద్ధరామయ్యకు డికె పాదాభివందనం**

కర్నాటక కాంగ్రెస్‌లో మార్పు అనివార్యమయ్యింది. సిద్ధరామయ్య తన సీఎం పదవి నుంచి తప్పుకునేందుకు సిద్ధమయ్యారు. ఈ క్రమంలో బెంగుళూరులో ఆసక్తికర ఘటన చోటుచేసుకున్నది. సీఎం సిద్ధరామయ్యను ఆలింగనం చేసుకున్న డిప్యూటీ సీఎం శివకుమార్ ఆ తర్వాత పాదాభివందనం చేశారు. సిద్ధరామయ్య కాళ్లను మొక్కి డీకే శివ.. ఆయన ఆశీర్వాదం తీసుకున్నారు. బ్రేక్‌ఫాస్ట్ మీటింగ్ సమయంలో ఈ ఘటన జరిగింది. గురువారం రాష్ట్ర గవర్నర్ థావర్‌చాంద్ గెహ్లాట్ అపాయింట్‌మెంట్ సిద్ధరామయ్య తీసుకున్నారు. ఉదయం తన క్యాబినెట్ మిత్రులకు సీఎం సిద్ధరామయ్య అల్పాహార విందు ఏర్పాటు చేశారు. తన అధికార నివాసంలో ఈ కార్యక్రమం జరిగింది. డిప్యూటీ సీఎం డీకే శివకుమార్‌తో పాటు ఆయన క్యాబినెట్ మిత్రులు కూడా బ్రేక్‌ఫాస్ట్ మీటింగ్‌కు హాజరయ్యారు. శివకుమార్‌ను సీఎం సిద్ధరామయ్య హత్తుకున్న ఫోటోను సీఎంవో ఆఫీసు రిలీజ్ చేసింది. ఇక తర్వాత సిద్ధరామయ్య పాదాలను శివకుమార్ తాకారు. ఆయన ఆశీర్వాదం తీసుకున్నారు. కాంగ్రెస్ పార్టీ హైకమాండ్ ఆదేశాల ప్రకారమే సీఎం సిద్ధరామయ్య తన పదవి నుంచి తప్పుకున్నారు.

## ముఖ్యమంత్రి డీకే పేరును ప్రతిపాదించిన సిద్ధూ..!

పేరును ప్రతిపాదించినట్లు సమాచారం. ఈ మేరకు బ్రేక్‌ఫాస్ట్ మీటింగ్‌లో సిద్ధూ ఈ ప్రతిపాదనలు చేసినట్లు రాష్ట్ర మంత్రి హెచ్‌కే పాటిల్ వెల్లడించారు. నాయకత్వ మార్పు వేళ సిద్ధూ గురువారం ఉదయం తన నివాసంలో రాష్ట్ర మంత్రులకు బ్రేక్‌ఫాస్ట్ మీటింగ్ ఏర్పాటు చేశారు. ఈ సమావేశం అనంతరం మంత్రి హెచ్‌కే పాటిల్ మీడియాతో మాట్లాడుతూ.. సిద్ధరామయ్య మధ్యాహ్నం రాజీనామా చేస్తారని తెలిపారు. కొత్త ముఖ్యమంత్రిగా డీకే బాధ్యతలు తీసుకోనున్నట్లు వెల్లడించారు. బ్రేక్‌ఫాస్ట్ మీటింగ్‌లో సిద్ధరామయ్య స్వయంగా డీకే పేరును ప్రతిపాదించినట్లు పేర్కొన్నారు. కాగా.. కొత్త సీఎం శనివారం ప్రమాణస్వీకారం చేయనున్నట్లు కాంగ్రెస్ వర్గాలు ఇప్పటికే పేర్కొన్నాయి. ఇక, సిద్ధరామయ్య రాజీనామాను సీఎం కార్యాలయం అధికారికంగా ప్రకటించింది. ఈరోజు మధ్యాహ్నం 2:30కు ఆయన లోక్‌భవన్‌కు వెళ్లనున్నట్లు తెలిపింది. అక్కడ గవర్నర్‌ను కలిసి ఆయన రాజీనామా లేఖను అందజేయనున్నట్లు పేర్కొంది. రాజీనామా అనంతరం రాష్ట్రంలో చోటుచేసుకున్న నాయకత్వ మార్పును గురించి సిద్ధూ తన నివాసంలో మీడియాతో మాట్లాడనున్నారు.

# కేరళంలో ఈడీ అధికారులపై దాడి

### 8మందిని అరెస్ట్ చేసినట్లు రాష్ట్ర డిజిపి వెల్లడి

తిరువనంతపురం(జనంసాక్షి):కేరళం మాజీ సీఎం పినరయి విజయన్ నివాసంలో ఈడీ రెయిడ్స్ సందర్భంగా అధికారులపై దాడికి యత్నించిన 8 మందిని అరెస్టు చేశామని రాష్ట్ర పోలీస్ చీఫ్ ఎ. చంద్రశేఖర్ గురువారం తెలిపారు. ఈ కేసుకు సంబంధించి ఇతర నిందితులను ఇప్పటికే గుర్తించామని కూడా తెలిపారు. హోం మంత్రి రమేశ్ చెన్నితాలతో సమావేశం అనంతరం ఆయన ఈ వివరాలు వెల్లడించారు. నిందితులపై కఠిన చర్యలు తీసుకోవాలని హోం మంత్రి ఆదేశించారని అన్నారు. బుధవారం ఈడీ రెయిడ్స్ గురించి తెలియగానే భారీ స్థాయిలో పోలీసులను పంపించామని కూడా పోలీస్ చీఫ్ తెలిపారు. 'తాము వస్తున్నట్టు ఈడీ అధికారులు ముందుగా మాకు చెప్పలేదు. కానీ ఆపరేషన్ మొదలవగానే మేము భద్రత కోసం సెక్యూరిటీని పంపించాము' అని తెలిపారు. ఈ కేసుకు సంబంధించి ఇప్పటివరకూ కేరళ పోలీసులు దాదాపు 300 మందిపై కేసులు పెట్టారు. అనుమతిలేకుండా గుమిగూడటం, ప్రభుత్వ అధికారులపై దాడి, అక్రమ నిర్బంధం, హత్యాయత్నం తదితర అభియోగాలతో కేసులు నమోదు చేశారు. మ్యూజియమ్ పోలీస్ స్టేషన్‌లో నమోదైన ఎఫ్ఐఆర్ ప్రకారం, ఈడీ అధికారులపై నిందితులు కర్రలతో దాడి చేశారు. ఈ క్రమంలో ఒక అధికారి చేయికి గాయమైంది. ఈడీ వాహనం అద్దాలు పగిలిపోయాయి. ఈ దాడిలో కారు డ్రైవర్ కూడా గాయపడ్డారు.

# తెలుగుజాతికి స్ఫూర్తి నింపిన నాయకుడు ఎన్టీఆర్

స్మరించుకోవాలి. రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బీఆర్ అంబేద్కర్, మాజీ ప్రధాని ఇందిరాగాంధీ, మాజీ సీఎం ఎన్టీఆర్ జాతిరత్నాలు. నిరంతరం వారి కీర్తి ప్రతిష్ఠలు, నిర్ణయాలను గుర్తుచేసుకోవాలి. అంబేద్కర్.. పురుషులతో సమానంగా మహిళలకు ఓటు హక్కు కల్పించారు. ఇందిరాగాంధీ.. భారత్‌ను ప్రపంచ దేశాల ముందు తలెత్తుకునేలా చేశారు. భూసంస్కరణలతో పేదలకు ఎంతో లబ్ధి చేకూర్చారు. తెలుగుజాతిలో స్ఫూర్తి నింపిన నేత ఎన్టీఆర్. బడుగు, బలహీనవర్గాల కోసం ఎన్నో కార్యక్రమాలు అమలు చేశారు. కాంగ్రెస్ సీఎం, పీసీసీ చీఫ్ ఎన్టీఆర్ విగ్రహాన్ని ఎలా ఆవిష్కరిస్తారని కొందరు ప్రశ్నిస్తున్నారు. కులమతాలు, ప్రాంతాలు, భాషలకు అతీతంగా దేశం గర్వించదగిన నాయకుడు ఎన్టీఆర్. అందుకే ఆయన విగ్రహాన్ని హైదరాబాద్ నడిబొడ్డులో ఆవిష్కరించుకున్నాం. నాకు జీవితకాలం గుర్తుండిపోయే మధుర జ్ఞాపకం. ఈ విషయంలో ఎవరు ఎలాంటి విమర్శలు చేసినా భయపడను. ఆనాడు ఇందిరాగాంధీ.. తెలంగాణ ప్రాంతం నుంచి పీవీ నరసింహారావు, మర్రి చెన్నారెడ్డి, వెంకటస్వామిలాంటి నేతలను అందించారు. ఎన్టీఆర్.. తెలంగాణ ప్రాంతానికి తుమ్మల నాగేశ్వరరావు, మండవ వెంకటేశ్వరరావు, కడియం శ్రీహరి, దేవేందర్‌గౌడ్, మోత్కుపల్లి లాంటి నాయకులను అందించారు. కేసీఆర్‌కు రాజకీయ భిక్ష పెట్టింది ఎవరు? ఎన్టీఆర్ నీడన బతికిన మీరు ఆయన్ను తక్కువ చేసి మాట్లాడటం సమంజసమా? ఎన్టీఆర్ లేకుండానే నాయకులయ్యారా? ఆయన ఆశీర్వాదంతోనే పాలితులుగా ఉన్న ఎంతో మంది పాలకులయ్యారు. గ్రామాల్లో పటేల్ పట్వారీ వ్యవస్థను ఎన్టీఆర్ రద్దు చేసి పేదలకు విముక్తి కల్పించారు. ఆయన పేరు పెట్టుకున్న కొందరు నకిలీలు కూడా రాజకీయాల్లో ఉన్నారు" అని రేవంత్ వ్యాఖ్యానించారు.

మైత్రీవనం సర్కిల్‌లో ఎన్టీఆర్ విగ్రహావిష్కరణ

హైదరాబాద్: నగరంలోని అమీర్‌పేట మైత్రీవనం సర్కిల్‌లో మాజీ సీఎం ఎన్టీఆర్ విగ్రహాన్ని తెలంగాణ సీఎం రేవంత్‌రెడ్డి ఆవిష్కరించారు. ఎన్టీఆర్ జయంతి సందర్భంగా ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు. మంత్రులు తుమ్మల నాగేశ్వరరావు పొన్నం ప్రభాకర్, అజహరుద్దీన్, పీసీసీ చీఫ్ మహేశ్‌కుమార్ గౌడ్, ఎన్టీఆర్ కుమారులు నందమూరి రామకృష్ణ, మోహనకృష్ణ, సినీనటుడు మంచు మనోజ్, దర్శకుడు బోయపాటి శ్రీను, పెద్ద ఎత్తున అభిమానులు ఈ కార్యక్రమానికి హాజరయ్యారు.

# జడ్చర్ల వద్ద రెండు బస్సుల ఢీ

### ప్రమాదంలో ఒకరు మృతి: 14మందికి గాయాలు

**మహబూబ్‌నగర్(జనంసాక్షి):**మహబూబ్‌నగర్ జిల్లాలోని జడ్చర్ల సమీపంలో 44వ జాతీయ రహదారిపై బుధవారం అర్ధరాత్రి ఘోర రోడ్డు ప్రమాదం జరిగింది. హైదరాబాద్ నుంచి తిరుపతి వెళ్తున్న ఓ ప్రైవేట్ బస్సును.. బెంగళూరు వైపు వెళ్తున్న మరో ట్రావెల్స్ బస్సు బలంగా ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో ఒకరు మృతిచెందగా, మరో 14 మంది ప్రయాణికులు గాయపడ్డారు. ఈ ప్రమాదం జరిగిన వెంటనే స్థానికులు, పోలీసులు సంఘటన స్థలానికి చేరుకుని సహాయక చర్యలు చేపట్టారు. గాయపడిన వారిని వెంటనే జడ్చర్ల ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. బస్సు డ్రైవర్‌కు తీవ్ర గాయాలు కావడంతో ఆయన పరిస్థితి విషమంగా ఉన్నట్లు వైద్యులు తెలిపారు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. ఈ ప్రమాదంలో మృతిచెందిన వ్యక్తిని తిరుపతి రిటైర్డ్ డీఎస్పీ సాంబశివారెడ్డి కుమారుడు అశోక్ రెడ్డిగా గుర్తించారు. అశోక్‌రెడ్డి మృతి వార్తతో కుటుంబ సభ్యులు తీవ్ర విషాదంలో మునిగిపోయారు. ఈ ప్రమాదానికి అధిక వేగం, డ్రైవర్ నిర్లక్ష్యమే కారణమై ఉండొచ్చని పోలీసులు అనుమానిస్తున్నారు. ప్రమాదం కారణంగా కాసేపు జాతీయ రహదారిపై ట్రాఫిక్ అంత రాయం ఏర్పడగా, పోలీసులు వాహనాలను మళ్లించి పరిస్థితిని అదుపులోకి తీసుకొచ్చారు.

## మైనర్ జీవితంతో చెలగాటమాడితే సహించబోం

- తప్పుడు వార్తలు రాసే మీడియా సంస్థలకు నోటీసులు
- మంత్రి దనసరి అనసూయ సీతక్క



**ఏటూరునాగారం, మే 28(జనంసాక్షి) :** ఏటూరునాగారంలో ఓ మైనర్ బాలిక వ్యవహారానికి సంబంధించి కొందరు ప్రతి పక్ష నాయకులు, వ్యక్తులు, కొన్ని మీడియా సంస్థలు ఉద్దేశపూర్వకంగా అసత్య ప్రచారాలు చేస్తున్నారని రాష్ట్ర పంచాయతీ రాజ్, గ్రామీణాభివృద్ధి, ఆర్ డబ్ల్యూ ఎస్, స్త్రీ శిశు సంక్షేమ శాఖ మంత్రి ధనసరి అనసూయ సీతక్క తీవ్రంగా ఖండించారు. ఈ ఘటనలో అసలు ఏం జరిగిందనే వాస్తవాలను, పోలీసులు, మహిళా-శిశు సంక్షేమ శాఖ అధికారుల దర్యాప్తులో తేలిన విషయాలను ప్రజల ముందు ఉంచేందుకు ఏటూరు నాగారంలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆమె మాట్లాడారు. అధికారుల విచారణ వివరాలు వెల్లడించేందుకు ప్రెస్ మీట్ ఏర్పాటు చేస్తే, కొందరు మీడియా ప్రతినిధులు దానిని బహిష్కరించి నిరసన చేపట్టడం విడ్డూరంగా ఉందని మంత్రి అన్నారు. ఒక కాంగ్రెస్ నాయకురాలి కుమారుడిపై ఎలాంటి ఆధారాలు లేకుండా అసత్య ఆరోపణలు చేసినందుకు వాస్తవానికి రోడ్డెక్కి నిరసన చేయాల్సింది మీరు కాదు.. మేము అని మంత్రి సీతక్క స్పష్టం చేశారు. కొన్ని మీడియా సంస్థలు రాజకీయ పార్టీలకు తొత్తులుగా మారి కాంగ్రెస్ పార్టీని బద్నాం చేస్తున్నాయని మంత్రి ధ్వజమెత్తారు. రేటింగ్స్, రాజకీయ ప్రయోజనాల కోసం తప్పుడు వార్తలు ప్రచురించి ఒక మైనర్ బాలిక జీవితంతో చెలగాటమాడుతున్నారని మండిపడ్డారు. ఉద్దేశపూర్వకంగా చేస్తున్న ఈ దుష్ప్రచారం వల్ల ఆ మైనర్ బాలిక కుటుంబం తీవ్ర మానసిక క్షోభకు గురవుతోందని ఆవేదన వ్యక్తం చేశారు. ఆరోపణలు చేస్తున్న వారి వద్ద నిజంగా సరైన ఆధారాలు ఉంటే, వాటిని పోలీసులకు సమర్పించి నిలదీయాలని మంత్రి సీతక్క సవాల్ విసిరారు. ఎలాంటి ఆధారాలు లేకుండా తప్పుడు కథనాలు ప్రచురిస్తున్న, ప్రసారం చేస్తున్న మీడియా సంస్థలకు లీగల్ నోటీసులు పంపుతామని మంత్రి సీతక్క హెచ్చరించారు.

## ప్రతిఘటనోద్యమాలతో బలపడతాం

- బీజేపీ, మతోన్మాద శక్తులకు వ్యతిరేకంగా పోరాడుతాం
- విజయన్‌పై ఈడీ దాడుల వెనుక బీజేపీ, కాంగ్రెస్ హస్తం
- సీపీఐ(ఎం) పొలిట్ బ్యూరో సభ్యులు బీవీ.రాఘవులు



**హైదరాబాద్ (జనంసాక్షి) :** బీజేపీ దుర్మార్గాలకు, మతోన్మాద శక్తులకు వ్యతిరేకంగా పోరాడుతున్న తమ పార్టీ నాయకులను కేసులతో భయపెట్టడం, బెదిరింపులకు దిగడం వంటి చర్యలకు మోడీ సర్కారు పూనుకున్నదని సీపీఐ(ఎం) పొలిట్‌బ్యూరో సభ్యులు బీవీ. రాఘవులు విమర్శించారు. బెదిరింపులకు, కేసులకు భయపడబోమనీ, ప్రతిఘటనా ఉద్యమాలతో మరింత బలపడతామని నొక్కి చెప్పారు. కేరళం మాజీ సీఎం పినరయి విజయన్‌పై ఈడీ దాడులను నిరసిస్తూ గురువారం హైదరాబాద్‌లోని ఆర్టీసీ క్రాస్‌రోడ్‌లో సీపీఐ(ఎం) ఆధ్వర్యంలో నిరసన కార్యక్రమం చేపట్టారు. ముందుగా ఎంబీ భవన్ (సీపీఎం రాష్ట్ర కార్యాలయం) నుంచి ఆర్టీసీ క్రాస్ రోడ్డు వరకు నినాదాలు చేస్తూ ప్రదర్శన నిర్వహించారు. ఆర్టీసీ క్రాస్ రోడ్డు వద్ద నిరసనలో రాఘవులు మాట్లాడుతూ..కేరళం మాజీ సీఎం, పొలిట్ బ్యూరో సభ్యులు పినరయి విజయన్‌పై ఒక్క అవినీతి కేసు కూడా లేదన్నారు. ఈడీ చెబుతున్న కేసులో నిందితులుగానీ, ఆ సంస్థగానీ ఏనాడూ విజయన్ పేరును ప్రస్తావించలేదని ఎత్తిచూపారు. ఇది ముమ్మాటికీ రాజకీయ దాడేనని తేల్చిచెప్పారు. కేరళంలో సీపీఐ(ఎం) బలహీనం చేయాలనే దుర్మార్గపూరిత ఆలోచనతో కాంగ్రెస్, బీజేపీలు కలిపి ఈ దాడికి ఉసిగొల్పాయనే అనుమానాలు వ్యక్తమవుతున్నాయని విమర్శించారు. ఢిల్లీలో సీపీఐ(ఎం) అఖిల భారత ప్రధాన కార్యదర్శి ఎంఏ బేబీ, పొలిట్‌బ్యూరో సభ్యులు బృందాకరత్, తదితరులు నిరసన తెలియజేసినందుకు అరెస్టు చేసి నిర్బంధించడాన్ని తప్పుబట్టారు. సీపీఐ(ఎం) రాష్ట్ర కార్యదర్శి జాన్‌వెస్లీ మాట్లాడుతూ.. ప్రతిపక్ష పార్టీలను దెబ్బతీసి అప్రతిష్టపాలు చేయడానికి అక్రమ కేసులు పెట్టడం, పార్టీలను చీల్చడం వంటి నియంతృత్వధోరణులను కొనసాగించడానికి రాజ్యాంగ సంస్థలను బీజేపీ వాడుకుంటున్నదని విమర్శించారు. ఈ కార్యక్రమంలో సీపీఐ(ఎం) కేంద్ర కమిటీ సభ్యులు టి.జ్యోతి, ఎస్.వీరయ్య, జి.నాగయ్య, రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు జూలకంటి రంగారెడ్డి(మాజీ ఎమ్మెల్యే), చుక్క రాములు, టి.సాగర్, పాలడుగు భాస్కర్, అబ్బాస్, మల్లులక్ష్మి, బండారు రవికుమార్, పి.ప్రభాకర్, నున్నా నాగేశ్వర్‌రావు, రాష్ట్ర కమిటీ సభ్యులు, హైదరాబాద్ జిల్లా నాయకులు పాల్గొన్నారు.

## బక్కని నర్సింహులు దిష్టిబొమ్మ దహనం

- నర్సింహులు తెలంగాణ ప్రజలకు క్షమాపణ చెప్పాలి
- తెలంగాణ యువజన సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి అనంతుల మధు



**సూర్యాపేట (జనంసాక్షి) :** తెలంగాణ యువజన సంఘము ఆధ్వర్యంలో సూర్యాపేట జిల్లా కేంద్రంలోని తెలంగాణ తల్లి విగ్రహం వద్ద టీటీడీపి రాష్ట్ర మాజీ అధ్యక్షులు బక్కని నర్సింహులు దిష్టిబొమ్మ దహనం చేసారు. ఈ సందర్భంగా తెలంగాణ యువజన సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి అనంతుల మధు మాట్లాడుతూ నిన్న మంగళగిరి లో జరిగిన టీడీపీ జాతీయ మహానాడులో షాద్ నగర్ మాజీ ఎమ్మెల్యే, టీటీడీపీ రాష్ట్ర మాజీ అధ్యక్షులు, పొలిట్ బ్యూరో సభ్యులు బక్కని నర్సింహులు తెలంగాణ అస్థిత్వాన్ని, ఆత్మ గౌరవాన్ని దెబ్బ తీసేలా మాట్లాడారని, తెలంగాణ అనే పదం 'డిక్షనరి'లో లేదని మంగళగిరి టీడీపీ మహానాడులో మాట్లాడటాన్ని తెలంగాణ యువజన సంఘము తీవ్రంగా ఖండిస్తుందని అన్నారు. తెలంగాణ అనేది 'డిక్షనరి'లో వెతికేందుకు ఒక 'పదం' కాదు అని, నాలుగు కోట్ల ప్రజల అస్తిత్వ, ఆత్మ గౌరవ 'పోరాట ప్రాంతం' అని, వందలాది సంవత్సరాల క్రితమే 'త్రిలింగదేశం'గా వర్ధిల్లిన ప్రాంతం తెలంగాణ అని, 'తెల్లాపూర్ శాసనం'లో తెలంగాణ గురించి స్పష్టంగా పేర్కొనబడిందని, చరిత్ర చదవకుండా కేవలం డిక్షనరిలో వెతికే మోకాళ్ళలో మెదడు కలిగి, సీమాంధ్ర నాయకుల మోచేతి నీళ్లు తాగుతూ తెలంగాణఅస్తిత్వం పై దాడి చేస్తే ఖబడ్దార్ బిడ్డ అని హెచ్చరించారు. తెలంగాణ అస్తిత్వంపై అనుచిత వ్యాఖ్యలు చేశారంటూ నిరసన వ్యక్తం చేసారు. తెలంగాణ అస్తిత్వాన్ని దెబ్బతీసే వ్యాఖ్యలు సహించ బోమని, తెలంగాణ ప్రజలకు బక్కని నరసింహులు క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేసారు. కార్యక్రమంలో తెలంగాణ యువజన సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షులు భాషిపంగు సునీల్, రాష్ట్ర అధికార ప్రతినిధి ఏనుగు సంతోష్ రెడ్డి,సూర్యాపేట జిల్లా ప్రధాన కార్యదర్శి గుగులోత్ సురేష్ నాయక్, జిల్లా నాయకులు దారవత్ వెంకటేష్ నాయక్, జక్కలి గోపి, చింతకాయల మహేష్, లావుడ్యా బాలాజీ నాయక్, పోలోజు మహేష్ చారి,తదితరులు పాల్గొన్నారు.

## చివరి ధాన్యం గింజవరకు కొంటాం

- మంత్రి వివేక్ వెంకటస్వామి వెల్లడి

**మంచిర్యాల, మే28 (జనంసాక్షి) :** తమ ప్రభుత్వం రైతన్నల సంక్షేమానికి ఎంతగానో కృషి చేస్తోందని మంత్రి వివేక్ వెంకటస్వామి తెలిపారు. చివరి ధాన్యం గింజ వరకు ధాన్యం కొనుగోళ్లు చేస్తామని పేర్కొన్నారు. గురువారం చెన్నూరు మండలం బావురావుపేటలో ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని మంత్రి వివేక్ వెంకటస్వామి సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. ఈసారి పంట దిగుబడి ఎక్కువగా వచ్చిందని తెలిపారు. జూన్ 6వ తేదీ వరకు ధాన్యం కొనుగోళ్ల ప్రక్రియ కొనసాగుతుందని వివరించారు. పెద్దపల్లిలో మూడు గోడౌన్స్ అలాట్‌మెంట్ చేశామని మంత్రి వివేక్ వెంకటస్వామి చెప్పారు. హామాలీల కొరతతో ధాన్యం కొనుగోలులో కొంత ఆలస్యం జరిగిందని తెలిపారు. సింగరేణి నుంచి 40 లారీలు, మైనింగ్ శాఖ నుంచి 40 లారీలను కేటాయించామని అన్నారు.

# భారత మామిడిపై జపాన్ నిషేధం!

- క్వారంటైన్ నిబంధనల్లో లోపాలు!?




**న్యూఢిల్లీ, మే 28 (జనంసాక్షి) :** భారత మామిడి ఎగుమతిదారులకు జపాన్ ప్రభుత్వం షాక్ ఇచ్చింది. ఈ సీజన్‌కు గాను భారత మామిడి పండ్ల దిగుమతులను పూర్తిగా నిషేధిస్తున్నట్లు ప్రకటించింది. భారత్‌లోని క్రిమిసంహారక కేంద్రాల్లో నాణ్యతా ప్రమాణాలు సరిగా లేవని జపాన్ తనిఖీ బృందం గుర్తించడమే ఇందుకు ప్రధాన కారణం. ఈ పరిణామంతో మామిడి ఎగుమతిదారులు తీవ్ర నిరాశకు గురయ్యారు. ఉత్తరప్రదేశ్‌లోని రెహ్మాన్‌పూర్‌లో ఉన్న ఒక ప్లాంట్‌లో వేపర్ హీట్ ట్రీట్‌మెంట్ (వీహెచ్ టీ) ప్రక్రియలో లోపాలు ఉన్నట్లు జపాన్ అధికారులు గుర్తించారు. పండ్లను తెగుళ్లు, కీటకాల నుంచి రక్షించడానికి ఈ ప్రక్రియ చాలా కీలకం. ఈ నేపథ్యంలో, మార్చి 2 తర్వాత జారీ చేసిన భారతీయ సర్టిఫికెట్లతో వచ్చే మామిడి షిప్‌మెంట్‌లను అంగీకరించబోమని జపాన్‌కు చెందిన యొకోహామా ప్లాంట్ ప్రొటెక్షన్ అసోసియేషన్ స్పష్టం చేసింది. ఈ నిషేధం కారణంగా కేసర్, అల్ఫాన్సో, లంగ్రా, బంగినపల్లి వంటి ప్రసిద్ధ రకాల ఎగుమతులు నిలిచిపోయాయి. భారత మామిడి ఎగుమతిదారులు ఇప్పటికే పలు సవాళ్లతో సతమతమవుతున్నారు. పశ్చిమాసియాలో సంక్షోభం కారణంగా ఎగుమతులు 20-30 శాతం పడిపోయాయి. రవాణా ఖర్చులు పెరగడంతో పాటు, కంటైనర్ల కొరత కూడా వేధిస్తోంది. మరోవైపు, దేశంలో తీవ్రమైన వడగాడ్పుల వల్ల పంట దిగుబడి తగ్గింది. ఇలాంటి క్లిష్ట పరిస్థితుల్లో జపాన్ నిషేధం వారిని మరింత కుంగదీసింది. 1986 నుంచి 2006 వరకు కూడా పండ్ల ఈగల కారణంగా జపాన్ భారత మామిడిపై నిషేధం విధించింది. వీహెచ్ టీ ప్రక్రియను అమలు చేశాకే ఆ నిషేధాన్ని ఎత్తివేశారు. ప్రస్తుత సమస్యను పరిష్కరించేందుకు భారత ప్రభుత్వం జపాన్‌తో చర్చలు జరుపుతున్నప్పటికీ, ఈ సీజన్‌లో ఎగుమతులు తిరిగి ప్రారంభం కావడం కష్టమేనని నిపుణులు భావిస్తున్నారు. ఈ అవకాశాన్ని పాకిస్థాన్, వియత్నాం, థాయ్‌లాండ్ వంటి దేశాలు అందిపుచ్చుకుంటున్నాయి.

## రైతులు గోస పడుతుంటే పట్టింపులేదా?

- అన్నదాతల బతుకులు కన్నీటిపాలు
- రైతు గోస బీజేపీ భరోసా కార్యక్రమంలో రేవంత్ రెడ్డిపై ఎంపీ ఈటల ధ్వజం



**ఖానాపూర్ / దిలావర్‌పూర్/ కడెం (జనంసాక్షి) :** రైతులు గోస పడుతుంటే పట్టింపులేదా? అని ఎంపీ ఈటల రాజేందర్ అన్నారు. రైతు గోస బీజేపీ భరోసా కార్యక్రమంలో భాగంగా బీజేఎల్పీ నేత మహేశ్వర్‌రెడ్డి, ఎమ్మెల్సీ అంజిరెడ్డి, ఎమ్మెల్యేలు పైడి రాకేష్ రెడ్డి, కాటిపల్లి వెంకటరమణారెడ్డి, రామారావు పటేల్,బీజేపీ నిర్మల్ జిల్లా అధ్యక్షులు రితీష్ రాథోడ్‌తో కలిసి ఖానాపూర్, దిలావర్‌పూర్, కడెం మండలాల్లో పర్యటించారు. బీజేపీ ప్రతినిధుల బృందం రైతులు కల్లాల్లో ఆరబెట్టిన ధాన్యం కుప్పలను పరిశీలించారు. ఆయా ప్రాంతాల్లో విలేకరులతో వారు మాట్లాడారు. రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వ ముందస్తు ప్రణాళిక లేని అసమర్థ పాలన వల్లే నేడు అన్నదాతల బతుకులు కన్నీటిపాలవుతున్నాయని వరి ధాన్యం కుప్పల వద్ద రైతులు ప్రాణాలు కోల్పోతున్న ప్రభుత్వానికి కనువిప్పు కలగడం లేదని, అరుగాలం కష్టపడి పండించిన పంట అమ్ముకోవడానికి రైతు నానా కష్టాలు పడుతుంటే ప్రభుత్వం చోద్యం చూస్తుందని రేవంత్ రెడ్డికి రైతులపై ఏమాత్రం ప్రేమ ఉన్న ధాన్యాన్ని తక్షణమే కొనుగోలు చేసి ధాన్యాన్ని గోదాంలకు తరలించాలని విజ్ఞప్తి చేశారు. ఎన్నికల సమయంలో వరంగల్ డిక్లరేషన్ ప్రకటించిన రేవంత్ రెడ్డి ఖానాపూర్ నియోజకవర్గ కేంద్రంలోని ప్రభుత్వ కొనుగోలు కేంద్రాలను సందర్శించి రైతు గోసను తెలుసుకోవాలని అన్నారు. రైతుల బాధ పట్టని ఎమ్మెల్యేలు ఢిల్లీలో వెళ్లి రాజకీయాలు చేస్తున్నారని ఎద్దేవా చేశారు. ఇప్పటికైనా ధాన్యం కొనుగోలు తరలింపు వేగవంతం చేయాలని వరం రోజుల్లో తడిసిన ధాన్యాన్ని సైతం ఏలాంటి కోతలు విధించకుండా కొనుగోలు చేసి రైస్ మిల్లులకు తరలించాలని డిమాండ్ చేశారు. 80% ధాన్యం కొనుగోలు చేసినం అని చెప్పుకునే కాంగ్రెస్ ప్రభుత్వానికి ఈ రోడ్లపై, కొనుగోలు కేంద్రాల వద్ద ధాన్యం కుప్పలు కనబడుతలేవ అని ప్రశ్నించారు. ఈ మాయమాటలు చెప్పడం మానుకోవాలని ఇత బోధ చేశారు. ఇకనైనా వట్టి మాటలు కట్టిపెట్టి గట్టిమేలు తలపెట్టేలా రైతుల పట్ల పనిచేస్తూ రైతులకు మేలు చేయాలని అన్నారు.

## చంద్రబాబు, బొక్క నరసింహులు ముక్కు నేలకు రాయండి

- బీఆర్ఎస్ అధికార ప్రతినిధి, బీసీ కమిషన్ మాజీ సభ్యులు ఉపేంద్ర




**హైదరాబాద్ (జనంసాక్షి) :** తెలంగాణ ఆత్మగౌరవం, అస్తిత్వాన్ని , చరిత్రను, పోరాటాలను, ఆత్మబలిదానాలను,కించపరిచే విధంగా మంగళగిరి తెలుగుదేశం పార్టీ మహానాడు సభలో మాట్లాడిన బొక్క నర్సింహులు, అతనితో మాట్లాడించిన చంద్రబాబు నాయుడు ఇద్దరూ అమరవీరుల స్థూపం ముందు మోకరిల్లి ముక్కు నేలకు రాసి తెలంగాణ ప్రజలకు క్షమాపణ చెప్పాలని బీఆర్ఎస్ అధికార ప్రతినిధి, బీసీ కమిషన్ మాజీ సభ్యుడు ఉపేంద్ర డిమాండ్ చేశారు. ఈ ప్రాంతంలో పుట్టి ఈ ప్రాంత కష్టసుఖాలు తెలిసిన నరసింహులు ఉన్న ఊరినీ కన్నతల్లినీ అవమానించిన వాడు ఎవరు బాగుపడలేదని బొక్క నరసింహులు కూడా తెలంగాణను అవమానించి చంద్రబాబు దగ్గర సాధించేది ఏమీ ఉండదని ఆయన అన్నారు ఇప్పటికైనా చంద్రబాబు నాయుడు తెలంగాణపై గతంలో ముఖ్యమంత్రిగా ఉన్నప్పుడు అసెంబ్లీలో తెలంగాణ అనే పదాన్ని ఉచ్చరించవద్దని హుకుం జారీ చేసిన ఆయనే ఇప్పుడు తన తాబేదారు అయిన బక్క నరసింహులు తో తెలంగాణ అనే పదం డిక్షనరీలో లేదు చరిత్ర లేదు అని చెప్పించి సభలో ముసిముసి నవ్వులు నవ్వుతూ పైశాచిక ఆనందాన్ని పొందుతూ తెలంగాణపై తన వ్యతిరేకతను మరొకసారి రుజువు చేసుకున్నాడని ఇలాంటి వ్యక్తులపై పార్టీలపై తెలంగాణ వాదులు ఉద్యమకారులు అప్రమత్తంగా ఉండాలని మిడిమిడి జ్ఞానంతో చరిత్ర తెలవని నారా లోకేష్ తెలంగాణలో కూడా తెలుగుదేశం పార్టీని బలోపేతం చేస్తానని మాట్లాడుతున్నాడని దానికి ముందు తెలంగాణలో తెలుగుదేశం పార్టీ ఎందుకు తుడుచుకుపోయిందో చరిత్ర తెలుసుకోవాలని తన తండ్రి దగ్గర పోయి జరిగిన విషయాలు తెలుసుకున్న తర్వాత తెలంగాణ ప్రజలకు క్షమాపణ చెప్పి మాట్లాడాలని ఆయన అన్నారు ఇప్పటికైనా తెలంగాణ పై అవాకులు చవాకులు పేలితే తగిన గుణపాఠం చెప్పటానికి తెలంగాణ గడ్డ ఎప్పుడు తయారుగా ఉంటుందని అన్నారు.

## ఏక్ భారత్ శ్రేష్ఠ భారత్‌తో రాష్ట్రాల మధ్య సాంస్కృతిక మార్పిడి

- రాష్ట్ర గవర్నర్ శివ ప్రతాప్ శుక్లా
- గవర్నర్‌ను కలిసిన ఐఐటీ షిల్లాంగ్ విద్యార్థులు



**హైదరాబాద్, మే 28 (జనంసాక్షి) :** కేంద్ర ప్రభుత్వ "ఏక్ భారత్ శ్రేష్ఠ భారత్' కార్యక్రమంతో రాష్ట్రాల మధ్య సాంస్కృతిక మార్పిడి జరుగుతుందని , గతంలో ఎన్నడూ లేని విధంగా ఈశాన్య రాష్ట్రాలతో ఇతర రాష్ట్రాలకు కనెక్టివిటీ నీ కేంద్ర ప్రభుత్వం పెంచిందని తద్వారా ఈశాన్య రాష్ట్రాలు మిగతా రాష్ట్రాలకు మరింతగా సాంస్కృతికంగా చేరువయ్యాయని రాష్ట్ర గవర్నర్ శివ ప్రతాప్ శుక్లా పేర్కొన్నారు. కేంద్ర విద్యాశాఖ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న 'ఏక్ భారత్ శ్రేష్ఠ భారత్ - యువ సంగమ్ ఫేజ్-6' కార్యక్రమంలో భాగంగా మేఘాలయ రాష్ట్రంలోని ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ (ఐఐటీ) షిల్లాంగ్‌కు చెందిన 50 మంది విద్యార్థులు గురువారం లోక్ భవన్‌లో తెలంగాణ గవర్నర్ శివ ప్రతాప్ శుక్లాను కలిశారు. దేశంలోని విభిన్న రాష్ట్రాల సంస్కృతి, సంప్రదాయాలు, భాషలు, జీవన విధానాల పరస్పర అవగాహన కోసం కేంద్ర ప్రభుత్వం ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు గవర్నర్ పేర్కొన్నారు. యువత దేశ సమైక్యత, జాతీయ సమగ్రత బలోపేతానికి కృషి చేయాలని ఆయన సూచించారు. తెలంగాణ చరిత్ర, సంస్కృతి, అభివృద్ధి విశేషాలను విద్యార్థులకు అధికారులు వివరించారు. కార్యక్రమంలో గవర్నర్ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి ఎం దాన కిషోర్, ఎన్ఐటీ వరంగల్‌కు చెందిన ప్రొఫెసర్ కిరణ్ కుమార్, సునీల్ కుమార్, ప్రొఫెసర్ పెరుగు శ్యామ్ (కో-నోడల్ ఆఫీసర్), ప్రొఫెసర్ హరిప్రసాద్ రెడ్డి (నోడల్ ఆఫీసర్) పాల్గొన్నారు.

### గవర్నర్‌ను కలిసిన ఎన్ఎస్‌జీ గ్రూప్ కమాండర్

నేషనల్ సెక్యూరిటీ గార్డ్ (ఎన్ఎస్‌జీ), ముంబై 28 స్పెషల్ కాంపోజిట్ గ్రూప్ (ఎస్‌సీజీ) గ్రూప్ కమాండర్ కల్నల్ అభిషేక్ సింగ్ గురువారం లోక్ భవన్‌లో గవర్నర్ శ్రీ శివ ప్రతాప్ శుక్లాను కలిశారు.

## నాలుగు రాష్ట్రాలకు బీజేపీ అధ్యక్షుల నియామకం

**న్యూఢిల్లీ, మే28 (జనంసాక్షి) :** భారతీయ జనతా పార్టీ అధిష్ఠానం కీలక నిర్ణయం తీసుకుంది. నాలుగు రాష్ట్రాలకు పార్టీ అధ్యక్షులను ప్రకటించింది. ఈ మేరకు గురువారం పంజాబ్, హరియాణా, ఢిల్లీ, త్రిపుర రాష్ట్ర విభాగాలకు కొత్త అధ్యక్షులను నియమిస్తూ వివరాలు వెల్లడించింది. ఢిల్లీ బీజేపీ అధ్యక్షుడిగా కేంద్ర మంత్రి హర్ష్ మల్హోత్రాను నియమించింది. పంజాబ్ అధ్యక్షుడిగా సీనియర్ నాయకుడు కేవల్ సింగ్ ధిల్లాన్ పేరును ప్రకటించింది. హరియాణా అధ్యక్షురాలిగా అర్చనా గుప్తాను, త్రిపుర బీజేపీ అధ్యక్షుడిగా అభిషేక్ దేబ్‌రాయ్‌ను నియమించింది. తొలిసారి ఎంపీ అయిన హర్ష్ మల్హోత్రాకి ప్రధాని నరేంద్ర మోదీ ప్రభుత్వం కేంద్ర మంత్రి పదవి ఇచ్చింది. ప్రస్తుతం ఆయన కేంద్ర కార్పొరేట్ వ్యవహారాలు, రోడ్డు రవాణా, రహదారుల శాఖ సహాయ మంత్రిగా పని చేస్తున్నారు. తూర్పు ఢిల్లీ నియోజకవర్గానికి హర్ష్ మల్హోత్రా ప్రాతినిధ్యం వహిస్తున్నారు. దేశ రాజధానిలో బీజేపీని క్షేత్రస్థాయిలో మరింతగా బలోపేతం చేసేందుకు మల్హోత్రాను అధ్యక్షుడిగా ప్రకటించారు.

## గంగా నదిలో పడవ బోల్తా పడి ఇద్దరు మృతి



**పాట్నా, మే 28 (జనంసాక్షి) :** పాట్నా జిల్లా బర్హ్ సబ్-డివిజన్‌లోని ఉమానాథ్ గంగా ఘాట్ వద్ద ఘోర ప్రమాదం జరిగింది. గంగా నదిలో ప్రమాదవశాత్తూ పడవ బోల్తాపడి ఇద్దరు మృతిచెందగా.. ఐదుగురు గల్లంతయ్యారు. బలమైన గాలుల కారణంగా పడవ బోల్తా పడినట్లు తెలుస్తోంది. ప్రత్యక్ష సాక్షుల ప్రకారం.. గంగా ఘాట్ వద్దకు వచ్చిన సుమారు 14 నుంచి 15 మంది నది అందాలను చూసేందుకు పడవ ఎక్కారు. గంగా నది మధ్యలోకి వెళ్లగానే ఒక్కసారిగా బలమైన గాలులు వీచాయి. దీంతో ఒక్కసారిగా పడవ బోల్తా పడింది. కాపాడాలంటూ బాధితులు కేకలు వేశారు. ప్రమాదాన్ని గమనించిన స్థానికులు బోట్ల సహాయంతో ఐదుగురిని రక్షించగా.. మిగతా వారంతా గల్లంతయ్యారు. బోట్ల యజమానుల సమాచారం మేరకు పోలీసులు ఘటనాస్థలానికి చేరుకున్నారు. ఎస్‌డీఆర్ఎఫ్ బృందాలనూ రంగంలోకి దింపారు. గల్లంతైన వారిని గుర్తించేందుకు ప్రయత్నాలు ముమ్మరం చేశారు. అయితే, ఇద్దరి మృతదేహాలు లభించాయని, మిగతా వారి కోసం గాలింపు చర్యలు కొనసాగుతున్నాయని బర్హ్ ఎస్‌డీపీవో రామకృష్ణ తెలిపారు. మృతుల సంఖ్య మరింత పెరిగే అవకాశం ఉందన్నారు. ఈ ఘటనతో స్థానికంగా తీవ్ర విషాద ఛాయలు అలుముకున్నాయి.

# వాహనాలను మాయం చేసే ముఠా అరెస్టు!




**హైదరాబాద్, మే 28 (జనంసాక్షి) :** హైవేలపై ప్రయాణించే లారీ డ్రైవర్లు, క్లీనర్లకు కునుకులేకుండా చేస్తున్న ఒక భారీ అంతర్రాష్ట్ర ముఠా ఆగడాలను ఆదిలాబాద్ జిల్లా పోలీసులు అడ్డుకున్నారు. పక్కా ప్లానింగ్‌తో అత్యంత సాంకేతిక పరిజ్ఞానంతో భారీ వాణిజ్య వాహనాలను మాయం చేస్తున్న ఈ ముఠా నెట్‌వర్క్ హర్యానా నుంచి మహారాష్ట్ర వరకు విస్తరించి ఉంది. ఆదిలాబాద్ జిల్లా ఎస్పీ అఖిల్ మహాజన్ నేతృత్వంలో పోలీసులు చేపట్టిన ఆపరేషన్‌లో ముగ్గురు కీలక నిందితులు చిక్కారు. మావల బైపాస్ రోడ్డు వద్ద పోలీసులు సాధారణంగా వాహన తనిఖీలు చేస్తున్నారు. ఆ సమయంలో తెల్లటి టయోటా ఎటియోస్ కారు అనుమానాస్పదంగా కనిపించింది. పోలీసులను చూడగానే ఆ కారులో ఉన్న వారు పరారయ్యేందుకు ప్రయత్నించారు. అయితే అప్రమత్తమైన పోలీస్ బృందం వారిని వెంబడించి ముగ్గురును అదుపులోకితీసుకున్నారు. వారిని విచారిస్తే దేశవ్యాప్తంగా సాగుతున్న భారీ వాహనాల చోరీల వెనుక ఉన్న అసలు రహస్యాలు వెలుగులోకి వచ్చాయి. అరెస్టు అయిన నిందితులు అంతరాష్ట్ర నేరాల్లో ఆరితేరిన వారు. హర్యానాకు చెందిన సలీం వృత్తిరీత్యా ట్రక్ డ్రైవర్. హైవేలపై వాహనాల కదలికలపై ఇతనికి పూర్తి అవగాహన ఉంది. రెండో వ్యక్తి నఫీస్ ఖాన్. హర్యానాలోని మేవాత్ జిల్లాకు చెందిన ఇతను కూడా ట్రక్ డ్రైవరే. భారీ వాహనాలను సులువుగా నడపడంలో దిట్ట. ఇంతియాజ్ మూడోవాడు. రాజస్థాన్‌లోని భరత్‌పూర్ జిల్లాకు చెందిన మెకానికక్. వాహనాల లాక్ సిస్టమ్‌ను వైరింగ్‌ను నిమిషాల్లో ఛేదించడం ఇతని స్పెషాలిటీ. వీరితోపాటు మరో ఏడుగురు ఉన్నట్టు గుర్తించిన పోలీసులు వారిపై కేసులు పెట్టారు. తమ వద్ద ఉన్న టయోటా కారులో వివిధ రాష్ట్రాల హైవేలపై తిరుగుతూ పెట్రోల్ బంకులు, లేదా నిర్మానుష్య ప్రాంతాల్లో పార్క్ చేసిన ఐషర్, టిప్పర్ వంటి భారీ వాహనాలను లక్ష్యంగా చేసుకుంటారు. మెకానిక్ సహాయంతో వాహనం తలుపు గ్లాస్ పగులగొట్టి స్టీరింగ్ లాంగ్ విరగ్గొడతారు. ఇగ్నిషన్ వైరింగ్‌ను కట్ చేసి డైరెక్ట్ కనెక్షన్ ద్వారా వాహనాన్ని స్టార్ట్ చేస్తారు. దొంగలించిన వాహనాన్ని వెంటనే మహారాష్ట్ర లేదా గుజరాత్ రాష్ట్రాలకు తరలిస్తారు. దొంగలించిన వాహనాన్ని కేవలం గంటల వ్యవధిలోనే విడిభాగాలుగా విడగొట్టేస్తారు. ఆ భాగాలను విడివిడిగా అమ్మేస్తారు. ఆనవాళ్లు దొరక్కుండా చేస్తారు. నిందితుల నుంచి ప్రస్తుతం టయోటా కారుతోపాటు మూడు సెల్‌ఫోన్‌లు స్వాధీనం చేసుకున్నారు. వారిని కోర్టులో హాజరుపరిచి రిమాండ్‌కు తరలించారు.

# మహానాడు వేదికపై చరిత్రకు అవమానం

సంపాదకీయం

రాజకీయంలో మాటలు కత్తుల కంటే పదునుగా గాయపరుస్తాయి. అధికారం చేతిలో ఉన్నప్పుడు, వేదిక పెద్దది అయినప్పుడు, ఆ మాటలు చరిత్రపై దాడిగా మారతాయి. టీడీపీ మహానాడు వేదికపై "తెలంగాణ అనే పదానికి డిక్షనరీలో అర్థమే లేదు" అని చేసిన వ్యాఖ్య అలాంటి దాడే. ఇది కేవలం ఒక నాయకుడి అజ్ఞానం కాదు. ఇది సుదీర్ఘమైన రాజకీయ వ్యూహంలో భాగం. తెలంగాణ ప్రాంత అస్తిత్వాన్ని, చరిత్రను, ఉద్యమ వారసత్వాన్ని చెరిపివేయాలనే ప్రయత్నం.

*"తెలంగాణ" అనే పదం పుట్టుక గురించి పలు వాదనలు ఉన్నాయి. అత్యంత ఆమోదయోగ్యమైన వ్యుత్పత్తి ఏమిటంటే "త్రిలింగ" ం "అణ" నుండి వచ్చింది. శ్రీశైలం, శ్రీకాళహస్తి, ద్రాక్షారామం ఈ మూడు శైవ క్షేత్రాల మధ్య ఉన్న ప్రాంతం కాబట్టి "త్రిలింగదేశం" అయింది. కాలక్రమేణా అది "తెలింగాణ"గా, ఆపై "తెలంగాణ"గా రూపాంతరం చెందింది. మరొక వాదన ప్రకారం "తెలుగు" ం "గాన" అంటే తెలుగు మాట్లాడే ప్రాంతం అని అర్థం. అంతకన్నా కీలకమైన విషయం "తెలంగాణ" అనే పదం కాకతీయ శాసనాలలో స్పష్టంగా కనిపిస్తుంది. అంటే కనీసం 700-800 సంవత్సరాల పూర్వం నుండి ఈ పదం వాడుకలో ఉంది. ఏ డిక్షనరీలో లేదో కానీ శాసనాలలో ఉంది. కాకతీయ రాజభవనాల గోడలపై ఉంది. కోటి మంది గుండెల్లో ఉంది.*

తెలంగాణ అస్తిత్వాన్ని ప్రపంచానికి చాటిన వంశం కాకతీయులు. వారు నిర్మించిన వేయి స్తంభాల గుడి, రామప్ప దేవాలయం నేటికీ నిలబడి తెలంగాణ శిల్పకళా వైభవాన్ని చెప్తున్నాయి. రామప్ప దేవాలయానికి యూనెస్కో వారసత్వ హోదా వచ్చింది. ఇది తెలంగాణ నేల మీద, తెలంగాణ శిల్పుల చేతుల మీద నిర్మితమైంది. రాణి రుద్రమదేవి స్త్రీ అయినా రాజ్యాన్ని సమర్థంగా పరిపాలించిన మహారాణి. తెలంగాణ వారసత్వంలో భాగం. ఆమె పేరు డిక్షనరీలో ఉందా లేదా అన్నది ముఖ్యం కాదు. ఆమె చరిత్రలో శాశ్వతంగా ఉంది.

గోల్కొండ కోట నేటికీ హైదరాబాద్ గుండెలో నిలబడి ఉంది. కుతుబ్ షాహీ వంశం తెలంగాణ ప్రాంతాన్ని ఒక మహా సామ్రాజ్యంగా తీర్చిదిద్దింది. మహమ్మద్ కులీ కుతుబ్ షా నిర్మించిన చార్మినార్, మక్కా మసీదు. ఇవి కేవలం కట్టడాలు కాదు, తెలంగాణ సంయుక్త సంస్కృతికి సజీవ సాక్ష్యాలు. నిజాం పాలనలో హైదరాబాద్ స్టేట్ ఒక ప్రత్యేక రాజ్యంగా ఉంది. అందులో మరాఠీ, కన్నడ ప్రాంతాలు కూడా ఉండేవి. అయినా తెలంగాణ తెలుగు ప్రాంతానికి భాషలో, కళలో, ఆచారాలలో ప్రత్యేక సాంస్కృతిక గుర్తింపు ఉండేది. నిజాం పాలనకు వ్యతిరేకంగా జరిగిన సాయుధ పోరాటంలో వందలాది గ్రామాల్లో వేలమంది అమరవీరులు ప్రాణాలు అర్పించారు. ఆ పోరాటంలో పాల్గొన్న ప్రతి ఒక్కరూ "తెలంగాణ" కోసమే పోరాడారు. రైతులు, కూలీలు దొరల అత్యాచారాలకు వ్యతిరేకంగా తుపాకులు పట్టారు. ఆ పోరాటానికి మూలం "తెలంగాణ" అనే గుర్తింపు. ఆ అమరవీరుల త్యాగాలకు అర్థం లేదా? ఆ పోరాటానికి అర్థం లేదా?

మొదటి తెలంగాణ పోరాటం 1969 నుంచి 2009-2014 అతిపెద్ద ప్రజా పోరాటం వరకు కోట్ల మంది ప్రజలు వీధుల్లోకి వచ్చారు. ఆ ఉద్యమంలో అమరులైన ప్రతి ఒక్కరూ "జై తెలంగాణ" అని చనిపోయారు. "నా గొడవ" అని కాళోజీ రాశారు. ఆ గొడవ తెలంగాణ గొడవే. ఆయన ప్రతి కవితలో తెలంగాణ నొప్పి, తెలంగాణ ఆకాంక్ష ఉంది. దాశరథి, సురవరం ప్రతాప రెడ్డి ఈ సాహితీ దిగ్గజాలు తెలంగాణ ఆత్మను కవిత్వంలో పొందుపరిచారు. లక్షలాది మంది మహిళలు ఒకేచోట బతుకమ్మ ఆడిన సందర్భాలు గిన్నిస్ రికార్డులకు ఎక్కాయి. మేడారం జాతర ప్రపంచంలోనే అతిపెద్ద గిరిజన జాతర. ఆ పండుగ జరిగే నేలకు పేరు లేదా? అర్థం లేదా?

మహానాడు వేదిక వెనుక ఉన్న రాజకీయం.. "తెలంగాణకు అర్థం లేదు" అనడం వెనుక లక్ష్యం ఏమిటి? ఇది హఠాత్తుగా వచ్చిన వ్యాఖ్య కాదు. తెలంగాణ ఉద్యమాన్ని, దాని వారసత్వాన్ని చరిత్ర నుండి తుడిపివేయడం, తెలంగాణలో రాజకీయ పునాది వేయడానికి తెలంగాణ అస్తిత్వాన్నే ప్రశ్నార్థకం చేయడం వంటి లక్ష్యాలున్నాయి. 2014కి ముందు కూడా ఇలాంటి వ్యాఖ్యలు వచ్చాయి. అప్పుడు ప్రజలు జవాబు చెప్పారు. 2014లో తెలంగాణ రాష్ట్రం ఏర్పడింది. చరిత్ర తన న్యాయం తాను చేసుకుంది. ఆ వేదికపై కూర్చున్న తెలంగాణ టీడీపీ నాయకులు ప్రాపకం కోసం సాష్టాంగపడడం ఒక అవమానం అయితే సొంత నేల అవమానానికి మౌనంగా చప్పట్లు కొట్టడం అంతకంటే పెద్ద అవమానం. నాయకుడు నేలపై పడితే పార్టీ మనోధైర్యం నేలమట్టమవుతుంది. నాయకుడు మౌనంగా ఉంటే ప్రజలు మాట్లాడతారు.

# ఆర్థిక వృద్ధి పైకి మెరుస్తుంది... కానీ సామాన్యుడి జీవితం అంధకారంలోనే!

*భారతదేశం ప్రస్తుతం ప్రపంచ ఆర్థిక శక్తుల సరసన నిలుస్తోందని కేంద్ర ప్రభుత్వాలు తరచుగా ప్రకటిస్తున్నాయి. 2014 తర్వాత దేశ జీడీపీ పరిమాణం వేగంగా పెరిగిందని, 2025 నాటికి భారత్ ప్రపంచంలో 5వ అతిపెద్ద ఆర్థిక వ్యవస్థగా ఎదిగిందని అధికారిక లెక్కలు చెబుతున్నాయి. 2030 నాటికి ప్రపంచంలో 3వ అతిపెద్ద ఆర్థిక శక్తిగా భారత్ అవుతుందని అంతర్జాతీయ ఆర్థిక సంస్థలు అంచనా వేస్తున్నాయి. నగరాల్లో మెట్రో రైళ్లు, ఎక్స్‌ప్రెస్ హైవేలు, భారీ విమానాశ్రయాలు, డిజిటల్ చెల్లింపులు, స్టాక్ మార్కెట్ సూచీలు, కార్పొరేట్ లాభాల పెరుగుదల చూస్తే నిజంగానే దేశం దూసుకుపోతున్నట్లే కనిపిస్తోంది.*



కానీ ఈ మెరుపుల వెనుక సామాన్యుడి వాస్తవ జీవితం ఎంత దయనీయంగా ఉందో మార్కెట్‌కు వెళ్లే ప్రతి కుటుంబానికి తెలుసు. 2018లో రూ.100తో కొనగలిగిన సరుకులు 2026లో కొనాలంటే దాదాపు రూ.180 నుంచి రూ.220 వరకు ఖర్చు అవుతోందని కుటుంబాలు బాధపడుతున్నాయి. 2020 కరోనా తర్వాత మధ్యతరగతి కుటుంబాల్లో దాదాపు 60 శాతం వరకు పొదుపులు కరిగిపోయాయని అనేక సర్వేలు సూచిస్తున్నాయి. నెలకు రూ.25,000 సంపాదించే ఉద్యోగి కుటుంబం 2016లో కాస్త సౌకర్యంగా బతికితే, 2026 నాటికి అదే జీతంతో అద్దె, కరెంట్ బిల్లులు, పిల్లల ఫీజులు, వైద్య ఖర్చులు భరించడం కష్టమైపోయింది. దేశ ఆర్థిక వృద్ధి 7 శాతం అని ప్రకటించినా, కుటుంబ ఖర్చుల భారం మాత్రం 15 శాతం నుంచి 30 శాతం వరకు పెరిగింది. ఇదే సామాన్యుడి ప్రశ్నకు మూలం.

దేశం వెలుగుతోందని చెప్పే ముందు ఆ వెలుగు ప్రతి ఇంటికి చేరిందా లేదా అన్నది చూడాల్సిన అవసరం ఉంది. ఒకవైపు లక్షల కోట్ల ఆస్తులు పెంచుకుంటున్న బిలియనీర్లు కనిపిస్తుంటే, మరోవైపు బియ్యం సంచి కొనడానికి అప్పు చేస్తున్న కుటుంబాలు పెరుగుతున్నాయి. నగరాల్లో లగ్జరీ కార్ల అమ్మకాలు 2024లో 20 శాతం పెరిగినా, గ్రామాల్లో చిన్న రైతుల అప్పులు అదే కాలంలో 35 శాతం పెరిగినట్లు నివేదికలు చెబుతున్నాయి. ఈ వ్యత్యాసమే దేశ ఆర్థిక అసమానతకు నిదర్శనం.

దేశ సంపదలో దాదాపు 40 శాతం వరకు అత్యంత ధనికులైన 1 శాతం ప్రజల చేతుల్లోనే కేంద్రీకృతమైందని పలు అధ్యయనాలు వెల్లడించాయి. మిగిలిన 99 శాతం ప్రజలు మాత్రం ధరల భారం, నిరుద్యోగం, అప్పుల ఒత్తిడితో బతుకు పోరాటం చేస్తున్నారు. ప్రభుత్వ గణాంకాలు చెప్పే అభివృద్ధి అంకెలు ఒక వైపు ఉంటే, కూరగాయల మార్కెట్‌లో సామాన్యుడి చేతిలో మిగిలే చిల్లర మరోవైపు కనిపిస్తోంది. నిజమైన ఆర్థిక ప్రగతి అనేది కేవలం జీడీపీ సంఖ్యలతో కాదు, సామాన్య కుటుంబం నిండుగా తినగలగడం ద్వారా కొలవాలి.

**యువత నిరుద్యోగం - దేశ భవిష్యత్తుకు హెచ్చరిక**

2016లో దేశంలో నిరుద్యోగ శాతం 5 నుంచి 6 శాతం మధ్యలో ఉండగా, కరోనా తర్వాత 2020లో కొన్ని నెలల పాటు అది 23 శాతానికి పైగా చేరిన పరిస్థితులు వచ్చాయి. తర్వాత పరిస్థితులు క్రమంగా మెరుగుపడ్డాయని చెప్పినా, గ్రామీణ యువతలో స్థిరమైన ఉద్యోగాల కొరత ఇంకా కొనసాగుతూనే ఉంది. ప్రతి సంవత్సరం లక్షల మంది యువకులు డిగ్రీలు పూర్తి చేస్తున్నా, వారిలో దాదాపు 45 శాతం మందికి తమ విద్యకు తగ్గ ఉద్యోగాలు దొరకడం లేదని ఉపాధి అధ్యయనాలు సూచిస్తున్నాయి. ప్రైవేట్ కంపెనీల్లో ఉద్యోగాలు వచ్చినా, పని గంటలు పెరుగుతున్నాయి కానీ జీతాల పెరుగుదల మాత్రం అంతంత మాత్రమే ఉంది.

2010లో రూ.15,000 జీతం సరిపడేదని భావించిన కుటుంబం, 2026 నాటికి కనీసం రూ.40,000 లేకపోతే నగర జీవితం గడవడం కష్టమని చెబుతోంది. అద్దెలు 10 సంవత్సరాల్లో దాదాపు 70 శాతం పెరిగాయి. విద్యా ఖర్చులు కొన్ని ప్రాంతాల్లో 100 శాతం దాటాయి. ప్రైవేట్ ఆసుపత్రుల వైద్య ఖర్చులు మధ్యతరగతిని అప్పుల ఊబిలోకి నెట్టేస్తున్నాయి. ఒక చిన్న ఆపరేషన్‌కు కూడా రూ.1 లక్ష నుంచి రూ.3 లక్షల వరకు ఖర్చవుతున్న ఉదాహరణలు పెరిగిపోయాయి. ప్రభుత్వ ఆసుపత్రుల్లో సరైన సదుపాయాలు లేకపోవడంతో పేదవాడు ప్రైవేట్ వైద్య రంగం దయపై ఆధారపడాల్సిన పరిస్థితి ఏర్పడింది.

**రైతు సంక్షోభం - దేశ ఆహార భద్రతకు ముప్పు**

రైతు సంక్షోభం మరొక నిప్పుల గుండె. వ్యవసాయం లాభసాటిగా లేదు. పంట ధరలు పడిపోతున్నాయి. ఖర్చులు పెరుగుతున్నాయి. అప్పుల ఊబిలో కూరుకుపోయిన రైతులు ప్రాణాలు తీసుకుంటున్నారు. మూడు లక్షలకు పైగా రైతు ఆత్మహత్యలు జరిగాయి గత రెండు దశాబ్దాల్లో. ఇది జాతీయ సంక్షోభం. ఇది ప్రతి టీవీ ఛానల్‌లో, ప్రతి రాజకీయ సభలో ప్రధాన అంశం అయి ఉండాల్సింది. కానీ అది జరగలేదు. ఎందుకు? ఎందుకంటే రైతు సమస్య పరిష్కరిస్తే రాజకీయ లాభం రాదు. కానీ కుల-మత విభేదాలు రాజేస్తే ఓట్ బ్యాంక్ సురక్షితంగా ఉంటుంది. దేశానికి అన్నం పెట్టే రైతన్న ఆకలి కేకలు పాలకుల చెవులకు చేరడం లేదు.

**వైద్యం, విద్య - పేదలకు భారం**

వైద్యంలో మరో ఘోరమైన వాస్తవం. ఈ దేశంలో ప్రజా ఆరోగ్య వ్యవస్థ ఏ స్థాయిలో ఉందో కోవిడ్ మహమ్మారి సమయంలో మనందరం చూశాం. ఆస్పత్రుల్లో పడకలు లేవు, ఆక్సిజన్ లేదు, వైద్యులు లేరు. పేదలు రోడ్లపై చనిపోయారు. అయినా ఆ వ్యవస్థలను మెరుగుపరచడానికి తీవ్రమైన చర్యలు జరిగాయా? లేదు. వైద్య రంగం ప్రైవేటు వ్యాపారులకు అప్పగించబడింది. చికిత్స చేయించుకోవడానికి పేదలు ఆస్తులమ్ముకోవాల్సి వస్తోంది. ఈ దయనీయమైన స్థితి గురించి పెద్ద ఎత్తున ఉద్యమాలు జరగడం లేదు. కానీ ఏ మతానికి చెందిన గుడి అక్కడ కట్టాలి అనే విషయంపై నెలల తరబడి వివాదాలు జరుగుతున్నాయి. ఇది నిజంగా ఒక ప్రజాస్వామ్య దేశంలో జరుగుతున్న అతిపెద్ద మానవీయ సంక్షోభం అనడంలో ఎలాంటి సందేహం లేదు.

**పరిష్కార మార్గాలు - సమగ్ర అభివృద్ధి**

దేశం నిజంగా అభివృద్ధి చెందాలంటే కేవలం మెట్రో నగరాల అభివృద్ధి సరిపోదు. గ్రామాలు బలపడాలి. రైతు బతకాలి. చిన్న వ్యాపారి నిలబడాలి. చేతివృత్తులు పునరుద్ధరించాలి. యువతకు నైపుణ్య శిక్షణ ఇచ్చి స్థానికంగా ఉపాధి అవకాశాలు కల్పించాలి. విదేశీ కంపెనీల పెట్టుబడులతో పాటు స్థానిక చిన్న పరిశ్రమలకు కూడా సమాన ప్రాధాన్యం ఇవ్వాలి. నల్లధనాన్ని అరికట్టాలి. రాజకీయాలు, వ్యాపారాల మధ్య ఉన్న అక్రమ సంబంధాలను తగ్గించాలి. ప్రభుత్వ నిధులు నిజంగా ప్రజలకు ఉపయోగపడే రంగాలకు వెళ్లాలి. పేదలకు ఇచ్చే సంక్షేమం కేవలం ఓట్ల రాజకీయంగా కాకుండా, వారి జీవితాలను నిలబెట్టే స్థిరమైన మార్గంగా మారాలి.

ఒక వ్యక్తి రోజుకు రెండు పూటల భోజనం గౌరవంగా సంపాదించుకోగలిగితేనే అది నిజమైన స్వాతంత్ర్యం. ఒక కుటుంబం అప్పుల్లేకుండా జీవించగలిగితేనే అది నిజమైన అభివృద్ధి. దేశం వెలుగుతోంది అనే మాట ప్రజల జీవితాల్లో కనిపించాలి కానీ కేవలం ప్రకటనల్లో కాదు. గగనచుంబి భవనాల కాంతులు మాత్రమే కాదు, గ్రామంలో రైతు ఇంట్లో వెలిగే చిన్న బల్బు కూడా అభివృద్ధికి చిహ్నం కావాలి.

ప్రజలు విడిపోతే స్వార్థ రాజకీయాలు గెలుస్తాయి. అదే ప్రజలు ఏకమైతే నిజమైన ప్రజాస్వామ్యం గెలుస్తుంది. ఇకనైనా మౌనాన్ని వీడి, మన ఉనికి కోసం, మన దేశ భవిష్యత్తు కోసం గళం విప్పుదాం. సమాజంలో శాంతిని, సామరస్యాన్ని కాపాడుకుంటూ ముందుకు సాగడమే నేటి తరం ముందున్న ప్రధాన కర్తవ్యం. ఒకరికొకరు తోడుగా నిలుస్తూ, ద్వేషాన్ని ప్రేమతో జయించే రోజు కోసం మనమంతా కలిసికట్టుగా కృషి చేయాలి.



డాక్టర్ రక్కిరెడ్డి ఆదిరెడ్డి
కాకతీయ విశ్వవిద్యాలయం

## గాయాల అర్జీలు

వారంలో ఒకరోజు
కలెక్టర్ కార్యాలయంలో
అభ్యర్థనల వెల్లువ (స్పందన )
అక్కడ ఇసుకేస్తే రాలని జనం
ఒకొక్కరిది ఒక్కొక్క సమస్య
కనిపించని గాయం వెనుక
మోయలేని భారంతో
వినిపించని మాటల వెనుక
దాగున్న మౌనంతో..వేలఅభ్యర్థనలు
వినతి పత్రాలతో బారులు తీరిన జనం
ఏదో ఒకచోట గుప్పెడు గుండెకింత
ఓదార్పు దొరుకుతుందని కాబోలు!
చెప్పలేని బాధలతో
బరువెక్కిన హృదయాలతో
కష్టాల సంద్రపు వలలో
ఒంటరిగా మిగిలిపోకూడదనీ
జిల్లా అధికారికి లిఖిత అభ్యర్థనలు
అక్కడ...అన్నీ
వేదనతో నిండిన నయనాలే!!
చీకటిగా మారిన
బతుకు పయనాలకు
ఓదార్పు లేపనాలు పూసుకోవడానికి
వచ్చిన ఆశ్రితులు..
ఒక్కొక్కరిది ఒక్కో గాథ
వినిపించుకునే మనస్సు
ఉండాలిగానీ..!!
మనస్సు చెమ్మకాక మానదు
కాళ్ళు లేని వాళ్ళు
కాపురాలు కూలిన వాళ్ళు
కోర్టు కేసులు కొలిక్కి రాని వాళ్ళు
అంతుపట్టని రోగాలతో
బతుకీడుస్తున్నవాళ్లు
కబ్జాలతో భూములను
కోల్పోయిన వాళ్ళు
ఒకటా, రెండా..?
సమస్యల సవాళ్ళను
ఎదుర్కొంటున్నవాళ్లే వాళ్లంతా!?
తిరిగి రాని జీవితంలో
ఊహించని మలుపులెన్నో
కష్టాలతో కలిసి గడిపిన
ఊపిరాడని రాత్రులెన్నో...
ఐనా.. చిన్న ఆశ...!!
యే!! సానుకూల పవనం
సమస్యను వింటదేమోనన్న
ఒకే ఒక ఆశ..
అధికారుల స్పందన
ఆ చిన్ని గుండెను బతికించవచ్చు
పత్రికలో వచ్చిన వార్తను చదివి
యే మానవతామూర్తో!?
కరుణించవచ్చు..!!
మానవత్వం బతికే ఉంటుంది
దాన్ని పట్టుకుని తట్టిలేపాలి
ఆశను ఊపిరి చేసుకునే
బాధితుల రేపటి జీవనం కోసమే
ఈ స్పందన కార్యక్రమం
మనకు పంచడం తెలిస్తే
అంతటా మొలిచేవి
ఆపన్న హస్తాలే గదా !!

**అనిత కృష్ణ గండమళ్ళ**
9490876621

# "కాక్రోచ్ జనతా పార్టీ" యువత ఆవేదనకు సోషల్ మీడియా రూపం!

*ప్రజాస్వామ్యంలో యువతను దేశ భవిష్యత్తు అంటారు.ఎన్నికల సమయంలో రాజకీయ పార్టీలు యువతే మార్పుకు చిహ్నమంటూ గొప్పలు చెబుతాయి. కానీ అదే యువతను అవమానించేలా వ్యాఖ్య లు వస్తే సహజంగానే సమాజంలో తీవ్ర ప్రతిచర్య కనిపిస్తుంది. ఇటీవల సీజేఐ చేసిన "యువత కాక్రోచ్‌లా తయారవుతోంది" అన్న భావన కలిగించే వ్యాఖ్యలు సోషల్ మీడియాలో దుమారం రేపాయి.నా ఉద్దేశ్యం అలా కాదు అని -సిజేఐ వివరణ ఇచ్చినప్ప టికీ, ఈ వ్యాఖ్యలను యువత తమ ఆత్మగౌరవంపై దాడిగా భావించింది.అందుకే వ్యంగ్య నిరసనగా "కాక్రోచ్ జనతా పార్టీ" అనే పేరు సోషల్ మీడియాలో వైరల్ అయింది. మీమ్స్, పోస్టులు, వ్యంగ్య వీడియోలు, రాజకీయ సెటైర్లు వరదలా వచ్చాయి. ఇది కేవలం సరదా ట్రెండ్ కాదు,యువతలో పేరుకుపోయిన అసంతృప్తి, నిరుద్యోగ బాధ, రాజకీయ వ్యవస్థపై విసుగుచెంది బయటపడిన రూపంగా విశ్లేషకులు భావిస్తున్నారు.*



**యువత ఆవేదనకు కారణాలేమిటి?**

నేటి యువత పరిస్థితి ఎంతో సంక్లిష్టంగా మారింది.ఉన్నత చదువులు పూర్తిచేసినా ఉద్యోగాలు రావడం లేదు. ప్రభుత్వ నియామకాలు ఆలస్యం..పరీక్షల పేపర్ లీకేజీలు, ప్రైవేట్ రంగంలో అస్థిర ఉద్యోగాలు.పెరుగుతున్న జీవన వ్యయం యువతను తీవ్ర నిరాశలోకి నెడుతున్నాయి.ఒకవైపు "స్కిల్ ఇండియా", "డిజిటల్ ఇండియా", "స్టార్టప్ ఇండియా" అంటూ గొప్పలు చెబుతుంటే! మరోవైపు లక్షలాది మంది యువకులు ఉద్యోగ నోటిఫికేషన్ కోసం సంవత్సరాల తరబడి ఎదురు చూడాల్సిన పరిస్థితి నెలకొంది. చదువుకున్న యువతలో భవిష్యత్తుపై భయం పెరుగుతోంది. ఇలాంటి పరిస్థితుల్లో బాధ్యతాయుత స్థానాల్లో ఉన్నవారు యువతను చిన్నచూపు చూస్తూ మాట్లాడితే అది కేవలం ఒక వ్యాఖ్యగా మిగలదు.అది యువత ఆత్మగౌరవాన్ని గాయ పరుస్తుంది."మమ్మల్ని సమస్యగా చూస్తున్నారా? లేక దేశ శక్తిగా గుర్తిస్తున్నారా?" అన్న ప్రశ్న ఇప్పుడు యువతలో బలంగా వినిపిస్తోంది. యువశక్తి సంఘటితమై సమాజంలోని కుళ్ళును కడిగిపారాల్సిన సమయం ఆసన్నమైంది.

**సోషల్ మీడియా-కొత్త తరహా రాజకీయ నిరసన..**

ఒకప్పుడు ప్రజా వ్యతిరేకత రోడ్లపై కనిపించేది.ఇప్పుడు అదే నిరసన డిజిటల్ ప్రపంచంలో ట్రెండ్ రూపంలో బయటపడుతోంది. "కాక్రోచ్ జనతా పార్టీ" కూడా అలాంటి డిజిటల్ నిరసనలలో ఒకటి. దీన్ని అభిజిత్ దీప్కే ఏర్పర్చినట్లు తెలుస్తుంది. దీని మేనిఫెస్టో ప్రధాన ఎజెండా అంశాలు: యువత- ప్రజలు ఎదుర్కొనే సమస్యలు ప్రతిభింబిస్తున్నా.కాకపోతే ఇది ఎన్నికల సంఘంలో రాజకీయ పార్టీగా నమోదు కాలేదు,కానీ సోషల్ మీడియా యువత చేతిలో ఇప్పుడు ఒకశక్తి వంతమైన ఆయుధం అవుతోంది.ఒక రాజకీయ వ్యాఖ్యను గంటల్లో దేశవ్యాప్తంగా చర్చనీయాంశంగా మార్చగల సామర్థ్యం యువతకు వచ్చింది. వ్యంగ్య మీమ్స్, సెటైరికల్ పోస్టులు, షార్ట్ వీడియోల ద్వారా యువత తమ కోపాన్ని, అసంతృప్తిని వ్యక్తపరుస్తోంది.ఈ పరిణామం రాజకీయ పార్టీలకు కూడా ఒక గట్టి హెచ్చరిక.ప్రజల భావోద్వేగాలను, ముఖ్యంగా యువత మనోభావాలను తక్కువ అంచనా వేయడం ఇక ప్రమాదకరం. సోషల్ మీడియా కాలంలో ప్రతి మాటకు వెంటనే ప్రజా తీర్పు వస్తోంది. అయితే మరోవైపు సోషల్ మీడియా వేదిక బాధ్యతా యుతంగా ఉపయోగపడాలి. వ్యక్తిగత దూషణలు,అసభ్య పదజాలం, ద్వేష ప్రచారం పెరగడం కూడా సమాజానికి మంచిది కాదు.విమర్శలు ఉండాలి. కానీ అవి విధాన పరమైనవిగా,విలువలతో కూడినవిగా ఉండాలి.

**ప్రభుత్వాలు,రాజకీయ పార్టీలు మారాల్సిన సమయం..**

యువతను ఓటు బ్యాంక్‌గా మాత్రమే చూసే రాజకీయ సంస్కృతి మారాలి.ఎన్నికల సమయంలో హామీలు ఇవ్వడం కాకుండా..ఆ హామీలను అమలు చేసే బాధ్యత పాలకులపై ఉంది. ఉద్యోగాలు, పారదర్శక నియామకాలు, పరిశ్రమలు, నైపుణ్యాభివృద్ధి, యువ పారిశ్రామిక వేత్తలకు మద్దతు వంటి అంశాలపై ప్రభుత్వాలు నిజాయితీగా పనిచేయాలి.

రాజకీయ నాయకులు కూడా మాటల్లో సంయమనం పాటించాలి. ప్రజా జీవితంలో ఉన్నవారి ప్రతి వ్యాఖ్య సమాజంపై ప్రభావం చూపుతుంది. ముఖ్యంగా యువతపై వ్యాఖ్యానించే సమయంలో బాధ్యత మరింత అవసరం.యువతను అవమానించడం ద్వారా తాత్కాలిక రాజకీయ ప్రయోజనం ఉండొచ్చు!.కానీ దీర్ఘకాలంలో అది ప్రజలలో వ్యతిరేకతను పెంచుతుంది.ఇక యువత కూడా ఆవేశం కంటే అవగాహనతో ముందుకు రావాలి.సోషల్ మీడియా ట్రెండ్‌లు మాత్రమే కాదు..ఓటు హక్కు, ప్రజా చర్చలు, సామాజిక చైతన్యం, ప్రజాస్వామ్య పోరాటాల ద్వారా మార్పు తీసుకు రావాలి. విమర్శించడమే మాత్రమే కాదు, మన దేశ రాజకీయాల్లో శూన్యత ఏర్పడిన వేళ ప్రజాస్వామ్య మార్గంలో, రాజ్యాంగబద్ధంగా ఈ సామాజిక కుళ్లును కడిగేయడానికి ప్రత్యామ్నాయ వేదిక (ఆలోచనలు) కూడా సమాజానికి అందించాలి.

**యువత చేతిలోనే సమాజ భవిష్యత్తు**

"కాక్రోచ్ జనతా పార్టీ" అనే వ్యంగ్య రూపకం చివరికి ఒక పెద్ద సామాజిక హెచ్చరికగా మారింది.

యువతను చిన్నచూపు చూడొచ్చు- కానీ యువశక్తిని అణచలేరు. వ్యాఖ్యలతో యువతను కించపరిచే సమాజం వెను కబడుతుంది. యువత ఆవేదనను అర్థం చేసుకునే దేశమే ముందుకుసాగుతుంది. నేటి యువత కేవలం సోషల్ మీడియా ట్రెండ్‌ల సృష్టికర్తలు మాత్రమే కాదు?- రేపటి సమాజ నిర్మాతలు.అందుకే అత్యున్నత స్థాయి పదవుల్లో ఉన్నవారు,పాలకులు యువతను విమర్శించే ముందు వారి ఆవేదనను వినాలి.మాట్లాడే ముందు సంయమనం పాటించాలి.రాజకీయ పార్టీలు యువత ఆకాంక్షలను అణిచి వేస్తున్నాయి. యువశక్తిని ఉపయోగించు కునే ముందు అర్థం చేసుకోవాలి. యువత కూడా ఆవేశం కంటే ఆలోచనతో స్పందించాలి. ఎందుకంటే? ప్రజాస్వామ్యంలో యువత గళం బలహీన స్వరం కాదు?.అకుంఠిత దీక్షతో, ప్రజాస్వామ్య పద్ధతిలో ప్రత్యామ్నాయాన్ని చూపించడం లోనే యువత భవిత,ప్రజా శ్రేయస్సు ఆధారపడి ఉంటుంది. చిత్తశుద్ధితో ఎంచుకున్న కార్యం లక్ష్యాన్ని చేరుకునే వరకు ఫలిత మేదైనా,దిశ మార్చు కుంటూ.. జోరు తగ్గేదేలే!-అంటూ ముందుకు సాగాలి.యువత ఆగ్రహానికి నియంతలే నేల కూలిన చరిత్రను స్ఫూర్తిగా తీసుకొని..దేశ భవిష్యత్తును మలిచేశక్తివంతమైన స్వరం ముమ్మాటికి యువతదే!.



మేకిరి దామోదర్
సామాజిక విశ్లేషకులు
వరంగల్ 9573666650

# నాగేశ్వర్ గొంతు నొక్కడం అంటే.. సమాజం కళ్ళు పొడవడమే!



తెలుగు రాష్ట్రాల సామాజిక, రాజకీయ యవనికపై 'ప్రొఫెసర్ కె. నాగేశ్వర్' ఒక నిష్పాక్షిక గొంతుక. జర్నలిస్టుగా, విద్యావేత్తగా, మాజీ శాసనమండలి సభ్యుడిగా దశాబ్దాలుగా ఆయన ప్రజాపక్షం వహిస్తూ, పాలకుల విధానాలను నిశితంగా విశ్లేషిస్తున్నారు. ఏ రాజకీయ పార్టీకీ లొంగని, రాజీపడని మేధావిగా ఆయనకు సమాజంలో ఒక ప్రత్యేక స్థానం ఉంది. అయితే, ఇటీవల ఒక టీవీ విశ్లేషణలో ఆయన చేసిన వ్యాఖ్యల నేపథ్యంలో ఆంధ్రప్రదేశ్ కూటమి ప్రభుత్వం వ్యవహరిస్తున్న తీరు, నమోదైన పోలీసు కేసులు కేవలం ఒక వ్యక్తిని టార్గెట్ చేయడం మాత్రమే కాదు, మొత్తం మేధో సమాజం యొక్క ప్రశ్నించే హక్కుపై సాగుతున్న దాడిగా పరిగణించాల్సి ఉంది. నాగేశ్వర్ గొంతు నొక్కడం అంటే.. ఖచ్చితంగా సమాజం కళ్ళు పొడవడమే..!

అయితే వివాదానికి మూలం ఈ నెల(మే నెల)లో జరిగిన ఒక టీవీ చర్చ. కేంద్ర హోంమంత్రి అమిత్ షాను ఏపీ డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్, మంత్రి నాదెండ్ల మనోహర్ కలిశారని, మాజీ సీఎం వైఎస్ జగన్‌ను అరెస్ట్ చేయాల్సిందిగా కోరగా.. అమిత్ షా తిరస్కరించారనే సమాచారాన్ని నాగేశ్వర్ ప్రస్తావించారు. దీనిపై జనసేన పార్టీ తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేయడంతో, ప్రొఫెసర్ నాగేశ్వర్ ఎంతో ఉన్నతమైన విలువలను ప్రదర్శించారు. ఏమాత్రం అహంకారానికి పోకుండా "నా వ్యాఖ్యలను పూర్తిగా బేషరతుగా ఉపసంహరించుకుంటున్నాను" అని లైవ్ టీవీలోనే ప్రకటించారు. ఒక సీనియర్ విశ్లేషకుడు ఇంతకంటే ప్రజాస్వామ్యబద్ధంగా ఎలా స్పందించగలరు..?

నాగేశ్వర్ ప్రకటనను మొదట జనసేన పార్టీ నాయకత్వం స్వాగతించి, వివాదాన్ని ముగించినట్లే కనిపించింది. కానీ క్షేత్రస్థాయిలో సీన్ పూర్తిగా మారిపోయింది. భారతీయ న్యాయ సంహిత (బీఎన్‌ఎస్) లోని తీవ్రమైన సెక్షన్ల కింద పలు చోట్ల వరుసగా కేసులు నమోదు చేశారు. ఇది చాలదన్నట్లు, రాజమండ్రి సభలో డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ "చర్యకు ప్రతిచర్య ఉంటుంది, కర్మ ఎవరినీ వదలదు" అని చేసిన వ్యాఖ్యలు ప్రొఫెసర్‌ను నేరుగా లక్ష్యంగా చేసుకుని చేసినవేనని మేధావులంతా ముక్తకంఠంతో ఖండిస్తున్నారు. ఒక ఉన్నత పదవిలో ఉన్న వ్యక్తి, చర్చల్లో వచ్చిన మాటలను మనసులో పెట్టుకుని ఇలాంటి వ్యాఖ్యలు చేయడం రాజకీయ కక్షసాధింపును స్పష్టం చేస్తోంది. ఇక ప్రొఫెసర్ నాగేశ్వర్‌ను అరెస్ట్ చేయడానికి ఏపీ పోలీసులు హైదరాబాద్ వస్తున్నారనే తీవ్రమైన ఊహాగానాలు చెలరేగాయి. పరిస్థితి ఎంతవరకు వెళ్లిందంటే, తెలంగాణ పోలీసులు ఆయన నివాసానికి, స్టూడియోలకు భద్రత కల్పించాల్సిన పరిస్థితి వచ్చింది. ఏపీ హోంమంత్రిత్వ శాఖ దీనిపై వివరణలు ఇచ్చుకుంటున్నప్పటికీ, భయాందోళనలు సృష్టించడమే పాలకుల ప్రధాన లక్ష్యంగా కనిపిస్తోంది. ఈ అణచివేత వైఖరిపై తెలుగు సమాజం ఒక్కటై గర్జిస్తున్న విషయం తెలిసిందే. మరోవైపు "నేను ముందస్తు బెయిల్ అడగను, అరెస్ట్‌కు సిద్ధంగా ఉన్నాను, జీవితంలో జైలు అనుభవం ఒక్కటే లేదు.. దాన్ని కూడా చూస్తాను" అంటూ నాగేశ్వర్ పాలకుల అహంకారానికి ధీటైన సవాల్ విసిరారు. అయితే ప్రజాస్వామ్యంలో విమర్శ అనేది పాలకులను సరిదిద్దే ఒక అద్భుతమైన ఔషధం. అధికార గర్వంతో విమర్శించే గొంతుకలను నొక్కేయాలని చూస్తే, చరిత్రలో ఏ పాలకుడికీ మంచి రోజులు రాలేదు. ప్రొఫెసర్ నాగేశ్వర్‌పై పెట్టిన అక్రమ కేసులను ఏపీ ప్రభుత్వం వెంటనే ఉపసంహరించుకోవాలి. మేధావులను వేధించడం ఆపకపోతే, రేపు ప్రజాగ్రహం ముందు ఏ అధికార పీఠాలూ నిలబడలేవనేది జగమెరిగిన సత్యం. మేధోగళంపై సాగుతున్న ఈ అణిచివేతను ప్రజాస్వామ్యవాదులంతా ఏకతాటిపైకి వచ్చి ఖండించాల్సిన అవసరం ఉంది.



రాజేందర్ దామెర (దారా)
సీనియర్ జర్నలిస్ట్

# విజయన్‌పై ఈడీ దాడుల వెనుక బీజేపీ, కాంగ్రెస్ హస్తం

- సీపీఐ(ఎం) పొలిట్ బ్యూరో సభ్యులు బీవీ రాఘవులు



**ముషీరాబాద్, మే 28 (జనం సాక్షి) :** బీజేపీ దుర్మార్గాలకు, మతోన్మాద శక్తులకు వ్యతిరేకంగా పోరాడుతున్న తమ పార్టీ నాయకులను కేసులతో భయపెట్టడం, బెదిరింపులకు దిగడం వంటి చర్యలకు మోడీ సర్కారు పూనుకున్నదని సీపీఐ(ఎం) పొలిట్‌బ్యూరో సభ్యులు బీవీ.రాఘవులు విమర్శించారు. బెదిరింపులకు, కేసులకు భయపడబోమనీ, ప్రతిఘటనా ఉద్యమాలతో మరింత బలపడతామని నొక్కి చెప్పారు. కేరళం మాజీ సీఎం పినరయి విజయన్‌పై ఈడీ దాడులను నిరసిస్తూ గురువారం హైదరాబాద్‌లోని ఆర్టీసీ క్రాస్‌రోడ్‌లో సీపీఐ(ఎం) ఆధ్వర్యంలో నిరసన కార్యక్రమం చేపట్టారు. ముందుగా ఎంబీ భవన్ (సీపీఎం రాష్ట్ర కార్యాలయం) నుంచి ఆర్టీసీ క్రాస్ రోడ్డు వరకు నినాదాలు చేస్తూ ప్రదర్శన నిర్వహించారు. ఈడీ, మోడీ గో బ్యాక్ గోబ్యాక్, పినరయి విజయన్ ఇంటిపై ఈడీ దాడిని ఖండించండి, మోడీ, ఈడీ డౌన్‌డౌన్, బీజేపీ రాజకీయ కక్ష? సాధింపు చర్యలను అడ్డుకుందాం..అడ్డుకుందాం.. అంటూ నినాదాలు చేశారు. ఆర్టీసీ క్రాస్ రోడ్డు వద్ద నిరసనలో రాఘవులు మాట్లాడుతూ..కేరళం మాజీ సీఎం, పొలిట్ బ్యూరో సభ్యులు పినరయి విజయన్‌పై ఒక్క అవినీతి కేసు కూడా లేదన్నారు. ఈడీ చెబుతున్న కేసులో నిందితులుగానీ, ఆ సంస్థగానీ ఏనాడూ విజయన్ పేరును ప్రస్తావించలేదని ఎత్తిచూపారు. ఇది ముమ్మాటికీ రాజకీయ దాడేనని తేల్చిచెప్పారు. విచారణల పేరుతో దాడులు చేయడం వామపక్షాలను, సీపీఐ(ఎం)ను దెబ్బతీయడంలో భాగమేనన్నారు. కేంద్ర దర్యాప్తు సంస్థలతో దాడులు చేయించడం బీజేపీకి కొత్తగాదనీ, బీజేపీకి ఆటంకంగా మారిన కేజ్రీవాల్, సిసోడియా, ఆప్ నేతలు, జార్ఖండ్ సీఎం సోరెన్, తదితరులపై ఈడీని ప్రయోగించి రాజకీయంగా అణచివేసిందని విమర్శించారు. మరికొందరు నేతలను తనవైపు తిప్పుకుని, లొంగదీసుకుని సీఎంలను చేసిందని గుర్తుచేశారు. కాంగ్రెస్ అగ్రనేతలు సోనియాగాంధీ, రాహుల్‌గాంధీలపై ఈడీ కేసులు పెట్టి విచారణల పేరుతో కోర్టుల చుట్టూ తిప్పిందని గుర్తుచేశారు. ప్రజలకు, ప్రతిపక్షాలకు విమర్శించే హక్కు, ప్రశ్నించే గొంతుకలు ఉండాలనే ఉద్దేశంతో కేంద్ర దర్యాప్తు సంస్థల దాడులను సీపీఐ(ఎం) ఖండిస్తూ వస్తోందన్నారు. కాంగ్రెస్ పార్టీ నిధులను ఐటీ స్తంభింపజేస్తే కూడా సీపీఐ(ఎం) ఖండించిందని గుర్తుచేశారు. ఇప్పుడు ప్రజలను సమీకరించి ప్రతిఘటించే ఉద్యమాలు చేసే సీపీఐ(ఎం) నాయకులపై ఈ విధంగా దాడులు జరుగుతుంటే కాంగ్రెస్ నేతల మౌనం వెనుక మర్మం ఏంటని ప్రశ్నించారు. కేరళంలో సీపీఐ(ఎం) బలహీనం చేయాలనే దుర్మార్గపూరిత ఆలోచనతో కాంగ్రెస్, బీజేపీలు కలిపి ఈ దాడికి ఉసిగొల్పాయనే అనుమానాలు వ్యక్తమవుతున్నాయని విమర్శించారు. ఇటీవల కొత్త ముఖ్యమంత్రి వీడీ సతీశన్ ప్రధాని మోడీని కలిసినప్పుడు విజయన్‌ను అరెస్టు చేయాలని ఒత్తిడి తెచ్చారనే అనుమానాలు కలుగుతున్నాయని చెప్పారు. విజయన్‌ను అరెస్టు చేయాలని రాహుల్‌గాంధీ, రేవంత్‌రెడ్డి ఎన్నికల ప్రచారంలో డిమాండ్ చేసిన విషయాన్ని ప్రస్తావించారు. ప్రజాస్వామ్యం ముఖ్యమా? బీజేపీ నియంతృత్వానికి సహకరించడం ముఖ్యమా? అనే విషయాన్ని కాంగ్రెస్ తేల్చుకోవాలని సూచించారు. ఢిల్లీలో సీపీఐ(ఎం) అఖిల భారత ప్రధాన కార్యదర్శి ఎంఏ బేబీ, పొలిట్‌బ్యూరో సభ్యులు బృందాకరత్, తదితరులు నిరసన తెలియజేసినందుకు అరెస్టు చేసి నిర్బంధించడాన్ని తప్పుబట్టారు. విజయన్‌పైనే కాదు ఇంకెంత మంది సీపీఐ(ఎం) నాయకులపై కేసులు పెట్టి వేధించినా బీజేపీకి, మతోన్మాద శక్తులకు వ్యతిరేకంగా ప్రజాస్వామిక, లౌకిక శక్తులను కలుపుకుని సీపీఐ(ఎం) పోరాడుతుందని స్పష్టం చేశారు. ఆ పోరాటంలో కలిసి రావాలని ప్రజలకు పిలుపునిచ్చారు.

సీపీఐ(ఎం) రాష్ట్ర కార్యదర్శి జాన్‌వెస్లీ మాట్లాడుతూ..పినరయి విజయన్‌పై ఈడీ దాడులను ఖండిస్తున్నామన్నారు. ప్రతిపక్ష పార్టీలను దెబ్బతీసి అప్రతిష్టపాలు చేయడానికి అక్రమ కేసులు పెట్టడం, పార్టీలను చీల్చడం వంటి నియంతృత్వధోరణులను కొనసాగించడానికి రాజ్యాంగ సంస్థలను బీజేపీ వాడుకుంటున్నదని విమర్శించారు. ఇలాంటి దాడులు జరుగుతుంటే కాంగ్రెస్ పార్టీ గమ్ముగా ఉంటే ఆ పార్టీ మరింత నిర్వీర్యం అవుతుందని హెచ్చరించారు. మోడీ సర్కారు అప్రజాస్వామిక విధానాలను మేధావులు, ప్రజాస్వామికవాదులు, ప్రజలు ఖండించాలని కోరారు. ఈ కార్యక్రమంలో సీపీఐ(ఎం) కేంద్ర కమిటీ సభ్యులు టి.జ్యోతి, ఎస్.వీరయ్య, జి.నాగయ్య, రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు జూలకంటి రంగారెడ్డి(మాజీ ఎమ్మెల్యే), చుక్క రాములు, టి.సాగర్, పాలడుగు భాస్కర్, అబ్బాస్, మల్లులక్ష్మి, బండారు రవికుమార్, పి.ప్రభాకర్, నున్నా నాగేశ్వర్‌రావు, రాష్ట్ర కమిటీ సభ్యులు, హైదరాబాద్ జిల్లా నాయకులు తదితరులు పాల్గొన్నారు.

## మొలకెత్తిన ధాన్యాన్ని చూసి చలించిపోయిన మాజీ మంత్రి



**వనపర్తి రూరల్, మే 28 (జనం సాక్షి) :** మాజీ మంత్రి సింగిరెడ్డి నిరంజన్ రెడ్డి మంగళవారం కురిసిన అకాల వర్షాలకు తడిసిన ధాన్యాన్ని పరిశీలిస్తూ పలు మండలాల్లో, గ్రామాలలో ఐ.కె.పి సెంటర్స్, సింగిల్ విండో సెంటర్స్, మిగతా కొనుగోలు కేంద్రాలలో విస్తృతంగా పర్యటించి తడిసి మొలకెత్తిన ధాన్యాన్ని చూసి రైతులు పడుతున్న హరిగోస చూసి చలించిపోయిన మాజీ మంత్రి సింగిరెడ్డి నిరంజన్ రెడ్డి రైతులను ఓదార్చి ధైర్యం చెప్పారు. రాష్టములో 5లక్షల 42వేల మెట్రిక్ టన్నుల ధాన్యం పండిందని ప్రభుత్వం 90లక్షల ధాన్యం సేకరణ చేస్తున్నామని చెప్పి అందులో కూడా 40శాతం కొనుగోలు చేయలేదని విమర్శించారు. రైతు వేదికలను ఉపయోగించుకొని అందులో ధాన్యాన్ని నిలువచేసే అవకాశాన్ని పరిశీలించాలని విజ్ఞప్తి చేశారు. లారీలు, ట్రక్కులు లేని వారికి ట్రాన్స్పోర్ట్ ఏజెన్సీలు ఇచ్చారు అని విచారణ చేసి చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు. తడిసిన,మొలకెత్తిన ధాన్యాన్ని మద్దతు ధరతో కొనుగోలు చేయాలని విజ్ఞప్తి చేశారు. మాజీ మంత్రి వెంట జిల్లా రైతు సమితి మాజీ అధ్యక్షులు జగదీశ్వర్ రెడ్డి, జిల్లా మీడియా కన్వీనర్ నందిమల్ల అశోక్,మాజీ ఎం.పి.పి కృష్ణా నాయక్, మండల పార్టీ అధ్యక్షుడు రాళ్ల.కృష్ణయ్య, మన్నే గౌడ్, పులిందర్, పీన్య నాయక్, ప్రతాప్, శివ, లక్మన్, మాజీ ప్రజాప్రతినిధులు, నాయకులు కార్యకర్తలు ఉన్నారు.

## పశువుల అక్రమ రవాణాపై ఏసీపీ ఉక్కుపాదం



**ఇబ్రహీంపట్నం, మే 28 (జనం సాక్షి) :** ఆవులు, దూడల అక్రమ రవాణాను పూర్తిగా అరికట్టడమే లక్ష్యంగా ఇబ్రహీంపట్నం ఏసీపీ కె.పి.వి. రాజు యాక్షన్ ప్లాన్ ప్రారంభించారు. మంచాల పోలీస్ స్టేషన్ పరిధిలోని అగపల్లి గ్రామ పంచాయతీ వద్ద ఏర్పాటు చేసిన సరుకు రవాణా వాహనాల చెక్‌పాయింట్‌ను ఆయన గురువారం ఆకస్మికంగా సందర్శించి, క్షేత్రస్థాయిలో తనిఖీ చేశారు. ఈ సందర్భంగా చెక్‌పోస్ట్ వద్ద విధుల్లో ఉన్న పోలీస్ అధికారులకు, సిబ్బందికి ఏసీపీ రాజు పలు కీలక ఆదేశాలు జారీ చేశారు. రహదారి మీదుగా వెళ్లే ప్రతి సరుకు రవాణా వాహనాన్ని నిమిషాల వ్యవధిలోనే కాకుండా, కూలంకషంగా సోదా చేసిన తర్వాతే ముందుకు అనుమతించాలని స్పష్టం చేశారు. ముఖ్యంగా అర్ధరాత్రి, తెల్లవారుజామున అక్రమ రవాణా జరిగే అవకాశం ఉన్నందున ఆ సమయాల్లో ప్రత్యేక నిఘా ఉంచాలని సూచించారు. నిబంధనలను ఉల్లంఘించి మూగజీవాలను అక్రమంగా తరలిస్తే సదరు వాహనాలను సీజ్ చేయడంతో పాటు బాధ్యులపై కఠిన చట్టపరమైన కేసులు నమోదు చేయాలని మంచాల పోలీసులను ఆదేశించారు. శాంతిభద్రతల పరిరక్షణతో పాటు మూగజీవాల రక్షణకు పోలీసులు నిరంతరం అప్రమత్తంగా ఉండాలని ఆయన పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో మంచల్ సబ్ ఇన్స్పెక్టర్ మరియు పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

# కొనుగోలు కేంద్రాన్ని సందర్శించిన మాజీ ఎమ్మెల్యే పద్మ దేవేందర్ రెడ్డి

**నార్సంగి, మే 28 (జనం సాక్షి) :** ధాన్యం కొనుగోళ్ల లో కాంగ్రెస్ ప్రభుత్వం పూర్తిగా విఫలమై రైతులను తీవ్ర ఇబ్బందులకు గురి చేస్తోందని మాజీ డిప్యూటీ స్పీకర్, మెదక్ జిల్లా బీఆర్ఎస్ పార్టీ అధ్యక్షురాలు పద్మా దేవేందర్ రెడ్డి ఆరోపించారు. మెదక్ జిల్లా నార్సింగి మండల పరిధి లోని శేరిపల్లి లో ఐకేపీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని పద్మా దేవేందర్ రెడ్డి సందర్శించారు. ఈ సందర్భంగా పద్మ దేవేందర్ రెడ్డి మాట్లాడుతూ ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను అమలు చేయడంలో ప్రభుత్వం విఫలమైందని, రైతు బీమా చెల్లింపులు నిలిపివేయడం తో రైతులకు తీవ్ర నష్టం జరిగిందని విమర్శించారు. 420 హామీలను అమలు చేయకుండా కాలయాపన చేస్తున్న కాంగ్రెస్ ప్రభుత్వం రైతులను నట్టేట ముంచిందని మండిపడ్డారు. రాష్ట్ర, కేంద్ర ప్రభుత్వాలు రైతుల సమస్యలను పట్టించుకోవడం లేదని, 50 శాతం ధాన్యం కూడా కొనుగోలు చేయకుండా రైతులను ఇబ్బందులకు గురి చేస్తున్నాయని ఆగ్రహం వ్యక్తం చేశారు. మూడు రోజులలో ధాన్యం కొనుగోళ్లు పూర్తి చేయాలని, లేని పక్షంలో బీఆర్ఎస్ ఆధ్వర్యంలో భారీ ఆందోళనలు చేపడతామని హెచ్చరించారు. పంట చేతికి వచ్చి 35 రోజులు గడిచినా మెదక్ నియోజకవర్గంలోని ఏ కొనుగోలు కేంద్రంలోనూ పూర్తిస్థాయి లో వడ్ల కొనుగోలు జరగలేదని, రైతులు కొనుగోలు కేంద్రాల వద్ద రోజుల తరబడి ఎదురు చూస్తున్నారని తెలిపారు. డీజిల్ పై రాష్ట్ర ప్రభుత్వం 31 రూపాయల సుంకం వసూలు చేస్తోందని, అందులో కనీసం 10 రూపాయలు తగ్గించి ప్రజలకు ఉపశమనం కల్పించాలని బీఆర్ఎస్ పార్టీ మెదక్ జిల్లా అధ్యక్షురాలు, మాజీ డిప్యూటీ స్పీకర్ పద్మా దేవేందర్ రెడ్డి డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ పార్టీ నార్సింగి మండల అధ్యక్షుడు మైలారం బాబు, చిన్న శంకరం పేట అధ్యక్షుడు పట్లోరి రాజు, కొల్కూరి లక్ష్మారెడ్డి, మల్లు పల్లి సర్పంచ్ ఇమ్మడి నరేష్, వార్డు సభ్యులు అరుణ్ యాదవ్, కందరి



శ్రీనివాస్, మల్లేశం, మాజీ సర్పంచ్ లు యాదగిరి యాదవ్, శ్రీనివాస్ రెడ్డి, దయానంద్ యాదవ్, మండల నాయకులు పడాల శ్రీనివాస్, ఏమ వెంకటేశం,సిద్ది రాములు, మహేష్ గౌడ్, అంజయ్య, నర్సింగరావు, స్వామి గౌడ్, యాదగిరి, ఇండ్ల శ్రీనివాస్, సురేష్ తదితరులు పాల్గొన్నారు.

## మల్లారెడ్డి మృతి బాధాకరం

- ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్



**కేశంపేట, మే 28 (జనం సాక్షి) :** కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు సింగిడి మల్లారెడ్డి మృతి చాలా బాధాకరమని ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ అన్నారు. మల్లారెడ్డి మృతి చెందిన విషయాన్ని తెలుసుకున్న ఎమ్మెల్యే శంకర్, మాజీ ఎమ్మెల్యే చౌలపల్లి ప్రతాప్ రెడ్డి కాంగ్రెస్ పార్టీ మండల నేతలతో కలిసి మండల పరిధిలోని కాకునూరు గ్రామంలో మల్లారెడ్డి భౌతిక దేహానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. కుటుంబ సభ్యులను పరామర్శించి ప్రగాఢ సానుభూతిని వ్యక్తం చేశారు. మల్లారెడ్డి మృతి కాంగ్రెస్ పార్టీకి తీరని లోటని అన్నారు. కుటుంబ సభ్యులకు పార్టీ తరపున అండగా ఉంటామన్నారు. మండల బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షులు పట్లూరి జగదీశ్వర్, కాంగ్రెస్ పార్టీ మండల మాజీ అధ్యక్షులు గూడ వీరేష్, కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు రమేష్, కాంగ్రెస్ పార్టీ మండల మహిళా అధ్యక్షురాలు రాణి, సర్పంచులు లంకాల సురేష్ రెడ్డి , కొట్టం నరేందర్ రెడ్డి, భాస్కర్ గౌడ్, ఉప సర్పంచ్ జయమ్మ, మార్కెట్ కమిటీ డైరెక్టర్ కరుణాకర్, నాయకులు బీస కరుణాకర్ రెడ్డి, యెన్నం శ్రీధర్ రెడ్డి, త్రిప్పిశెట్టి సుదర్శన్, కోడూరు రాములు, అనసూయమ్మ, రావుల పెంటయ్య, పర్వతాలు, కోడూరు శ్రీశైలం, ఏదిరే శ్రీశైలం, ఏదిరే మల్లేష్, డోల రాజు, సొంటె చంద్రయ్య, పంది లింగమయ్య, గోపని భీమయ్య, మోటే శ్రీనయ్య, వార్డు సభ్యులు కోడూరు నర్సింలు, ఏదిరే అరుణ తదితరులు బాధిత కుటుంబాన్ని పరామర్శించిన వారిలో ఉన్నారు.

## ప్రపంచం చూపు..ఫ్యూచర్ సిటీ వైపు..

- పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి,శ్రీధర్ బాబు



**మహేశ్వరం, మే 28 (జనంసాక్షి) :** ఫ్యూచర్ సిటీ వైపు ప్రపంచం చూస్తుందన్నారు. ఫ్యూచర్ సిటీని ప్రపంచ స్థాయి గ్లోబల్ సిటీగా తీర్చిదిద్దాలన్నదే రాష్ట్ర ప్రభుత్వ లక్ష్యమని మంత్రులు పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి,శ్రీధర్ బాబు అన్నారు.గురువారం రంగారెడ్డి జిల్లా కందుకూరు మండలం మీర్కాన్ పేట్ లో ఫ్యూచర్ సిటీ డెవలప్మెంట్ అథారిటీ కార్యాలయ నిర్మాణ పనులను పరిశీలించారు. ఈ సందర్భంగా మంత్రులు పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి, శ్రీధర్ బాబు మాట్లాడుతూ... గ్లోబల్ ప్రెజెన్స్ కలిగిన ప్రభుత్వ కార్యాలయాలను ఫ్యూచర్ సిటీ నుంచి నిర్వహించేలా ప్రణాళికలు రూపొందిస్తున్నామన్నారు.ప్రస్తుతం వేస్తున్న పునాదులపై రాబోయే రోజుల్లో ఆధునిక నిర్మాణాలు వెలిసేలా చర్యలు తీసుకుంటామన్నారు.కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలోనే ఫ్యూచర్ సిటీ నిర్మాణాన్ని పూర్తి చేస్తామన్నారు.ప్రభుత్వం ఏర్పడిన నాటి నుంచే ఆటుపోట్లను అధిగమిస్తూ సమస్యలను పరిష్కరిస్తూ సానుకూల దృక్పథంతో ప్రభుత్వం ముందుకు సాగుతుందన్నారు.ఫ్యూచర్ సిటీ ద్వారా లక్షలాది మంది నిరుద్యోగ యువతకు ఉపాధి,ఉద్యోగ అవకాశాలు వస్తాయన్నారు. భద్రత కల్పించడమే ప్రభుత్వ లక్ష్యమన్నారు.జూన్ 2 లేదా 3తేదినాడు సీఎం రేవంత్ రెడ్డి చేతుల మీదుగా ఫ్యూచర్ సిటీ డెవలప్మెంట్ అథారిటీ కార్యాలయం ప్రారంభోత్సవం జరుగుతుందన్నారు.ఈ కార్యక్రమంలో ఫ్యూచర్ సిటీ డెవలప్మెంట్ అథారిటీ కమిషనర్ శశాంక,మహేశ్వరం డీసీపీ నారాయణరెడ్డి ,పలు శాఖల అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## యువత ఆరోగ్యకరమైన జీవన విధానాన్ని అలవర్చుకోవాలి



**హయత్‌నగర్, మే 28 (జనం సాక్షి) :** ఉమ్మడి హయత్ నగర్ డివిజన్ లోని కమలానగర్ కాలనీలో తన హయాంలో మంజూరైన నిధులతో కాలనీలోని పార్క్ లో ఏర్పాటు కానున్న ఓపెన్ జిమ్ పనులను స్థానిక మాజీ కార్పొరేటర్ కళ్లెం నవజీవన్ రెడ్డి పరిశీలించారు. ఈ సందర్భంగా కళ్లెం నవజీవన్ రెడ్డి మాట్లాడుతూ ప్రజల ఆరోగ్యం దృష్ట్యా ప్రతి కాలనీలో పార్కులు, వాకింగ్ ట్రాక్‌లు, ఓపెన్ జిమ్‌ల వంటి సౌకర్యాలు అందుబాటులో ఉండాలని, యువతతో పాటు మహిళలు, వృద్ధులు కూడా ఆరోగ్యకరమైన జీవన విధానాన్ని అలవర్చుకునేందుకు ఇటువంటి సదుపాయాలు ఎంతో ఉపయోగపడతాయని తెలిపారు. కమలానగర్ కాలనీ ప్రజలు ఎంతోకాలంగా కోరుకుంటున్న ఓపెన్ జిమ్ ఏర్పాటుకు తమ హయాంలో నిధులు మంజూరు చేయించడం ఆనందంగా ఉందని, త్వరలోనే పనులు పూర్తి చేసి ప్రజలకు అందుబాటులోకి తీసుకురావాలని సంబంధిత అధికారులకు సూచించారు. పార్క్ పరిసరాలను మరింత అభివృద్ధి చేసి ప్రజలకు ఆహ్లాదకరమైన వాతావరణం కల్పించే దిశగా చర్యలు తీసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో కాలనీ అధ్యక్షులు మదన్ రెడ్డి, ప్రధాన కార్యదర్శి సుబ్బారావు, సంక్షేమ సంఘం సభ్యులు టీవీ రావు, భరత్ సింగ్, జగదీశ్వర్, వెంకటేష్ గౌడ్, కాలనీ వాసులు తదితరులు పాల్గొన్నారు.

## ప్రభుత్వం ధాన్యాన్ని వెంటనే కొనుగోలు చేయాలి

- ఐకేపీ సెంటర్‌ను సందర్శించిన సీపీఐ నేత నర్సింహా చారి



**చేర్యాల/ధూల్మిట్ట, మే 28 (జనంసాక్షి) :** మండలంలోని లింగాపూర్ గ్రామంలో వడ్లను వెంటనే కొనుగోలు చేయాలని సీపీఐ ధూల్మిట్ట మండల కార్యదర్శి వలబోజు నర్సింహా చారి ప్రభుత్వాన్ని డిమాండ్ చేసారు. గురువారం లింగాపూర్ గ్రామంలో రైతుల సమస్యలు అడిగి తెలుసుకున్నారు. వరి దాన్యాన్ని వెంటనే రైస్ మిల్లులకు దిగుమతి చేయాలని అన్నారు. గాలి వానతో కురిసిన వర్షానికి వడ్లు తడిచిపోతాయని ఆవేదన వ్యక్తం చేశారు. వరి ధాన్యం నోటికాడికి వచ్చిన నీల్ల పాలు అవుతాయని చాలా నష్టం వాటిల్లుతుందని అన్నారు. వెంటనే కలెక్టర్ దూలిమిట్ట మండలంలో అన్ని గ్రామాల్లో సందర్శించి రైతులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా భరోసా ఇవ్వాలని అన్నారు. లేని పక్షంలో రైతులను ఏకం చేసి కలెక్టర్ కార్యాలయాన్ని ముట్టడిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో సిపిఐ మండల సహాయ కార్యదర్శి అప్పయ్య, గిరి పద్మారెడ్డి, బాలరాజు, సంపత్ గ్రామ రైతులు పాల్గొన్నారు.

# మాయమాటలతో అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్

**బోడుప్పల్, మే 28 (జనంసాక్షి) :** మేడ్చల్ నియోజకవర్గం మల్కాజిగిరి మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని బోడుప్పల్ సర్కిల్‌లో పీర్జాదిగూడ మాజీ మేయర్ జక్క వెంకట్ రెడ్డి, బోడుప్పల్ బీఆర్ఎస్ పార్టీ అధ్యక్షులు మంద సంజీవరెడ్డి ఆధ్వర్యంలో బీఆర్ఎస్ బూత్ కమిటీ సభ్యుల విస్తృత స్థాయి సమావేశం జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా మేడ్చల్ ఇంచార్జ్ రాగిడి లక్ష్మారెడ్డి, చామకూర మహేందర్ రెడ్డి హాజరై, బూత్ కమిటీ సభ్యులకు నూతన డిజిటల్ సభ్యత్వ నమోదు మరియు (ఓటర్ల జాబితా సవరణ) అంశాలపై దిశా నిర్దేశం చేశారు. ఈ సందర్భంగా రాగిడి లక్ష్మారెడ్డి మాట్లాడుతూ.. రాజకీయాల్లో అధికారం కోల్పోవడం తాత్కాలికమేనని, విపక్షంలో ఉండే ఈ సమయం పార్టీ అంతర్గత బలాన్ని పెంచుకోవడానికి ఒక గొప్ప అవకాశం అని పేర్కొన్నారు. ఢిల్లీ కేంద్రంగా నడిచే కాంగ్రెస్, బీజేపీల కంటే.. తెలంగాణ ప్రయోజనాల కోసం హైదరాబాద్ నుంచే స్వతంత్రంగా నిర్ణయాలు తీసుకుంటూ పోరాడే ఏకైక శక్తి బీఆర్ఎస్ మాత్రమేనని స్పష్టం చేశారు. గత పదేళ్ల బీఆర్ఎస్ పాలనలో జరిగిన సంక్షేమం, అభివృద్ధిని, ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వ వైఫల్యాలను, 6 గ్యారెంటీలు, 420 హామీల అమలులో జరుగుతున్న జాప్యాన్ని ప్రజల్లోకి బలంగా తీసుకెళ్లాలని పిలుపునిచ్చారు. మాజీ మేయర్ జక్క వెంకట్ రెడ్డి మాట్లాడుతూ.. సాంకేతిక పరిజ్ఞానాన్ని వినియోగిస్తూ సోషల్ మీడియా ద్వారా పార్టీ సిద్ధాంతాలను ప్రజల్లోకి తీసుకెళ్లే "సోషల్ మీడియా వారియర్స్" తయారుచేయడమే లక్ష్యమని తెలిపారు. యువతను ఆకర్షించేందుకు డిజిటల్ సభ్యత్వ నమోదు కీలకమని అన్నారు. బీఆర్ఎస్‌లో చేరే ప్రతి కార్యకర్తకు ఇది సాధారణ రాజకీయ పోరాటం కాదని, తెలంగాణ పునర్నిర్మాణంలో రెండో దశ ఉద్యమమనే భావన కల్పించాలని నాయకులు పిలుపునిచ్చారు. నాయకత్వం క్షేత్రస్థాయిలో మరింత చురుకుగా పనిచేస్తే రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లో బీఆర్ఎస్ మళ్లీ తన పూర్వ వైభవాన్ని చాటుకుంటుందని ధీమా వ్యక్తం చేశారు. బోడుప్పల్ అధ్యక్షులు మంద సంజీవ రెడ్డి మాట్లాడుతూ ప్రస్తుత పరిస్థితుల్లో కార్యకర్తలకు ఆర్థిక భరోసా కంటే ఆత్మగౌరవ భరోసా, రాజకీయ రక్షణ చాలా ముఖ్యమని ఆయన ఉద్ఘాటించారు. కార్యకర్తలపై తప్పుడు కేసులు పెడుతూ వేధిస్తున్న కాంగ్రెస్ నాయకులకు భవిష్యత్తులో 70ఎమ్ ఎమ్ సినిమా చూపిస్తామని, రానున్న రోజుల్లో 'డీ అంటే డీ' అనే విధంగా తలపడతామని హెచ్చరించారు. బాధితులకు లీగల్ సెల్ ద్వారా తక్షణ ఉచిత న్యాయ సహాయం అందిస్తామని, స్థానిక నేతలు ఎల్లప్పుడూ కార్యకర్తలకు అందుబాటులో ఉంటారని భరోసా ఇచ్చారు. ఈ కార్యక్రమంలో మాజీ మేయర్ సామల బుచ్చిరెడ్డి, పోచారం మాజీ చైర్మన్ కొండల్ రెడ్డి, ప్రధాన కార్యదర్శి ఏడవల్లి రఘువర్ధన్



రెడ్డి, మాజీ కార్పొరేటర్లు కొల్తూరి మహేష్, దొంతిరి హరిశంకర్ రెడ్డి, మధుసూదన్ రెడ్డి, కౌడే పోచయ్య, సీనియర్ నాయకులు లేతాకుల రఘుపతి రెడ్డి, వర్కింగ్ ప్రెసిడెంట్ ఏనుగు మనోరంజన్ రెడ్డి, మహిళా అధ్యక్షురాలు నిర్మల, యూత్ అధ్యక్షులు ప్రభు, జావీద్ ఖాన్, ఆకుల మధుకర్, శ్యామల శ్రీను, బోడుప్పల్ నాయకులు కొత్త రవి గౌడ్, సామల సందీప్ రెడ్డి, కొత్త చక్రపాణి గౌడ్, కాటిపల్లి రాంచంద్రరెడ్డి, బండారం శ్రీధర్ గౌడ్, రమేష్ యాదవ్, మీసాల కృష్ణ, అలీం, రవికుమార్, ప్రతాప్ రెడ్డి, రాజిరెడ్డి, బాలమల్లేష్, నాగేశ్వర్ గౌడ్, బొమ్మక్ విశ్వనాథం, రాసాల మహేష్ యాదవ్, ఉప్పరి విజయ్, కీర్తణ్,మాజీ ఎంపీటీసీ లు, నాయకులు, బూత్కమిటీసభ్యులు తదితరులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# బ్రిడ్జి పనులను వేగవంతం చేయాలి

- మంత్రి డాక్టర్ వాకిటి శ్రీహరి



**మక్తల్, మే 28 (జనంసాక్షి) :** పనులను వేగవంతం చేసి బ్రిడ్జిని త్వరలో ప్రజలకు అందుబాటులోకి తేవాలని రాష్ట్ర పశుసంవర్ధక, క్రీడల శాఖ మంత్రి డాక్టర్ వాకిటి శ్రీహరి అధికారులు, కాంట్రాక్టర్లను ఆదేశించారు. గురువారం మక్తల్ మండలంలోని చిట్యాల వద్ద నూతనంగా చేపడుతున్న చిట్యాల – గజరందొడ్డి గ్రామాల మధ్య రూ.20 కోట్లతో నిర్మిస్తున్న బ్రిడ్జి కమ్ బారేజ్ నిర్మాణ పనులను మంత్రి పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన పనుల నిర్మాణ నాణ్యతను పరిశీలించి అధికారులకు తగు సూచనలు చేశారు. వర్షాకాలాన్ని దృష్టిలో ఉంచుకొని పనుల్లో వేగం పెంచాలని మంత్రి సూచించారు. వర్షాలకు ముందే బ్రిడ్జి కమ్ బారేజ్ నిర్మాణ పనులు పూర్తిచేసి ప్రజల ఇబ్బందులను తొలగించాలని ఆయన ఆదేశించారు. పనుల్లో నాణ్యతకు ప్రాధాన్యం ఇవ్వాలని కూడా స్పష్టం చేశారు. వీలైనంత త్వరగా పనులు పూర్తి చేసేందుకు మరింత వేగం పెంచాలని మంత్రి వాకిటి శ్రీహరి అధికారులు, కాంట్రాక్టర్లను మరోసారి ఆదేశించారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు బి. గణేష్ కుమార్, ఆనంద్ గౌడ్, శివరాంరెడ్డి, నజీర్ పాషా, బీజేపీ నాయకులు చిట్యాల లక్ష్మణ్, మాజీ ఎంపీటీసీ మారుతి గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

# ప్రభుత్వ పాఠశాలల్లోనే మెరుగైన విద్య



**తెలకపల్లి, మే 28 (జనం సాక్షి) :** ప్రభుత్వ పాఠశాలలోనే విద్యార్థులకు ఉచిత మెరుగైన విద్య, నైపుణ్య సౌకర్యాలు, పౌష్టికాహారం సాధ్యమని మండల విద్యాధికారి సి శ్రీనివాస్ రెడ్డి అన్నారు. బడిబాట కార్యక్రమంలో భాగంగా గురువారం ప్రభుత్వ పాఠశాలల్లో నూతన విద్యార్థుల ప్రవేశాల( అడ్మిషన్ల) కోసం మండల కేంద్రంలో ఇంటింటి ప్రచారం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్నవారు మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ప్రభుత్వ పాఠశాలలో చదివే విద్యార్థుల కోసం ఎన్నో రకాల సౌకర్యాలను కల్పిస్తుందని విద్యార్థులు సద్వినియోగం చేసుకొని విద్యలో రాణించాలని కోరారు. ఈ సందర్భంగా ప్రైవేట్ పాఠశాలలకు వెళ్తున్న 5 మంది విద్యార్థులను, వారి తల్లిదండ్రులను కలిసి ప్రభుత్వ పాఠశాలల్లో కలిగిస్తున్న సదుపాయాలు వారికి వివరించి 5 మంది విద్యార్థులను 1వతరగతిలో, ఇద్దరిని 6 వ తరగతి లో చేరడానికి ఒప్పించినట్లు వారు తెలిపారు. ఈ కార్యక్రమంలో మండల విద్యాధికారి శ్రీనివాస్ రెడ్డితోపాటు కాంప్లెక్స్ ప్రధానోపాధ్యాయులు శోభన బాబు, అంగన్వాడీ ఉపాధ్యాయులు చంద్రకళ, రాధ విద్యార్థుల తల్లిదండ్రులు విద్యార్థులు పాల్గొన్నారు.

# ధాన్యం తరలింపును వేగవంతం చేయాలి



**జడ్చర్ల, మే 28 (జనంసాక్షి) :** వరి ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో సేకరించిన ధాన్యాన్ని వెంటనే సమీప రైస్ మిల్లులకు తరలించి, కొనుగోలు ప్రక్రియను మరింత వేగవంతం చేయాలని పౌర సరఫరాల శాఖ జిల్లా మేనేజర్ రవి నాయక్, జిల్లా పౌర సరఫరాల అధికారి గంప శ్రీనివాస్ ఆదేశించారు. గురువారం రాజాపూర్, చిన్నవెల్లి గ్రామాల్లోని పి.ఏ.సి.ఎస్, ఐ.కె.పి కొనుగోలు కేంద్రాలను వారు క్షేత్రస్థాయిలో పరిశీలించారు. కేంద్రాల్లో నిల్వ ఉన్న ధాన్యాన్ని వచ్చే మూడు రోజుల్లోగా పూర్తిగా మిల్లులకు చేర్చేలా అదనపు లారీలు, ట్రాక్టర్లను ఏర్పాటు చేయాలని రవాణా కాంట్రాక్టర్లను, నిర్వాహక ఏజెన్సీలను వారు స్పష్టం చేశారు. రైతులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా కొనుగోళ్లు పూర్తి చేయడమే ప్రభుత్వ లక్ష్యమని అధికారులు పేర్కొన్నారు.

# ధాన్యం కొనుగోలులో ప్రభుత్వం విఫలం



**వెల్దుర్తి, మే 28 (జనం సాక్షి) :** రైతులు ఆరుగాలం కష్టపడి పండించిన పంటను కొనుగోలు చేయడంలో ప్రభుత్వం పూర్తిగా విఫలమైందని నర్సాపూర్ ఎమ్మెల్యే వాకిటి సునీత లక్ష్మారెడ్డి అన్నారు గురువారం ఆమె రైతులతో కలిసి వెల్దుర్తి నర్సాపూర్ ప్రధాన రహదారిపై ధర్నా కార్యక్రమాన్ని నిర్వహించారు ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ. కాంగ్రెస్ ప్రభుత్వం రైతుల సమస్యలను పూర్తిగా విస్మరిస్తున్నదని ఆమె అన్నారు పండించిన పంట కొనుగోలు కేంద్రాలలో నెలలు దాటుతున్న ఇప్పటివరకు కొనకపోవడంపై ఆమె తీవ్రంగా మండిపడ్డారు అకాల వర్షాలకు ధన్యమంతా తడిసి ముద్దయి మొలకలు వచ్చిన పరిస్థితి ఉన్నదని ఎద్దు ఏడ్చిన యవసం, రైతు ఏడ్చిన రాజ్యం బాగుపడ్డట్టు చరిత్రలో బాగుపడలేదన్నారు. తడిసిన మరియు మొల్కెత్తిన ధాన్యాన్ని వెంటనే కొనుగోలు చేసి లారీల ద్వారా రైస్ మిల్లులకు పంపియాలని ఆమె డిమాండ్ చేశారు ఘటనా స్థలానికి తూప్రాన్ సీఐ వెంకట్ రాజ్ గౌడ్ చేరుకొని ఆందోళనకారులను నచ్చజెప్పి వెంటనే లారీలను పంపిస్తానని హామీ ఇవ్వడంతో దీక్షను విరమించారు ఈ కార్యక్రమంలో మండల పార్టీ అధ్యక్షులు భూపాల్ రెడ్డి మాజీ జడ్పిటిసి రమేష్ గౌడ్, కోదండ కృష్ణ గౌడ్ శ్రీనివాస్ రెడ్డి అశోక్ గౌడ్ రమేష్ చందర్ ఆయా గ్రామాల సర్పంచులు మాజీ ఎంపీటీసీలు రైతు సంఘాల నాయకులు తదితరులు పాల్గొన్నారు.

# సమన్వయంతో కొనుగోలు చేయాలి

- జిల్లా కలెక్టర్ హేమంత్ కేశవ పాటిల్
- వరి కొనుగోలు కేంద్రాన్ని తనిఖీ

**తెలకపల్లి, మే 28 (జనం సాక్షి) :** వరి కొనుగోలును రైతులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా సమన్వయంతో కొనుగోలు చేయాలని నాగర్ కర్నూల్ జిల్లా కలెక్టర్ హేమంత్ కేశవ పాటిల్ అన్నారు గురువారం. మండలం పరిధిలోని చిన్న ముద్దునూరు గ్రామంలో ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న వరి కొనుగోలు కేంద్రాన్ని ఆకస్మికంగా తనిఖీ చేశారు. తడిసిన ధాన్యాన్ని తప్ప కుండా కొనుగోలు చేస్తామని, రైతులు ఎటువంటి ఆందోళన చెందాల్సిన అవసరం లేదని జిల్లా కలెక్టర్ హేమంత్ కేశవ్ పాటిల్ తెలిపారు. ఈ సందర్భంగా కొనుగోలు కేంద్రంలోని ధాన్యం కొనుగోళ్ల నిర్వహణ, రవాణా, నమోదు ప్రక్రియలు, కాంటా వివరాలను కేంద్ర నిర్వాహకులను అడిగి తెలుసుకున్నారు. రైతులకు అందుతున్న సౌకర్యాలు, వరి తూకం విధానం, నాణ్యత ప్రమాణాలు, రికార్డుల నిర్వహణ తదితర అంశాలను స్వయంగా పరిశీలించారు. రిజిస్టర్‌లు, ట్రక్ షీట్లను తనిఖీ చేసిన కలెక్టర్ ఇప్పటివరకు ఎన్ని లారీలు



కేంద్రానికి చేరుకున్నాయి, ఎన్ని అన్‌లోడింగ్ పూర్తయ్యాయి, ప్రస్తుతం మిల్లులో ఎన్ని లారీలు ఉన్నాయనే వివరాలను అధికారులను అడిగి తెలుసుకున్నారు. ధాన్యం నిల్వలు ఎక్కువకాలం కేంద్రాల్లో నిల్వ ఉండకుండా వేగవంతంగా లోడింగ్ పూర్తి చేయాలని సూచించారు. రైతులకు ఇబ్బందులు తలెత్తకుండా కొనుగోళ్లు, రవాణా, చెల్లింపుల ప్రక్రియలను సమన్వయంతో త్వరితగతిన పూర్తి చేయాలని ఆదేశించారు. వరి కొనుగోలు ప్రక్రియ పూర్తిగా పారదర్శకంగా ఉండాలని, రైతుల నుంచి ఎట్టి పరిస్థితుల్లోనూ అదనపు ఛార్జీలు వసూలు చేయరాదని స్పష్టం చేశారు. అలాంటి ఘటనలు వెలుగులోకి వస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. కొనుగోలు కేంద్రానికి వచ్చిన రైతులతో కలెక్టర్ మాట్లాడి వారి సమస్యలను తెలుసుకున్నారు. పంటను విక్రయించేందుకు వచ్చిన రైతులకు ఆలస్యం లేకుండా వెంటనే కొనుగోళ్లు పూర్తి చేయాలని, వరి బస్తాల తూకంలో పారదర్శకత పాటించాలని అధికారులకు సూచించారు. కొనుగోలు చేసిన ధాన్యాన్ని వెంటనే మిల్లులకు తరలించేలా చర్యలు తీసుకోవాలని చెప్పారు. రైతుల కోసం తాగునీరు, నీడ, కూర్చునే సదుపాయాలు వంటి మౌలిక వసతులు అందుబాటులో ఉండేలా చూడాలని సంబంధిత అధికారులకు ఆదేశించారు. రైతులు ఇబ్బందులు ఎదుర్కొంటే వెంటనే స్పందించి సమస్యలను పరిష్కరించాలని తెలిపారు. ప్రభుత్వం నిర్దేశించిన మార్గదర్శకాల ప్రకారం వరి కొనుగోలు ప్రక్రియను కచ్చితంగా అమలు చేయాలని, రైతులకు కనీస మద్దతు ధర పూర్తిస్థాయిలో చర్యలు తీసుకోవాలన్నారు. అకాల వర్షాల నేపథ్యంలో రైతులు నష్టపోకుండా ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలని అధికారులను ఆదేశిస్తూ, ప్రభుత్వం రైతుల ప్రయోజనాల పరిరక్షణకు కట్టుబడి ఉందని తెలిపారు.

# రాజకీయ దురుద్దేశంతోనే ఈడీ దాడులు

- సిపిఎం ఆధ్వర్యంలో నిరసన

**సంగారెడ్డి టౌన్, మే 28 (జనం సాక్షి) :** కేరళ మాజీ ముఖ్యమంత్రి పినరాయి విజయన్‌పై రాజకీయ దురుద్దేశంతోనే ఈడీ దాడులు జరుగుతున్నాయని, బీజేపీ, కాంగ్రెస్ పార్టీల అపవిత్ర కూటమిల బురదజల్లే విధానాలు మానుకోవాలని సీపీఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు సాయిలు అన్నారు. గురువారం సంగారెడ్డిలో కేరళ మాజీ ముఖ్యమంత్రి, సీపీఎం పొలిట్ బ్యూరో సభ్యులు పినరాయి విజయన్ పై ఈడీ దాడులను నిరసిస్తూ నిరసన కార్యక్రమం చేయడం జరిగింది. ఈ సందర్భంగా సాయిలు మాట్లాడుతూ రాజకీయ ప్రత్యర్థులను వేటాడేందుకు కేంద్ర ఏజెన్సీలను ఉపయోగించే కేంద్ర బిజెపి ప్రభుత్వ ఫాసిస్టు పద్ధతిలో వ్యవహరిస్తుందని అన్నారు. ఆ రాష్ట్రంలోని యూడీఎఫ్ ప్రభుత్వం కూడా బీజేపీకి అనుసంధంగా పని చేస్తుందని అన్నారు. సిపిఎం పొలిట్‌బ్యూరో సభ్యుడు, అసెంబ్లీ ప్రతిపక్ష నాయకుడు పినరయి విజయన్ నివాసంలో ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ (ఈడీ) సోదాలను తీవ్రంగా ఖండిస్తున్నామన్నారు. ఈ చర్యలు రాజకీయ కక్షసాధింపులో భాగమని బిజెపి, కాంగ్రెస్ మధ్య అపవిత్ర కూటమికి నిదర్శనమన్నారు. రాజకీయ కక్ష సాధింపు చర్యల్లో భాగంగా




కేంద్ర ప్రభుత్వం ఈ ప్రణాళికాబద్ధమైన చర్యకు పాల్పడటం సిగ్గుచేటన్నారు. తిరువనంతపురంలోని పినరయి విజయన్ అద్దె నివాసం, కన్నూర్‌లోని ఆయన కుటుంబ నివాసంలో ఏకకాలంలో ఈ సోదాలు చేశారన్నారు. ఢిల్లీలో బీజేపీ, కాంగ్రెస్‌లు సంయుక్తంగా తీసుకున్న రాజకీయ నిర్ణయమే ఈ ఈడీ చర్యకు కారణమన్నారు. ఈ కుట్రలకు సీపీఎం బెదిరెదిలేదన్నారు. ఈ కార్యక్రమంలో సిపిఎం జిల్లా కమిటి సభ్యులు యాదగిరి, కృష్ణ, నాయకులు అశోక్, అర్జున్, లక్మన్, దత్తు, మంజుల, విఠల్, మల్లారెడ్డి, సుజాత తది తరులు పాల్గొన్నారు.

# గోవును జాతీయ జంతువుగా ప్రకటించాలి



**నారాయణపేట, మే 28 (జనం సాక్షి) :** గోవును జాతీయ జంతు వుగా ప్రకటించాలని డిమాండ్ చేస్తూ గురువారం నారాయణపేట జిల్లా కేంద్రం లో విశ్వహిందూ పరిషత్, బజరంగ్దళ్ నాయకులు డిమాండ్ చేశారు. పవిత్ర గోమాత వధను ప్రోత్సహిం చేలా ఓ వర్గం చేస్తున్న కుట్ర ను విశ్వహిందూ పరిషత్ తీవ్రంగా ఖండించింది. ఇం దులో భాగంగా జిల్లా కేంద్రం లోని వీరసావర్కర్ చౌరస్తాలో గురువారం నల్ల బ్యాడ్జీలు ధరించి నిరసన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భం గా నాయకులు మాట్లాడు తూ గోరక్షణ కోసం దేనికైనా సిద్ధమన్నారు. గో సంరక్షణ కోసం ప్రాణ త్యాగానికి కూడా వెనకాడబోమని స్పష్టం చేశా రు. హిందూ సమాజ భావో ద్వేగాలను రెచ్చగొట్టేలా ప్రవ ర్తిస్తే సహించేది లేదని హెచ్చ రించారు. అలాంటి వారిపై చట్టపరమైన చర్యలు తీసు కోవాలని పోలీస్ శాఖకు విజ్ఞప్తి చేశారు. అంతకు ముందుగా వీర సావర్కర్ జయంతి వేడుకలను జరిపారు. కార్యక్రమంలో విశ్వ హిందూ పరిషత్ జిల్లా కార్యదర్శి కన్న శివ కుమార్, వీఎచ్ పీ పట్ట ణ అధ్యక్షులు మురళి భట్టాడ్, కడుదాస్ ప్రవీణ్, వడ్ల శ్రవణ్, రఘువీర్ యాద వ్, సందీప్, చెన్నారెడ్డి, ఆకా ష్, రవి కుమార్ గౌడ్, సతీష్, డా . బాలాజీ, కర్లీ రాజ శేఖ ర్, అనిల్ రెడ్డి, కోట్ల చరణ్ రెడ్డి , బాలకృష్ణ, రవి, నర సింహ, కిరణ్, నరేష్, పోలే మోని అంజి, వెంకటేష్, తరుణ్, రేణుక, అక్షర తదిత రులు పాల్గొన్నారు.

# జడ్చర్లలో తాగునీటి కష్టాలు



**జడ్చర్ల, మే 28 (జనంసాక్షి) :** జడ్చర్ల మున్సిపాలిటీ పరిధిలో నీటి సమస్యలు నానాటికీ ముదురుతున్నాయి. గత పది రోజులుగా పట్టణంలోని పలు వార్డుల్లో తాగునీటి సరఫరా పూర్తిగా నిలిచిపోవడంతో స్థానిక ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. పది రోజుల నుంచి నల్లాలు రాకపోవడంతో దైనందిన అవసరాల కోసం మహిళలు, వృద్ధులు కిలోమీటర్ల మేర నడిచి నీటిని తెచ్చుకోవాల్సిన పరిస్థితి ఏర్పడింది. మధ్యతరగతి, పేద కుటుంబాలు ప్రైవేటు ట్యాంకర్లను ఆశ్రయించలేక, దొరికిన కాడికి నీటిని కొనుగోలు చేస్తూ తీవ్ర ఆర్థిక భారానికి గురవుతున్నారు. పది రోజులైనా ఒక్క చుక్క నీరు వదలకపోతే ఎలా బతకాలని, అధికారులకు ఎన్నిసార్లు చెప్పినా ఫలితం లేదని స్థానిక మహిళలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. కనీసం ప్రత్యామ్నాయంగా ట్యాంకర్ల ద్వారా కూడా నీటిని సరఫరా చేయడం లేదని పట్టణ ప్రజలు ఆరోపిస్తున్నారు. నీటి ఎద్దడి ఉన్న ప్రాంతాలకు మున్సిపల్ ట్యాంకర్ల ద్వారా అత్యవసరంగా నీటిని అందించాలని స్థానికులు డిమాండ్ చేస్తున్నారు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు, మున్సిపల్ కమిషనర్ తక్షణమే స్పందించి జడ్చర్ల పట్టణంలో నెలకొన్న తాగునీటి ఎద్దడిని పరిష్కరించాలని డిమాండ్ చేస్తున్నారు.

# రైతుల్లో ఆందోళన అవసరం లేదు

- జిల్లా కలెక్టర్ ఆదర్శ్ సురభి




**వనపర్తి బ్యూరో, మే 28 (జనంసాక్షి) :** వరి ధాన్యం కొనుగోళ్ల విషయంలో రైతులెవరూ ఆందోళన చెందాల్సిన పనిలేదని, ప్రభుత్వం ప్రతి ఒక్క గింజను కొనుగోలు చేసి, వచ్చే 15 రోజుల్లో కొనుగోళ్ల ప్రక్రియను పూర్తి చేస్తుందని జిల్లా కలెక్టర్ ఆదర్శ్ సురభి తెలిపారు. గురువారం జిల్లా కలెక్టర్ వనపర్తి మండలం చిట్యాల శివారులోని వ్యవసాయ మార్కెట్ యార్డులో వరి ధాన్యం నిల్వ కోసం అదనంగా ఏర్పాటు చేసిన గోదామును అదనపు కలెక్టర్ రెవెన్యూ వినోద్ కుమార్ తో కలిసి సందర్శించి అక్కడ జరుగుతున్న అన్లోడ్ ప్రక్రియను పరిశీలించారు. ఈ సందర్భంగా అక్కడే ఉన్న రైతులతో మాట్లాడి వారి సమస్యలను తెలుసుకున్న కలెక్టర్ పరిష్కారానికి హామీ ఇచ్చారు. ఈ సందర్భంగా మాట్లాడిన కలెక్టర్ రైతులు ఎవరు ఆందోళన చెందాల్సిన పనిలేదని, ప్రభుత్వం ప్రతి ఒక్క గింజను కొనుగోలు చేస్తుందని కలెక్టర్ తెలిపారు. వచ్చే 15 రోజుల్లో వరి ధాన్యం కొనుగోళ్ల ప్రక్రియ పూర్తిస్థాయిలో కంప్లీట్ చేస్తామని హామీ ఇచ్చారు. అనంతరం కలెక్టర్ చిమనగుంటపల్లి శివారులో ఉన్న లక్ష్మీ వెంకటేశ్వర గోదామును సందర్శించి అక్కడ కూడా అన్లోడింగ్ ప్రక్రియను పరిశీలించారు. వనపర్తి మార్కెట్ యార్డ్ చైర్మన్ శ్రీనివాస్ గౌడ్, డిసిఎస్ఓ కాశీ విశ్వనాథ్, డిఆర్ డిఓ ఉమాదేవి, కార్మిక శాఖ అధికారి రవి, మార్కెటింగ్ శాఖ అధికారి స్వరణ్ సింగ్, డి సి ఓ రాణి, డిస్ట్రిక్ట్ మేనేజర్ సివిల్ సప్లై ఆంజనేయులు, ఇతర అధికారులు కలెక్టర్ వెంట ఉన్నారు.

# రైతు సంక్షేమానికి ప్రభుత్వం కృషి



**నంగునూర్, మే 28 (జనం సాక్షి) :** వడ్ల కొనుగోళ్ల విషయం లో రైతుల మేలుకోసమే ప్రభుత్వంఆరాటపడుతుందని నంగునూర్ వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ దేవులపల్లి యాదగిరి తెలియజేశారు. గురువారం సిద్దన్నపేట మార్కెట్ యార్డులో గల ధాన్యగారంలో వడ్లు నిల్వ చేస్తున్న సందర్భంగాకొబ్బరి కాయలు కొట్టి ప్రారంభించారు. మండలం లో రైస్ మిల్లులలో వడ్లు నిండిపోయినందున ఉమ్మడి మెదక్ జిల్లా ఇంచార్జి మంత్రి వివేక్ వెంటస్వామి గారి ఆదేశాలతో సిద్దన్నపేట మార్కెట్ యార్డ్ లో పాక్స్ ద్వారా కొనుగోలు చేస్తున్న ధాన్యాన్ని ప్రభుత్వమే నేరుగా సిద్దన్నపేటలో గల ధాన్యాగరం లో నిల్వస్తుందని పేర్కొన్నారు. మండలంలో ఈసారి అధికంగా ధాన్యం పండినందున అదనంగా గోదాముల నిల్వ చెస్తున్నట్టు పేర్కొన్నారు. కొనుగోలు సమస్యలు అధిగమించేందుకు ప్రభుత్వం చర్యలు వేగవంతం చేసిందన్నారు. ఇంకా అవసమానుకుంటే నంగునూర్, పాలమాకుల, గట్లమల్యాల గ్రామాలలో గల గిడ్డంగులను కూడా వినియోగిస్తామని తెలియజేశారు. ఈసారి మండలం వడ్ల పంట దిగుబడి గణనీయంగాపెరిగిందన్నారు. పంట దిగుబడిని దృష్టిలో పెట్టుకొని ప్రభుత్వం అదనపు గిడ్డంగుల సామర్థ్యాన్ని ప్రభుత్వం అందుబాటులోకి తెచ్చిందన్నారు. ఈ కార్యక్రమం లో మహిళా కాంగ్రెస్ మండల అధ్యక్షురాలు,ఆడెపు లావణ్య, యువజన కాంగ్రెస్ నాయకులు రాజశేఖరరెడ్డి, సిబ్బంది రాజి రెడ్డి, బాలయ్య, మార్కెట్ కమిటీ సిబ్బంది రాజిరెడ్డి, రైతులు, హమాలీలు పాల్గొన్నారు.

# విద్యారంగానికి ప్రజా ప్రభుత్వంలో పెద్దపీట

- రాష్ట్ర మంత్రి జూపల్లి కృష్ణారావు

**వీపనగండ్ల, మే 29 (జనం సాక్షి) :** కొల్లాపూర్ నియోజకవర్గ కేంద్రంలో హార్టికల్చర్, పాలిటెక్నిక్ కళాశాల భవన నిర్మాణ పనులు త్వరలోనే ప్రారంభం కానున్నాయని పర్యాటక, సాంస్కృతిక,ఎక్సైజ్ శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు తెలిపారు. పట్టణ శివారులోని వరదెల పరిధిలో ఉన్న ప్రభుత్వ భూములను మంత్రి క్షేత్రస్థాయిలో పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ విద్యారంగానికి ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆధ్వర్యంలోని కాంగ్రెస్ ప్రభుత్వం పెద్దపీట వేస్తున్నది అని అన్నారు. సర్వే నంబర్ 56లో సుమారు104.19 ఎకరాల ప్రభుత్వ భూమిని సందర్శించి,హార్టికల్చర్ పాలిటెక్నిక్ కళాశాల నిర్మాణానికి ఆ స్థలం అనుకూలత,మౌలిక వసతుల కల్పన,రవాణా సౌకర్యాలు తదితర అంశాలపై అధికారులతో సమీక్ష నిర్వహించారు. కళాశాల ఏర్పాటుకు అవసరమైన ప్రతిపాదనలను త్వరితగతిన సిద్ధం చేయాలని అధికారులను మంత్రి ఆదేశించారు. విద్యార్థులకు నాణ్యమైన విద్యా అవకాశాలు కల్పించేందుకు కాంగ్రెస్ ప్రభుత్వం కట్టుబడి ఉందని తెలిపారు. నిరుపేదలకు ఇళ్ల స్థలాల పంపిణీ అంశంపైనా మంత్రి ప్రత్యేక దృష్టి సారించారు. హార్టికల్చర్ పాలిటెక్నిక్ కళాశాలకు అవసరమైన భూమిని కేటాయించిన అనంతరం మిగిలిన విస్తీర్ణంలో అర్హులైన పేద కుటుంబాలకు ఇళ్ల స్థలాలు పంపిణీ చేసే అవకాశాలపై అధికారులతో చర్చించారు. ప్రభుత్వ భూమిని సద్వినియోగం చేస్తూ విద్యార్థులకు విద్యావకాశాలు, పేదలకు నివాస స్థలాలు కల్పించేలా సమగ్ర ప్రణాళిక రూపొందించాలని



మంత్రి అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్,రెడ్డి సత్యం,కమలాకర్ రావు,సంబంధిత శాఖల అధికారులు,స్థానిక ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

# ముస్లిం మైనార్టీలకు అండగా ప్రభుత్వం

- మంత్రి కొండా సురేఖ, మాజీ ఎమ్మెల్సీ కొండా మురళీధర్ రావు
- ఖిలా వరంగల్ ఈద్గా వద్ద భక్తిశ్రద్ధలతో బక్రీద్ వేడుకలు



**వరంగల్ బ్యూరో, మే 28 (జనం సాక్షి) :** ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలోని కాంగ్రెస్ ప్రభుత్వం ముస్లిం మైనారిటీలకు అండగా ఉంటుందని పర్యావరణ అటవీ దేవాదాయ శాఖ మంత్రి కొండా సురేఖ అన్నారు. వరంగల్ టు నియోజకవర్గంలోని ఖిలా వరంగల్ ఈద్గా వద్ద బక్రీద్ పండుగ సందర్భంగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా మంత్రి సురేఖ మాట్లాడుతూ ముస్లిం మైనార్టీల అభివృద్ధి సంక్షేమం కోసం ప్రభుత్వం నిరంతరం పాటుపడుతుందన్నారు. అంతకుముందు బక్రీద్ అంటే ఏమిటి ఆ పండుగా ఎలా వచ్చింది అనే విషయం గురించి పూర్తిగా వివరించారు. ముస్లిం లందరికీ బక్రీద్ పండుగ శుభాకాంక్షలు తెలియజేశారు. మాజీ ఎమ్మెల్సీ కొండా మురళీధర్ రావు మాట్లాడుతూ పేద ముస్లిం లందరికీ డబల్ బెడ్ రూమ్ ఇండ్లు లేదా ఇండ్ల సలాలు ఇచ్చే విధంగా పాటుపడుతున్నట్లు చెప్పారు. వరంగల్ తూర్పు నియోజకవర్గం క్యాంప్ కార్యాలయంలో పేద ముస్లింలంతా వచ్చి అక్కడ దరఖాస్తులు ఇవ్వాలని కోరారు. ఈ సందర్భంగా ముస్లింల అందరికీ బక్రీద్ పండుగ శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో నాయకులు గోపాల నవీన్ రాజు , తవక్కల్ వెల్ఫే ట్రస్ట్ చైర్మన్ ఎంఏ జబ్బార్ , జి డబ్ల్యు ఎం సి మాజీ కో ఆప్షన్ సభ్యులు ఎండి చాంద్ పాషా, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షులు అక్తర్ బెగ్, హసన్ బేగ్, ఇంతియాజ్ ఖాన్, సాదిక్, తన్వీర్, వహీద్, సలీం, అంకుష్ ,సర్వర్, మొయినుద్దీన్, రహమత్, యాకూబ్ తదితరులు పాల్గొన్నారు.

# మైనార్టీ సంక్షేమానికి కృషి చేస్తా

- మంత్రి వివేక్



**చెన్నూర్, మే 28 (జనం సాక్షి) :** చెన్నూర్ నియోజకవర్గ మైనార్టీ సంక్షేమానికి తనవంతు కృషి ఉంటుందని మంత్రి వివేక్ వెంకటస్వామి అన్నారు. బక్రీద్ వేడుకలను చెన్నూరు నియోజకవర్గ కేంద్రంలో ముస్లీం సోదరులు ఘనంగా నిర్వహించారు. ఈ వేడుకలకు రాష్ట్ర మంత్రి వివేక్ వెంకటస్వామి స్థానిక ఈద్గా వద్ద ముస్లీం సోదరులతో కలిసి ప్రత్యేక ప్రార్థనలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ నియోజకవర్గంలోని ముస్లిం మైనార్టీల అభివృద్ధి కొరకు మా కుటుంబం ముస్లిం సాంప్రదాయాలను గౌరవిస్తుందన్నారు. 'మా నాన్న నేను ఇప్పటికీ షేర్వాణి ధరిస్తాను. ముస్లింల అభివృద్ధికి కాంగ్రెస్ పార్టీ కట్టుబడి ఉంది. పట్టణంలోని మైనారిటీ ఫంక్షన్ హాల్ లో 50 లక్షల నిధులతో అభివృద్ధి పనులు జరుగుతున్నాయి. ఇక్కడ ప్రజలు నన్ను ఖబ్రిస్తాన్ కోసం భూమి అడిగారు ఇప్పటికే ఆ భూమి ఫైల్ కలెక్టర్ దగ్గర ఉంది. త్వరలోనే ఖబ్రిస్తాన్ కోసం భూమి పనులు పూర్తి చేసి ఇస్తాను ముస్లిం మహిళలకు 400 కుట్టు మిషన్ లు ఇవ్వడం జరిగింది. ఇక్కడ నుండి మైనారిటీ కళాశాల, పాఠశాల షిఫ్ట్ చేస్తున్నారని అన్నారు. దాన్ని ఇక్కడే నడిచే విధంగా చర్యలు తీసుకుంటాను. చెన్నూరు మండలంలోని సోమనపల్లి గ్రామంలో 250 కోట్లతో యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ స్కూల్ ప్రారంభం చేసుకుందాము ఇక్కడ అడ్వాన్స్ ట్రైనింగ్ సెంటర్ కూడా శంకుస్థాపన చేసుకున్నాం. ఇందులో నిరుద్యోగులకు మంచి శిక్షణ ఇచ్చి యువకులకు ఉద్యోగ అవకాశాలు కల్పిస్తాం' అని తెలిపారు. ఈ కార్యక్రమంలో తన హయాంలో పూర్తి చేయనున్నట్లు వెల్లడించారు ప్రజలు పండుగ వేడుకలను కలిసి వెలిసి కులమతాలకు అతీతంగా జరుపుకోవాలని సందేశాన్ని ఇచ్చారు అనంతరం ముస్లిం పెద్దల ఆలింగనం చేసుకొని పండుగ శుభాకాంక్షలు తెలిపారు.

## ధాన్యం నిల్వలు వెంటనే గోదాములకు తరలించాలి

- కలెక్టర్ భవేశ్ మిశ్రా



**కుంటాల, మే28 (జనంసాక్షి) :** నిర్మల్ జిల్లా కుంటాల మండలం కల్లూరు గ్రామంలోని ధాన్యం కొనుగోలు కేంద్రం, అర్లీ కె శ్రీ ఆంజనేయ స్వామి రైస్ మిల్‌ను జిల్లా కలెక్టర్ భవేశ్ మిశ్రా గురువారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ధాన్యం కొనుగోలు ప్రక్రియను గడువులోగా పూర్తి చేసి, నిల్వలను వెంటనే గోదాములకు తరలించాలని అధికారులను ఆదేశించారు. కొనుగోలు చేసిన ధాన్యాన్ని గోదాములు, రైస్ మిల్లులకు తరలించేందుకు తగినన్ని లారీలు అందుబాటులో ఉంచాలని, అవసరమైతే ట్రాక్టర్లను వినియోగించాలని సూచించారు. రైస్ మిల్లుల్లో అన్‌లోడింగ్ ప్రక్రియను వేగవంతం చేసి వాహనాలు నిలిచిపోకుండా చూడాలని మిల్లుల నిర్వాహకులకు తెలిపారు. రైతులతో మాట్లాడిన కలెక్టర్, వరి, మొక్కజొన్న, జొన్న పంటలను చివరి గింజ వరకు కొనుగోలు చేస్తామని భరోసా ఇచ్చారు. అనంతరం కల్లూరు గ్రామపంచాయతీ కార్యాలయంలో అధికారులతో సమీక్ష నిర్వహించి, రైతులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా కొనుగోళ్లు పూర్తి చేయాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ కిషోర్ కుమార్,పౌర సంబంధాల అధికారి, తైసిల్దార్, వ్యవసాయ శాఖ అధికారులు పాల్గొన్నారు.

## లోడింగ్ కార్మికులను శాశ్వత ఉద్యోగులుగా గుర్తించాలి



**కాసిపేట మే 28 (జనం సాక్షి) :** లోడింగ్ కార్మికులను శాశ్వత ఉద్యోగులుగా గుర్తించాలని గురువారం రాష్ట్ర కార్మిక శాఖ కార్యదర్శి హరి చందనకు వినతిపత్రం అందజేశారు. తమ సంఘం కార్మికుల సమస్యల పరిష్కారానికి నిత్యం పోరాటం చేస్తుందని ఓరియంట్ (అదాని) సిమెంట్ కంపెనీ దేవాపూర్, స్టాఫ్ అండ్ వర్కర్ ఫెడరేషన్ గుర్తింపు సంఘం అధ్యక్షుడు కొక్కిరాల సత్యపాల్ రావు పేర్కొన్నారు. ఎన్నో ఏళ్లుగా లోడింగ్ కార్మికులు సేవలు అందిస్తున్న ఏనాడు వీరి సమస్యలపై ఏ సంఘం పట్టించుకోలేదని అన్నారు. కార్మిక చట్టాల ప్రకారం వీరిని శాశ్వత కార్మికులుగా గుర్తించాలని కోరారు. గుర్తింపు సంఘం నాయకులు, లోడింగ్ కార్మికులతో కలిసి తెలంగాణ కార్మిక, ఉపాధి శిక్షణ శాఖ కార్యదర్శికి హరిచందన దాసరి గారికి వినతి పత్రాన్ని అందించారు. వీటితో పాటుగా కార్మికుల సంక్షేమ మండలి సీఈఓ డాక్టర్ గంగాధర్, కమిషనర్ ఆఫ్ లేబర్ పమీల సత్పతి జాయింట్ కమిషనర్ ఆఫ్ లేబర్ వరంగల్‌కు అదేవిధంగా ఛీఫ్ కమీషనర్ ఆఫ్ లేబర్ (సెంట్రల్) హైదరాబాద్‌కు విన్నవించుకు న్నారు. సానుకూలంగా స్పందించిన అధికారులు కార్మిక చట్టాలను అనుసరించి వీరికి న్యాయం చేస్తామని హామీ ఇచ్చారని తెలిపారు. ఈ కార్యక్రమంలో యూనియన్ ప్రధాన కార్యదర్శి భీమిని మహేందర్, వర్కింగ్ ప్రెసిడెంట్ లు మెరుగు శంకర్, సతీష్ రెడ్డి, సత్యనారాయణ, లోడింగ్ పెద్దమనుషుల, పార్వతి పెద్దిరాజు, అరుణ్, రమేష్, మల్లేష్, శ్రీనివాస్, రవీందర్,తదితర నాయకులు పాల్గొన్నారు.

# పేదింటి ఆడబిడ్డల పెళ్లిళ్లకు అండగా ప్రజా ప్రభుత్వం

- మంత్రి సీతక్క
- 29 మందికి కల్యాణ లక్ష్మి, షాదీ ముబారక్ చెక్కుల పంపిణీ..



**మంగపేట, మే 28(జనంసాక్షి) :** పేదింటి ఆడబిడ్డల పెళ్లిళ్లకు ప్రజా ప్రభుత్వం అండగా నిలుస్తోందని రాష్ట్ర పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి, మహిళా మరియు శిశు సంక్షేమ శాఖ మంత్రి దనసరి అనసూయ (సీతక్క) తెలిపారు. గురువారం మంగపేట మండల కేంద్రంలోని రైతు వేదికలో నిర్వహించిన కల్యాణ లక్ష్మి, షాదీ ముబారక్ చెక్కుల పంపిణీ కార్యక్రమానికి ఆమె ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా మండల పరిధిలోని వివిధ గ్రామాలకు చెందిన 29 మంది లబ్ధిదారులకు మంత్రి సీతక్క చెక్కులను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా మంత్రి సీతక్క మాట్లాడుతూ.. పేద, మధ్యతరగతి కుటుంబాల ఆడపిల్లల వివాహాలకు ఆర్థిక భరోసా కల్పించే ఉద్దేశంతో ప్రభుత్వం కల్యాణ లక్ష్మి, షాదీ ముబారక్ పథకాలను సమర్థవంతంగా అమలు చేస్తోందని పేర్కొన్నారు. వివాహ సమయంలో కుటుంబాలపై పడే ఆర్థిక భారాన్ని తగ్గించేందుకు ప్రభుత్వం కట్టుబడి ఉందన్నారు.? సమాజంలో బాల్య వివాహాలను పూర్తిగా నిరోధించాలి. చట్టబద్ధమైన వయస్సు వచ్చిన తర్వాతే వివాహాలు జరిపించాలి. ప్రతి ఒక్కరూ బాల్య వివాహాల నిర్మూలనకు సహకరిస్తూ, బాలికల విద్యాభివృద్ధికి ప్రాధాన్యత ఇవ్వాలి అని అన్నారు. రాష్ట్రంలో మహిళలకు వడ్డీ లేని రుణాలు, అర్హులైన లబ్ధిదారులందరికీ జూన్ లో రెండో విడతలో ఇందిరమ్మ ఇండ్లను మంజూరు చేస్తామని మంత్రి ప్రకటించారు. ప్రజలకు పారదర్శకంగా సేవలు అందించడమే ప్రభుత్వ ధ్యేయమన్నారు. అలాగే, రాష్ట్రంలో కోటి మంది మహిళలను కోటీశ్వరులుగా తీర్చిదిద్దాలనే దృఢ సంకల్పంతో ప్రభుత్వం ఉందన్నారు. ఇందులో భాగంగానే 'ఇందిరా మహిళా శక్తి ' పథకం ద్వారా మహిళా సంఘాలకు అందిస్తున్న వడ్డీ లేని రుణాలను సంఘ సభ్యులు సద్వినియోగం చేసుకుని, ఆర్థికంగా ఉన్నత శిఖరాలను అధిరోహించాలని మంత్రి పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ భానోత్ రవిచందర్, వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్‌పర్సన్ రేగా కళ్యాణి, స్థానిక తహసీల్దార్ తోట రవీందర్, స్థానిక ప్రజాప్రతినిధులు, వివిధ శాఖల అధికారులు, లబ్ధిదారులు పాల్గొన్నారు.

# నాలుగేళ్ల నిరీక్షణ అనంతరం భూ సమస్య పరిష్కారం

- కోర్టు ఆర్డర్ బాధిత రైతు మల్లయ్యకు ఊరట



**బచ్చన్నపేట, మే 28( జనంసాక్షి) :** రియల్ వ్యాపారి భూ ఆక్రమణతో నాలుగేళ్ల నిరీక్షణ పోరాటం కు ముగింపు పడి తగిన గౌరవం దక్కిందని బచ్చన్నపేట మండలంలోని పోచన్నపేట గ్రామానికి చెందిన దళితుడు శ్రీపతి మల్లయ్య తండ్రి నర్సయ్య అన్నారు. గురువారం ఆయన మీడియాతో మాట్లాడుతూ తాతల నుండి చిరాస్తిగా సేద్యం చేస్తున్న భూమిని, ఓ రియల్ వ్యాపారి పక్కనే కొందరి భూమిని కొనుగోలు చేసి , రోడ్డు బిట్టుకు అడ్డంగా ఉన్నానని, ఇట్టి భూమి నీది కాదని బెదిరిస్తూ గత నాలుగు ఏళ్లుగా రెవిన్యూ పోలీస్ ల అండతో బెదిరింపులకు పాల్పడుతూ నానా ఇబ్బందులకు గురిచేసినదని మల్లయ్య ఆవేదన వ్యక్తం చేశారు. ప్రస్తుత జనగామ కలెక్టర్ సందీప్ కుమార్ ఝా కు ప్రజావాణి దరఖాస్తు చేసుకొని తమ గోడును వెళ్ళబోసుకున్నట్లు వెల్లడించారు. దీంతో కోర్టు ఆర్డర్ ప్రకారం కలెక్టర్ స్పందించి నట్లు, గ్రామస్థాయి నుండి జిల్లా స్థాయి వరకు ఉన్నత అధికారుల దృష్టికి తీసుకుపోవడం పట్ల తమకు కలెక్టర్ చోరవతో శాశ్వత పరిష్కారం దక్కిందన్నారు. శ్రీపతి మల్లయ్య వ్యవసాయం వంశపారపర్యంగా మా పూర్వీకుల నుండి సంక్రమించినటువంటి ఆస్తి సర్వే నంబర్లు 422 ,423 ముంజుములే లలో ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ మరియు తెలంగాణ పట్టాదారు పాస్ పుస్తకాలు కలిగి ఉండి వారి తాతల కాలం నుండి అనగా గత 70 సంవత్సరాలుగా కాస్తు మరియు కబ్జా కలిగి ఉండి వరి పంటలు పండిస్తూ వారి యొక్క కుటుంబాన్ని పోషిస్తూ జీవిస్తున్నానదని,ఆ భూమి పోచన్నపేట నుండి పెద్ద రామన్ చర్ల కి వెళ్లే ఆర్ అండ్ బి రోడ్డు ప్రక్కకు ఆనుకొని ఉందని, దీని కారణంగా సర్వే నెంబర్ 406 లో నూతనంగా వెలసినటువంటి శ్రీ సిద్ధి వినాయక డెవలపర్స్ వెంచర్ లో మల్లయ్య భూమిని అందులో కలపాలని చాలా రకాలుగా మానసిక తీవ్ర సంక్షోభానికి ఇబ్బందులకు గురిచేస్తూ సర్వహక్కులు ఆ భూమిపై కలిగి ఉన్నప్పటికీ జీవించే హక్కును హరిస్తున్నారని బాధిత రైతు వాపోయారు. పైగా ఇతడి పైనే అక్రమ కేసులు బనాయిస్తున్నారని, పూర్తి వివరాలు తెలుసుకొని భూమిపై ఎవరు ఇబ్బందులకు గురి చేయొద్దని, ఆక్రమణలకు పాల్పడవద్దని, ఏదైనా కోర్టులోనే తేల్చుకోవాలని ఏళ్ల తరబడి వ్యవసాయం చేస్తున్న రైతును ఇబ్బందులకు గురి చేయొద్దని సంబంధిత శాఖల అధికారులకు జిల్లా కలెక్టర్ నోటీసుల ఉత్తర్వులు జారీ చేశారు. మా యొక్క పాస్ పుస్తకాలను మరియు సంబంధిత డాక్యుమెంట్లను సమర్పించినందున పరిశీలన చేసి మా పాస్ బుక్కులను యధావిధిగా ఉంచుతూ ప్రతి వాదుల యొక్క పాస్ బుక్కులను సరైన ఆధారాలు లేకపోవడంతో పూర్తిగా రద్దు పరచారన్నారు. మా వైపు తగిన న్యాయం జరిగినందుకు జనగామ జిల్లా కలెక్టర్ కి ప్రత్యేక ధన్యవాదాలు తెలుపుతున్నానని, బాధిత రైతు శ్రీపతి మల్లయ్య తండ్రి నర్సయ్య వెల్లడించారు.

# వడదెబ్బతో పది రోజుల్లో ముగ్గురు మృతి



**మల్హర్, మే 28(జనంసాక్షి) :** మండల కేంద్ర మైన తాడిచర్ల గ్రామ పరదిలోని కాపురం పల్లికి చెందిన జంగ బిమయ్య (55)అనే గిరిజన కూలి మృతి చెందిన సంఘటన గురువారం చోటు చేసుకున్నాది. కుటుంబ సభ్యుల కథనం మేరకు బుధవారం రోజున వడదెబ్బకు గుర్రై వాంతులు, విరోచనాలు తో అస్వస్థకు లోనై గురువారం మృతి చెందాడు అని వారి కుటుంబ సభ్యులు తెలిపారు. మండలం లో వడ దెబ్బ తో ఇద్దరు మృతి చెందిన సంగతి విదితమే. వడ దెబ్బ తో ఆగాని మరణాలు అని ప్రజలు భయందోళనకు గురవచున్నారు. వడ దెబ్బ గుర్రైన వ్యక్తులకు ఎలాంటి రక్షణ చర్యలు చేపట్టాలె అనే విషయాలు, జాగ్రత్త లు తెలియ పరచటానికి మెడికల్ క్యాంపు లు ఏర్పాటు చేసి ప్రజలకు రక్షణ సూత్రాలు తెలియపరచాలని ప్రజలు కోరుచున్నారు. వడదెబ్బతో మరణించిన వారికి ప్రభుత్వ పరంగా ఆర్థిక సహాయం అందించాలని కోరుచున్నారు.

### వడదెబ్బతో వృద్ధురాలు మృతి



**చెన్నారావుపేట, మే 28 (జనం సాక్షి) :** వడ దెబ్బతో వృద్దురాలు మృతి చెందిన సంఘటన మండలంలోని ఎల్లాయగూడెం గ్రామ శివారు నెంబర్ 2 కాలనీ మాధవనగర్ లో గురువారం వెలుగులోకి వచ్చింది. ఇదే కాలనికి చెందిన యువజన కాంగ్రెస్ జిల్లా ఉపాధ్యక్షులు రూపిక శ్రావణ్ కుమార్ నానమ్మ రూపిక సారమ్మ(73) అనే వృద్ధురాలు బుధవారం వ్యవసాయ భూమి వద్దకు పొయ్యిల కట్టెలు తీసుకురావడానికి వెళ్ళింది. ఎండలో వడదెబ్బకు గురై పరిస్థితి విషమించి మృతి చెందింది. విషయాన్ని తెలుసుకున్న గ్రామ సర్పంచ్ జినుకల కనకమల్లు ఆమె స్వగృహానికి చేరుకొని ఆమె మృత దేహం పై పూలమాల వేసి నివాళులు అర్పిం చారు. అనంతరం మృతురాలి కుటుంబ సభ్యులను పరామర్శించి ప్రగాఢ సానుభూతిని వ్యక్తం చేశారు. ఆయన వెంట గ్రామ కాంగ్రెస్ అధ్యక్షులు భాషబోయిన రమేష్, ఉప సర్పంచ్ పానుగంటి కొమురయ్య, భాషబోయిన వెంకన్న, మంచోజు వెంకన్న, అలువాల లక్మి నర్సు, కర్రె రాజకుమార్, జంగిలి జనార్దన్, భాషబోయిన జనార్దన్ పాల్గొన్నారు.

# మహిళ దొంగల అరెస్ట్

- పట్టణ ఇన్స్పెక్టర్ రఘుపతి రెడ్డి




**మహబూబాబాద్ బ్యూరో,మే 28(జనం సాక్షి):** బ్యాంకు నుండి నగదు డ్రా చేసుకుని వెళ్తున్న మహిళలను మరియు బస్సు ఎక్కుతున్న మహిళల దృష్టి మళ్లించి డబ్బు అపహరించిన దొంగలను మహబూబాబాద్ టౌన్ పోలీసులు అరెస్ట్ చేశారు. ఈ సందర్భంగా మహబూబాబాద్ టౌన్ ఇన్స్పెక్టర్ రఘుపతి రెడ్డి తెలిపిన వివరాల ప్రకారం స్థానిక గిరిప్రసాద్ కాలనీకి చెందిన బాధితురాలు ఈ నెల 25వ తేదీన నెహ్రూ సెంటర్లోని టి జి వి బి బ్యాంకు నుండి 46 వేల రూపాయల నగదు డ్రా చేసుకుని, ఆ తర్వాత ఇండియన్ బ్యాంకులో గల తన ఖాతాను చెక్ చేసుకోవడానికి లైన్ లో నిలబడి ఉండగా నలుగురు మహిళలు బాధితురాలి చుట్టూ తిరుగుతూ తన దృష్టి మళ్లించి ఆమె వద్ద ఉన్న డబ్బును అపహరించి పరార య్యారనీ, ఈ నెల 23న స్థానిక బస్టాండ్ లో ఇల్లందు వెళ్తున్న బస్సు ఎక్కుతున్న మరో మహిళా బాధితురాలి పర్సులో ఉన్న ఐదువేల రూపాయలను కూడా దొంగిలించినారన్నారు. బాధితుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టిన టౌన్ పోలీసులు, సీసీటీవీ ఫుటేజ్ మరియు సాంకేతిక ఆధారాల సహాయంతో ఆంధ్రప్రదేశ్‌లోని తాడేపల్లి గూడెం జాగర్లపల్లి గ్రామానికి చెందిన పట్నాల పోలమ్మ, భర్త ప్రసాద్, యారసాని స్నేహ భర్త దుర్గ ప్రసాద్, మన్నవ సుబ్బలక్ష్మి, భర్త రాము లను నిందితులుగా గుర్తించి అరెస్ట్ చేశారనీ మరియు మరొక నిందుతురాలైన వరలక్ష్మి పరారీలో ఉన్నట్లు తెలిపారు. నిందితుల వద్ద నుండి అపహరిం చిన నగదు స్వాధీనం చేసుకున్నామన్నారు. ప్రజలు అప్రమత్తంగా ఉండాలని, వ్యాపార సంస్థలు, నివాసాల ముందు సిసి కెమరాలను ఏర్పాటు చేసుకోవాలన్నారు. అనుమానిత వ్యక్తులు కనిపిస్తే పోలీస్ వారికి డైల్ 100 ద్వారా తెలపాలన్నారు. ఈ కేసు దర్యాప్తులో పాల్గొన్న టౌన్ ఎస్సైలు ఉమ, వెంకటేశ్వర్లు, సిబ్బంది రుద్రయ్య, రమేష్ చంద్ర, నాగరాజ్ లు ఉన్నారు.

## డీజీపీ సీవీ ఆనంద్‌ను కలిసిన మానవ హక్కుల ఆర్గనైజేషన్ బాధ్యులు



**చెన్నారావుపేట, మే 28 (జనంసాక్షి) :** తెలంగాణ రాష్ట్ర డిజిపి సివి ఆనంద్ ను అంతర్జాతీయ మానవ హక్కుల ఆర్గనైజేషన్ వరంగల్ జిల్లా అధ్యక్షులు, వరంగల్ జిల్లా ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ విజిలెన్స్ అండ్ మానిటరింగ్ కమిటీ మెంబర్ పాలకుర్తి విజయ్ కుమార్, అంతర్జాతీయ మానవ హక్కుల ఆర్గనైజేషన్ వరంగల్ జిల్లా మహిళా అధ్యక్షురాలు గడ్డం సుభద్రలు మర్యాదపూర్వకంగా కలిశారు. గురువారం హైదరాబాద్ లోని డీజీపీ కార్యాలయంలో ఇటీవల డీజీపీగా నూతనంగా బాధ్యతలు చేపట్టిన సివి ఆనంద్ ను మర్యాదపూర్వకంగా కలుసుకొని పూల బొకే అందించి శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం శాలువాతో ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా వారు తెలంగాణ రాష్ట్రంలో మైనర్ బాలికలపై అత్యాచారాలను అరికట్టాలని నేరస్తులను కఠినంగా శిక్షించాలని మహిళలపై జరుగుతున్న దాడులు అత్యాచారాలను అరికట్టాలని ఫోక్సో చట్టాలను మహిళా చట్టాలను పకడ్బందీగా అమలుపరచాలని తెలంగాణ రాష్ట్రంలో మహిళలకు రక్షణ కల్పించాలని కొన్ని సమస్యలను వినతి పత్రం ద్వారా తెలిపినట్లు వారు పేర్కొన్నారు. వెంటనే డిజిపి సివి ఆనంద్ స్పందించి సమస్యల పైన సంబంధిత అధికారులకు ఆదేశాలు ఇచ్చినట్లు వారు తెలిపారు.

### పది రోజులుగా తాగునీటి సరఫరా బంద్

**చెన్నారావుపేట, మే 28( జనం సాక్షి) :** పది రోజులుగా మిషన్ భగీరథ తాగునీరు సరఫరా నిలిచిపోవడంతో కాల్ నాయక్ తండవాసులు అనేక ఇబ్బందులను ఎదుర్కొంటున్నారు. కాల్ నాయక్ తండ గ్రామంలో మంచినీటి ట్యాంకుకు మిషన్ భగీరథ త్రాగు నీటిని ఎక్కించి నల్లాల ద్వారా ప్రతిరోజు సరఫరా చేస్తుంటారు. కానీ గత పది రోజులుగా మంచినీటి ట్యాంకుకు మిషన్ భగీరథ తాగునీటి సరఫరా నిలిచిపోయింది. దీంతో గ్రామ సర్పంచ్ లావుడియా తిరుపతి నాయక్, పంచాయతీ కార్యదర్శి గౌడిశాల వికాస్ గౌడ్ లు గ్రామ పంచాయతీకి సంబంధించిన బావి ద్వారా ప్రత్యామ్నాయంగా నీటిని సరఫరా చేస్తున్నారు.



## రాష్ట్ర గవర్నర్ పర్యటన ఏర్పాట్ల పరిశీలన

**కొమరం భీమ్ ఆసిఫాబాద్ జిల్లా ప్రతినిధి, మే 28(జనంసాక్షి):** ఆసిఫాబాద్ మండలం రౌట సంకేపల్లి గ్రామంలో ఈనెల 29న నిర్వహించనున్న జల్ జంగల్ జమీన్ స్ఫూర్తి గ్రామోత్సవం 2026 కార్యక్రమానికి రాష్ట్ర గవర్నర్ హాజరుకానున్నారు. ఆదివాసుల సంప్రదాయాలు, సంస్కృతి, హక్కులు, అభివృద్ధికి అంకితమైన ఈ ప్రత్యేక కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించేందుకు ఏర్పాట్లు జరుగుతున్నాయి. ఈ సందర్భంగా గ్రామంలో జరుగుతున్న ఏర్పాట్లను డీసీసీ అధ్యక్షురాలు ఆత్రం సుగుణక్క, నియోజక వర్గం ఇంచార్జి శ్యాం నాయక్ పరిశీలించారు. ఆదివాసుల ఆత్మగౌరవం, జీవన విధానం, హక్కుల పరిరక్షణకు ప్రతీకగా ఈ గ్రామోత్సవాన్ని నిర్వహిస్తున్నట్లు వారు తెలిపారు. రాష్ట్ర గవర్నర్ పర్యటన నేపథ్యంలో గ్రామంలో ప్రత్యేక ఏర్పాట్లు చేపడుతున్నట్లు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో క్రికెటర్ నాగేంద్ర, డీసీసీ ఉపాధ్యక్షులు భీంరావు,దీపక్ ముండే, సర్పంచ్ ఆత్రం కొండు, యూత్ కాంగ్రెస్ మండల అధ్యక్షుడు వినోద్ తదితరులు పాల్గొన్నారు.

## యువతిపై యువకుడి అనుచిత ప్రవర్తన

**కాళేశ్వరం, మే 29 (జనంసాక్షి) :** కాళేశ్వరం లో నిర్వహిస్తున్న సరస్వతి అంత్య పుష్కరాలకు వచ్చిన యువతిపై యువకుడు అనుచితంగా ప్రవర్తించాడు. వివరాల్లోకి వెళితే కాళేశ్వరానికి పుష్కర స్నానానికి వచ్చిన ఓ యువతి దేవాలయ వసతి గదిలో విశ్రాంతి తీసుకుంటున్న సమయంలో అక్కడే ఉన్న క్యాటరింగ్ యువకుడు యువతిపై అసభ్యంగా ప్రవర్తించారు. యువతి కేకలు వేయడంతో సదరు యువకుడిని పట్టుకొని కుటుంబీకులు దేహశుద్ధి చేసి పోలీసులకు అప్పగించారు. అలాగే సరస్వతి పుష్కర ఘాట్ వద్ద కూడా పుష్కర స్నానం ఆచరిస్తున్న ఓ స్థానిక యువతిపై కొందరు అసభ్యంగా ప్రవర్తించారని వారిని పట్టుకునే లోపు పారిపోయారని ఆమె బంధువులు తెలిపారు. వరుస ఘటనల పట్ల కాళేశ్వరం వచ్చే మహిళా భక్తులు భయాందోళనలకు గురవుతున్నారు.

## ఇంచెంచెర్వుపల్లిలో భారీ అగ్నిప్రమాదం



**ములుగు/వెంకటాపూర్, మే28 (జనం సాక్షి) :** ములుగు జిల్లా వెంకటాపూర్ మండలం ఇంచెంచెర్వుపల్లి గ్రామంలో గురువారం రోజున గుర్తుతెలియని వ్యక్తులు అనాలోచిత చర్యల వల్ల భారీ అగ్నిప్రమాదం చోటుచేసుకుంది. గ్రామ పరిసరాల్లో చెలరేగిన మంటలు వేగంగా వ్యాపించి వందల ఎకరాల వ్యవసాయ భూములను అగ్నికి ఆహుతి చేశాయి. ఈ ప్రమాదంలో ఐదు ఎకరాల వరి పంట పూర్తిగా దగ్ధమవగా,మూడు బోర్ మోటార్లు, పైపులు,వందల సంఖ్యలో వరిగడ్డి కట్టలు మంటల్లో తగలబడ్డాయి. మంటలు గ్రామం వైపు విస్తరించడంతో గ్రామమంతా అగ్నికీలల్లో చిక్కుకునే పరిస్థితి ఏర్పడింది. వడ్లు,బోర్లు కాలిన రైతులకు అధికారులు తగు న్యాయం చేయాలని పలువురు రైతులు కోరారు.

## భద్రాద్రి రామయ్యను దర్శించుకున్న మంత్రి సీతక్క



**భద్రాచలం, మే 28 (జనంసాక్షి) :** భద్రాచలం శ్రీ సీతారామచంద్రస్వామి వారిని తెలంగాణ రాష్ట్ర పంచాయతీరాజ్ శాఖ మంత్రి సీతక్క దర్శించుకున్నారు. తొలుత ఆలయ ఈవో కే దామోదర్ రావు, అర్చకులు మంత్రికి ఆలయ మర్యాదలతో ఘనంగా స్వాగతం పలికారు. అనంతరం ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించారు. స్వామివారి దర్శనానంతరం ఆమె మీడియాతో మాట్లాడుతూ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి రాష్ట్రంలోని ప్రముఖ దేవాలయాల అభివృద్ధికి ప్రత్యేక ప్రాధాన్యత ఆస్తున్నారని తెలిపారు. సమ్మక్క సారక్క దేవాలయాన్ని అభివృద్ధి చేసినట్లుగానే, భద్రాచలం శ్రీ సీతారామచంద్రస్వామి దేవాలయాన్ని కూడా పనులకు సహకరించిన భద్రాచలం ఎమ్మెల్యే తెల్లం వెంకట్రావు ఆధ్వర్యంలో ఉప ముఖ్యమంత్రి భశిక్రమార్క, మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి, మంత్రి తుమ్మల నాగేశ్వరరావు ప్రత్యేక చొరవతొ నిధులు కేటాయించినందుకు ఆమె ధన్యవాదాలు తెలిపారు. భవిష్యత్తులో భద్రాచలం మరింత అభివృద్ధి చెంది. దేశవ్యాప్తంగా ఆకర్షణీయమైన ఆధ్యాత్మిక పర్యాటక 6 పర్యాటక కేంద్రంగా రూపు దిద్దుకుంటుందని మంత్రి సీతక్క ఆశాభావం వృత్తం వేశారు. ఈ కార్యక్రమంలో స్థానిక తహసిల్దార్ ధనియాల వెంకటేశ్వర రావు, సర్పంచ్ కృష్ణ సీఐ నాగరాజు, కాంగ్రెస్ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

## మధిర నియోజకవర్గాన్ని రాష్ట్రంలో మొదటి స్థానంలో నిలబెడతా..

- డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క

**ఎర్రుపాలెం, మే 28 (జనంసాక్షి) :** మధిర నియోజకవర్గాన్ని రాష్ట్ర స్థాయిలోనే మోడల్ నియోజకవర్గంగా తీర్చిదిద్దడమే లక్ష్యంగా పనిచేస్తున్నామని రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క తెలిపారు. గురువారం ఎర్రుపాలెం మండలంలో విస్తృతంగా పర్యటించిన ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క ఎన్‌పీడీసీఎల్ సీఎండీ వరుణ్ రెడ్డి, జిల్లా కలెక్టర్ దివాకర టిఎస్ లతో కలిసి రహదారులు, విద్యుత్ సబ్‌స్టేషన్లు, ఆలయ పునర్నిర్మాణ పనులకు వరుసగా శంకుస్థాపనలు చేశారు. ముందుగా ఎర్రుపాలెం మండలం గోసవీడు గ్రామంలో 2 కోట్ల 80 లక్షలతో గోసవీడు నుండి రామకృష్ణాపురం వరకునిర్మించనున్న బీటీ రోడ్డు నిర్మాణ పనులకు, 35 లక్షలతో గోసవీడు ఎస్సీ కాలనీలో నిర్మించనున్న అంతర్గత సిసి రోడ్ల నిర్మాణ పనులకు, 2 కోట్లతో రామన్నపాలెం నుండి కట్లేరు చెరువు వరకు నిర్మించనున్న బీటీ రోడ్డు నిర్మాణ పనులకు శంకుస్థాపన చేశారు. ఇనగాలి గ్రామంలో 6 కోట్ల 75 లక్షలతో ఇనగాలి నుండి సైదెల్లిపురం వరకు, 3 కోట్ల 75 లక్షలతో ఇనగాలి నుండి సిద్ధినేని గూడెం వరకు నిర్మించనున్న



బిటీ రోడ్డు నిర్మాణ పనులకు,31లక్షలతో ఇనగాలి ఎస్సీ కాలనీలో నిర్మించనున్న అంతర్గత సిసి రోడ్ల నిర్మాణ పనులకు శంకుస్థాపన చేశారు. ములుగుమాడు గ్రామంలో కోటి 29 లక్షలతో చేపట్టిన శ్రీ భక్తాంజనేయ స్వామి దేవాలయం పునర్నిర్మాణ పనులకు, ములుగుమాడు నుండి నాగవరప్పాడు వరకు 3 కోట్ల 75లక్షలతో,ములుగుమాడు నుండి సైదేల్లిపురం వరకు 3 కోట్ల 50 లక్షలతో చేపట్టిన బీటీ రోడ్డు నిర్మాణపనులకు,ములుగుమాడు ఎస్సీ కాలనీలో 63లక్షలతో చేపట్టిన అంతర్గత సిసి రోడ్ల నిర్మాణ పనులకు శంకుస్థాపన చేశారు. తక్కెలపాడు గ్రామంలో 4 కోట్ల 50 లక్షలతో తక్కెళ్ళపాడు నుండి మధిర ఆర్ అండ్ బి రోడ్డు వరకు నిర్మించనున్న బీటీ రోడ్డు నిర్మాణ పనులకు, 69 లక్షలతో తక్కెల పాడు ఎస్సీ కాలనీలో నిర్మించనున్న అంతర్గత సీసీ రోడ్డు నిర్మాణ పనులకు శంకుస్థాపన చేశారు. పెద్ద గోపవరం గ్రామంలో 132/33 కేవీ ఎర్రుపాలెం సబ్ స్టేషన్ నిర్మాణ పనులకు, జమలాపురం గ్రామంలో 33/11 కేవీ సబ్ స్టేషన్ నిర్మాణ పనులకు డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క శంకుస్థాపనలు చేసారు. కార్యక్రమంలో సుడా చైర్మన్ పువ్వాళ్ల దుర్గాప్రసాద్, రాష్ట్ర గిడ్డంగుల సంస్థ చైర్మన్ రాయల నాగేశ్వరరావు, జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు నూతి సత్యనారాయణ, జిల్లా యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడు వేజెండ్ల.సాయికుమార్,డీసీసీ వైస్ ప్రెసిడెంట్ వేమిరెడ్డి సుధాకర్ రెడ్డి, స్థానిక నాయకులు, ఉన్నతాధికారులు స్థానిక సర్పంచులు పలువురు ప్రజా ప్రతినిధులు పార్టీ వివిధ అనుబంధ సంఘాల నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

## విశ్వాసం, త్యాగం, కరుణ, మానవత్వానికి ప్రతీక బక్రీద్

**కామారెడ్డి ప్రతినిధి, మే 28 (జనంసాక్షి) :** పవిత్రమైన బక్రీద్ (ఈద్–ఉల్–అజ్హా) పర్వదినాన్ని పురస్కరించుకొని కామారెడ్డి పట్టణంలోని కోర్టు ఆవరణలో గల ఈద్గాలో నిర్వహించిన ప్రత్యేక నమాజ్ కార్యక్రమంలో తెలంగాణ ప్రభుత్వ సలహాదారు మహమ్మద్ అలీ షబ్బీర్ పాల్గొన్నారు. అనంతరం అక్కడికి విచ్చేసిన ముస్లిం సోదరులకు బక్రీద్ శుభాకాంక్షలు తెలియజేస్తూ ప్రసంగించారు. ఈ సందర్భంగా షబ్బీర్ అలీ మాట్లాడుతూ ఈద్–ఉల్–అజ్హా పండుగ విశ్వాసం, త్యాగం, కరుణ, మానవత్వం వంటి గొప్ప విలువలను సమాజానికి గుర్తు చేస్తుందని అన్నారు. ప్రతి ఇంటిలో శాంతి, సంతోషం, ఐశ్వర్యం, సౌభ్రాతృత్వం నిండాలని ఆకాంక్షించారు. సమాజ సేవ, ఐక్యత, సోదరభావం వంటి విలువలను ప్రతి ఒక్కరూ మరింత బలోపేతం చేసుకోవాలని పిలుపునిచ్చారు. కుల గణనలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలి అన్నారు. బీజేపీ రాజ్యాంగ విరుద్ధమైన చర్యలపై ధ్వజం ఎత్తారు. గోవును జాతీయ జంతువుగా ప్రకటించాలనే ప్రతిపాదనకు మద్దతు తెలిపారు. కుల గణన, ఎస్.ఐ.ఆర్ పై దేశంలో జరుగుతున్న ప్రస్తుత పరిణామాలు, కుల గణన ప్రాధాన్యతపై వివరంగా మాట్లాడాతూ రాష్ట్రంలో ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపడుతున్న కుల గణన (సెన్సస్) ప్రక్రియలో ప్రతి ఒక్కరూ ఎట్టి పరిస్థితుల్లోనూ తమ వివరాలను నమోదు చేసుకోవాలని కోరారు. సమాజంలో అన్ని వర్గాలకు న్యాయం జరగాలంటే కుల గణన అత్యంత కీలకం. దీనిపై స్థానిక నాయకులు, ప్రభుత్వ అధికారులు ప్రజల్లో విస్తృతంగా అవగాహన కల్పించాలి" అని ఆయన ఆదేశించారు. కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వంపై షబ్బీర్ అలీ గారు తీవ్రస్థాయిలో విమర్శలు గుప్పించారు. బీజేపీ



ప్రభుత్వం తమకు వ్యతిరేకంగా ఉన్న ఓట్లను అక్రమంగా తొలగిస్తూ దేశ మనుగడకే ప్రమాదం తెచ్చేలా, రాజ్యాంగ విరుద్ధంగా వ్యవహరిస్తోందని ఆరోపించారు. రాష్ట్రాలపై ఒత్తిడి,బీజేపీ అధికారంలో లేని రాష్ట్రాలలో ఎలక్షన్ కమిషన్‌పై ఒత్తిడి తెచ్చి, " పేరుతో లక్షలాది ప్రతిపక్ష ఓట్లను ఓటర్ల జాబితా నుండి తొలగిస్తున్నారని మండిపడ్డారు. ఇందుకు బెంగాల్, అస్సాం, బీహార్ రాష్ట్రాలే ఉదాహరణలు అన్నారు. పశ్చిమ బెంగాల్‌లో అధికారం దక్కించుకోవడం కోసం ఏకంగా 95 లక్షల ఓట్లను తొలగించారని, అలాగే బీహార్ రాష్ట్రంలోనూ ఇదే తరహాలో ఓట్లను తొలగించి అక్రమంగా ఎన్నికల్లో గెలిచారని ధ్వజమెత్తారు. ఇలాంటి రాజ్యాంగ విరుద్ధ చర్యలకు అవకాశం ఇవ్వకుండా ఉండేందుకు, ప్రతి పౌరుడు అప్రమత్తంగా ఉండి, తమ వివరాలను అందిస్తూ ఓటు హక్కును తప్పకుండా నమోదు చేసుకోవాలని రాజ్యాంగాన్ని కాపాడుకోవాలని పిలుపునిచ్చారు.

## రాళ్ల వానతో నల్గొండలో అపార నష్టం

**నల్లగొండ ప్రతినిధి, మే 28 (జనం సాక్షి) :** నల్లగొండ జిల్లా కేంద్రంలో ఆదివారం సాయంత్రం కురిసిన భారీ అకాల వర్షం ప్రజలను భయాందోళనలకు గురిచేసింది. ఈదురుగాలులు, జడివానతో పాటు రాళ్ల వాన కూడా కురవడంతో పలు ప్రాంతాల్లో తీవ్ర నష్టం సంభవించింది. జిల్లా కలెక్టర్ కార్యాలయం నుంచి ఆర్టీఓ కార్యాలయానికి వెళ్లే మార్గంలో ఉన్న ప్రైవేట్ ఆన్‌లైన్ సెంటర్ల పైకప్పుల పైరేకులు గాలికి ఎగిరిపడి రోడ్డుపై చెల్లాచెదురుగా పడిపోయాయి. దీంతో ఆ ప్రాంతంలో కొంతసేపు భయానక పరిస్థితులు నెలకొన్నాయి. అదే విధంగా పలుచోట్ల విద్యుత్ తీగలు తెగిపడగా, విద్యుత్ స్తంభాలు కూలిపోయినట్లు సమాచారం. భారీ గాలులు, రాళ్ల వాన కారణంగా షాపులు, చిన్న వ్యాపార సంస్థలు కూడా దెబ్బతిన్నాయి. అకాల వర్షంతో భారీగా ఆస్తి నష్టం జరిగినప్పటికీ ఇప్పటివరకు డిజాస్టర్ మేనేజ్మెంట్ బృందాలు, ఆపదమిత్ర టీములు సంఘటనా స్థలానికి చేరుకోలేదని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. బక్రీద్ పర్వదినం సెలవు దినం కావడంతో ఆ ప్రాంతంలో జనసంచారం తక్కువగా ఉండటంతో పెద్ద ప్రమాదం తప్పిందని స్థానికులు చెబుతున్నారు. నష్టపోయిన వ్యాపారులను ప్రభుత్వం తక్షణమే ఆదుకోవాలని షాపుల యజమానులు కోరుతున్నారు.

### అకాల వర్షానికి నల్లగొండ అతలాకుతలం

నల్లగొండ పట్టణంలో కురిసిన అకాల వర్షం, ఈదురుగాలులతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు. భారీ గాలివానకు శాంతి మహిళ మండలి ఎదుట ఉన్న భారీ వృక్షం కూలిపోవడంతో పరిసర ప్రాంతాల్లో



భయాందోళనలు నెలకొన్నాయి. వృక్షం కూలిపోవడంతో సమీపంలోని వృద్ధాశ్రమం పూర్తిగా చీకట్లో మునిగిపోయింది. అక్కడ నివసిస్తున్న వృద్ధులు భయంతో వణికిపోతుండగా, వృద్ధాశ్రమ నిర్వాహకురాలు పిచ్చమ్మ కన్నీటి పర్యంతమవుతూ "ఆపదలో ఉన్నాం... దయచేసి ఆదుకోండి" అంటూ సహాయం కోసం వేడుకుంటున్నారు. ఇక్కడ ఉన్నవారంతా వృద్ధులే... మాకు తోడుగా నిలిచే వారు లేరు... డిజాస్టర్ మేనేజ్మెంట్ టీమ్ వెంటనే స్పందించాలి... ఆపద మిత్రలు సహాయం చేయాలి అంటూ వృద్ధాశ్రమంలోని వృద్ధులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అకాల వర్షం, ఈదురుగాలులతో నల్లగొండ మహానగరం అస్తవ్యస్తంగా మారింది. పలు ప్రాంతాల్లో చెట్లు నేలకొరిగి, విద్యుత్ సరఫరా అంతరాయం కలిగినట్లు సమాచారం. ప్రజలు అప్రమత్తంగా ఉండాలని అధికారులు సూచిస్తున్నారు.

## మహిళలు ఆర్థికంగా ఎదగాలి



**ఎర్రుపాలెం, మే 27 (జనంసాక్షి) :** మండల పరిధిలోని వెంకటాపురంలో తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ప్రజాపాలన–ప్రగతి ప్రణాళికలో భాగంగా నిర్మించిన సోలార్ పవర్ ప్లాంట్ ను డిప్యూటీ సీఎం బట్టి విక్రమార్క, పంచాయతీరాజ్ శాఖ మంత్రి సీతక్క బుధవారం ప్రారంభించారు. ముందుగా గ్రామ చైతన్య సమాఖ్య ఆధ్వర్యంలో నిర్మించనున్న పెట్రోల్ బంకుకు బట్టి విక్రమార్క సీతక్కతో కలసి ప్రారంభోత్సవం చేశారు. అనంతరం జరిగిన బహిరంగ సభలో బట్టి విక్రమార్క మాట్లాడుతూ ప్రభుత్వం మహిళలకు అందిస్తున్న అవకాశాలను అందిపుచ్చుకుని ఆర్థికంగా ఎదగాలని జిల్లా తెలిపారు. వెంకటాపురం గ్రామంలో ఇందిరా మహిళా శక్తి పథకం క్రింద నిర్మించిన ఒక మెగావాట్ సామర్థ్యపు సోలార్ పవర్ ప్లాంట్ నిర్మాణంతో ఈ ప్రాంత రైతులకు ఎంతో ఉపయోగంగా ఉంటుందన్నారు. ప్లాంట్ నిర్మాణంతో భవిష్యత్లో విద్యుత్ సరఫరా ఎంత మెరుగు పడుతుందన్నారు. సోలార్ పవర్ ప్లాంట్ ద్వారా పునరుత్పాదక శక్తిని ప్రోత్సహించడంతో పాటు మహిళా సాధికారత కు బలమివ్వడం పథకం యొక్క ముఖ్య లక్ష్యమని అన్నారు. పనుల నాణ్యతలో ఎటువంటి లోపాలు లేకుండా,నిర్ణీత కాల వ్యవధిలో పూర్తి చేసిన అధికారులను అభినందించారు. ప్లాంట్ నిర్వహణ ఎలా చేయాలనే దానిపై పూర్తి అవగాహన మహిళ సంఘాలకు కల్పించాలని అధికారులకు ఆదేశించారు. కార్యక్రమంలో స్పెషల్ చీఫ్ సెక్రటరీ దాన కిషోర్, సర్ఫ్ సీఈఓ దివ్య దేవరాజన్, జిల్లా కలెక్టర్ దివాకర, ఐజిఎన్పిడిఎల్ వరుణ్ రెడ్డి, స్థానిక సంస్థల డిప్యూటీ కలెక్టర్ శ్రీజ, రెడ్కో సీఈఓ అనిలా, తాసిల్దార్ సునీత, ఎంపీడీవో శ్రీనివాసరావు, ఎలక్ట్రిసిటీ ఎస్ఇ ఇనుగుర్తి శ్రీనివాసాచారి,డిఆర్డీవో కొండపల్లి శ్రీరామ్,రెడ్కో డిస్ట్రిక్ట్ మేనేజర్ పి. అజయ్ కుమార్,డిఆర్డీవో ఎపిడి జయశ్రీ,ఏడిఏ విజయచందర్, రాష్ట్ర గిడ్డంగుల సంస్థ చైర్మన్ రాయల నాగేశ్వరరావు, ఏఎంసి చైర్మన్ బండారు నర్సింహారావు పాల్గొన్నారు.

## డ్రగ్స్ నిర్మూలనకు కృషి చేయాలి

- జిల్లా కలెక్టర్ తేజస్ నంద్ లాల్ పవార్
- స్టాప్ డ్రగ్స్ అబ్యూస్ పోస్టర్ ఆవిష్కరణ

**సూర్యాపేట ప్రతినిధి, మే 28 (జనంసాక్షి) :** షాలోమ్ ఆఫ్ హోప్ ఫౌండేషన్ డిజైన్ చేసిన స్టాప్ డ్రగ్ అబ్యూస్ పోస్టర్ ను గురువారం కలెక్టరేట్ లో జిల్లా కలెక్టర్ తేజస్ నంద్ లాల్ పవార్ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ యువత డ్రగ్స్ కు బానిసలుగా మారి జీవితాలను నాశనం చేసుకుంటున్నారని అన్నారు. తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు వారి మానసిక స్థితిని, స్నేహితులను ఎప్పటికప్పుడు గమనిస్తూ వారు డ్రగ్స్ కు అలవాటు కాకుండా చూసుకోవాలన్నారు. డ్రగ్స్ నిర్మూలనకై స్వచ్ఛంద సంస్థలు, విద్యాసంస్థలు ప్రతి ఒక్కరూ బాధ్యత తీసుకోవాలని పేర్కొన్నారు. సూర్యాపేట జిల్లా కేంద్రంగా డ్రగ్స్ నిర్మూలనకై ఒక కౌన్సిలింగ్ సెంటర్ ను కూడా ఏర్పాటు చేయాలని ఫౌండేషన్ వ్యవస్థాపకులు సిహెచ్.అశోక్ ను కోరారు. అనంతరం ఫౌండేషన్ వ్యవస్థాపకులు సిహెచ్.అశోక్




మాట్లాడుతూ ప్రపంచ మాదక ద్రవ్యాల దినోత్సవం జూన్ 26ను పురస్కరించుకొని సూర్యాపేట పట్టణంలో అవగాహన సదస్సులు నిర్వహించనున్నట్లు తెలిపారు. ఇండియన్ మెడికల్ అసోసియేషన్ బంజారాహిల్స్, లయన్స్ క్లబ్ ఇంటర్నేషనల్ హైదరాబాద్ బ్రాంచ్‌తో డ్రగ్స్ నిర్మూలనకై అవగాహన సదస్సులు నిర్వహిస్తున్నామని తెలిపారు. ఫౌండేషన్ చేస్తున్న సేవలను కలెక్టర్ అభినందించారు. పలువురు ఫౌండేషన్ ప్రముఖులు, ఇతర వాలంటీర్స్ తో కలిసి షాలోమ్ ఆఫ్ హోప్ ఫౌండేషన్ డ్రగ్స్ నిర్మూలనకై పోరాడుతుందని అశోక్ తెలిపారు.

## రోడ్డు ప్రమాదంలో ఒకరు మృతి

- మరో ఇద్దరికి గాయాలు



**శామీర్‌పేట, మే 28 (జనం సాక్షి) :** రోడ్డు ప్రమాదంలో ఒకరు మృతి చెందగా మరో ఇద్దరికి గాయాలైన సంఘటన జీనోంవ్యాలీ పోలీస్ స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. మూడు చింతలపల్లి మున్సిపాలిటీ అనంతరం గ్రామానికి చెందిన మహమ్మద్ రెహాన్ పాషా(18) విద్యార్థి, మహమ్మద్ అహ్మద్, దినేష్ రెడ్డి లు అనంతరం నుంచి దినేష్ రెడ్డి కార్ లో పెట్రోల్ పోయించడానికి కొల్తూర్ కి వెళ్లారు. అక్కడ పెట్రోల్ లేదని తెలియడంతో తిరిగి ఇంటికి వస్తుండగా కొల్తూర్ సమీపంలోని పద్మిని డైరీ వద్ద కారు డ్రైవ్ చేస్తూ సెల్ఫీ వీడియో తీస్తున్నారు. కారు అదుపుతప్పి రోడ్డు పక్కన ఉన్న చెట్టును ఢీ కొట్టింది. దీంతో డ్రైవర్ పక్కన కూర్చున్న మహమ్మద్ రెహాన్ పాషా మొహానికి తలకు తీవ్ర గాయాలై అక్కడికక్కడే మృతి చెందాడు. కారు నడుపుతున్న దినేష్ రెడ్డికి, వెనకాల కూర్చున్న మహమ్మద్ అహ్మద్ కు స్వల్ప గాయాలు అయ్యాయి. సంఘటన స్థలానికి చేరుకున్న కుటుంబ సభ్యులు అంబులెన్స్ లో ఆర్ వి ఎం ఆస్పత్రికి తీసుక వెళ్లారు. అక్కడ డాక్టర్ పరిశీలించి అప్పటికే మృతి చెందినట్లు నిర్ధారించారు. దీంతో మృతదేహాన్ని పోస్టుమార్టం నీ మొత్తం నగరంలోని గాంధీ ఆసుపత్రికి తరలించారు. తండ్రి మహమ్మద్ చాంద్ పాష్ ఫిర్యాదు మేరకు జీనోంవ్యాలీ పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

## రైలు నుంచి జారిపడి వలస కూలీ మృతి

- పట్టాల వెంట ముక్కలైన మృతదేహాన్ని వెతికిన అన్నం బృందం



**ఖమ్మం, మే 28 (జనంసాక్షి) :** మధ్యప్రదేశ్ రాష్ట్రం నిముచ్ జిల్లా మానస గ్రామానికి చెందిన అర్జున్ బంజారా అనే వలస కూలీ చెన్నైకి వెళ్తూ విషాదాంతానికి గురైన ఘటన బోనకల్––నాగులవంచ రైల్వే స్టేషన్ల మధ్య చోటుచేసుకుంది. గత రాత్రి జోద్పూర్ ఎక్స్ప్రెస్ రైల్లో ప్రయాణిస్తున్న అర్జున్ బంజారా ప్రమాదవశాత్తు రైలు నుండి జారిపడటంతో అక్కడికక్కడే మృతి చెందాడు. వేగంగా వెళ్తున్న రైలు కారణంగా మృతదేహం ముక్కలు ముక్కలై పట్టాల మధ్య చెల్లాచెదురుగా పడిపోయింది. మృతుడితో పాటు అతని సమీప బంధువులు నలుగురు కూడా అదే రైల్లో ప్రయాణిస్తున్నారు. అర్జున్ రైలు నుండి పడిపోయిన విషయాన్ని తోటి ప్రయాణికులు గుర్తించి తెలియజేయడంతో వారు వెంటనే రైలును ఆపించి బోనకల్, మొటమర్రి, మధిర రైల్వే స్టేషన్ మాస్టర్లకు సమాచారం అందించారు. అనంతరం రాత్రంతా రైలు పట్టాల వెంట మృతదేహం కోసం గాలింపు చేపట్టారు. గురువారం ఉదయం బోనకల్ నుండి నాగులవంచ వైపు డౌన్‌లైన్ రైలు పట్టాల మధ్య మృతదేహం కనిపించడంతో కుటుంబ సభ్యులు రైల్వే పోలీసులకు సమాచారం ఇచ్చారు. సమాచారం అందుకున్న ఖమ్మం జీఆర్పి పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని సహాయక చర్యలు ప్రారంభించారు. మృతదేహాన్ని ఖమ్మం ప్రభుత్వ వైద్యశాల మార్చురీకి తరలించేందుకు ఖమ్మం నగరానికి చెందిన అన్నం ఫౌండేషన్‌కు సమాచారం ఇవ్వగా, ఫౌండేషన్ చైర్మన్ అన్నం శ్రీనివాసరావు ఆధ్వర్యంలో అంబులెన్స్‌తో బృందం ఘటనాస్థలానికి చేరుకుంది. రైల్వే పోలీసు హెడ్ కానిస్టేబుల్ ఆళ్ల సత్యనారాయణ రెడ్డి, కానిస్టేబుల్ రామకృష్ణ, కుటుంబ సభ్యుల సమక్షంలో మిట్టమధ్యాహ్నం వరకు పట్టాల మధ్య చెల్లాచెదురుగా ఉన్న మృతదేహ అవశేషాలను సేకరించారు. అనంతరం వాటిని మూటగట్టుకుని సుమారు రెండు కిలోమీటర్లు కర్రకట్టుకొని రోడ్డు వరకు తీసుకువచ్చి, అక్కడి నుండి అన్నం ఫౌండేషన్ అంబులెన్స్‌లో ఖమ్మం ప్రభుత్వ వైద్యశాల మార్చురీకి తరలించి భద్రపరిచారు.

## యాదగిరిగుట్ట మండలంలో మంత్రుల బృందం పర్యటన


**యాదగిరిగుట్ట మే 28 (జనంసాక్షి) :** యాదాద్రి భువనగిరి జిల్లా ఆలేరు నియోజకవర్గం యాదగిరిగుట్ట, భువనగిరి ప్రాంతాల్లో తెలంగాణ రాష్ట్ర మంత్రులు పర్యటించారు. తెలంగాణ రాష్ట్ర మంత్రులు నీటిపారుదల, పౌరసరఫరాల శాఖ మంత్రి శ్రీ ఉత్తమ్ కుమార్ రెడ్డి , ఐటి మరియు పరిశ్రమల శాఖ మంత్రి శ్రీ దుద్దిళ్ల శ్రీధర్ బాబు, రెవెన్యూ ఒ సమాచార శాఖ మంత్రి శ్రీ పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి యాదగిరిగుట్టలోని గోశాల ప్రాంగణంలో ఏర్పాటు చేసిన హెలిప్యాడ్ వద్ద హెలికాప్టర్ ద్వారా చేరుకున్నారు. ఈ సందర్భంగా తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ విప్ ఆలేరు ఎమ్మెల్యే బీర్ల అయిలయ్య , భువనగిరి ఎంపీ చామల కిరణ్ కుమార్ రెడ్డి , ప్రభుత్వ విప్ ఎమ్మెల్యే వేముల వీరేశం , ఎమ్మెల్యే కుంభం అనిల్ కుమార్ రెడ్డి మంత్రులకు ఘన స్వాగతం పలికారు. అనంతరం మంత్రుల బృందం వంగపల్లి గ్రామంలోని వరి ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని సందర్శించారు. అక్కడ రైతులతో నేరుగా మాట్లాడి ధాన్యం కొనుగోలు ప్రక్రియ, తేమ శాతం, బస్తాల తరలింపు, చెల్లింపుల విధానం వంటి అంశాలపై ఆరా తీశారు. రైతులు ఎదుర్కొంటున్న సమస్యలను అడిగి తెలుసుకొని, ప్రభుత్వ కొనుగోలు ప్రక్రియ పారదర్శకంగా కొనసాగాలని అధికారులకు సూచించారు. తదుపరి రమాజీపేట సమీపంలో ఏర్పాటు చేసిన గోదామును పరిశీలించారు. ఈ గోదామును ఆలేరు ఎమ్మెల్యే శ్రీ బీర్ల అయిలయ్య ప్రత్యేకంగా ఏర్పాటు చేయగా, మంత్రులు అక్కడ నిల్వ సామర్థ్యం, ధాన్యం భద్రత, నిర్వహణ విధానాలను పరిశీలించారు. గోదాములో ఎన్ని బస్తాలు నిల్వ చేయగలమనే వివరాలను అడిగి తెలుసుకొని, రైతులకు ఇబ్బందులు తలెత్తకుండా ముందస్తు చర్యలు తీసుకోవడం అభినందనీయమని పేర్కొన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే బీర్ల అయిలయ్య చర్యలను మంత్రులు ప్రశంసించారు. అనంతరం భువనగిరిలోని యాదాద్రి భువనగిరి జిల్లా కలెక్టర్ కార్యాలయంలో సివిల్ సప్లై అధికారులతో ప్రత్యేక సమీక్ష సమావేశం నిర్వహించారు. జిల్లాలో ధాన్యం కొనుగోలు పరిస్థితులు, నిల్వ సదుపాయాలు, రవాణా ఏర్పాట్లు, రైతులకు చెల్లింపుల ప్రక్రియపై అధికారులతో సమగ్రంగా చర్చించారు. వర్షాల కారణంగా రైతులు ఇబ్బందులు



పడకుండా తక్షణ చర్యలు తీసుకోవాలని, కొనుగోలు ప్రక్రియ వేగవంతంగా పూర్తి చేయాలని అధికారులకు మంత్రులు ఆదేశాలు జారీ చేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా అధికారులు, ప్రజాప్రతినిధులు, వ్యవసాయ శాఖ అధికారులు, సివిల్ సప్లై అధికారులు, రైతులు, పార్టీ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

## మందలపల్లిలో గాలివాన భీభత్సం

**దమ్మపేట, మే 28 (జనం సాక్షి) :** దమ్మపేట మండల పరిధిలోని మందలపల్లి గ్రామంలో గురువారం ఉదయం ఈదురుగాలులతో కూడిన భారీ వర్షం కురిసింది. ఈ గాలివానకు పలు ప్రాంతాల్లో భారీ వృక్షాలు వేర్లతో సహా నేలకూలాయి. చెట్లు విరిగిపడటంతో ప్రధాన రహదారులపై రాకపోకలకు కొద్దిగా అంతరాయం కలిగింది. మందలపల్లి జాతీయ రహదారిపై ద్విచక్ర వాహనంపై వృక్షం



పడటంతో ద్విచక్ర వాహనం పూర్తిగా ధ్వంసం అయింది. అదేవిధంగా,ఈదురుగాలుల ధాటికి స్థానిక పోలీస్ స్టేషన్ ముందు విద్యుత్ స్తంభం విరిగిపడటంతో పాటు పలుచోట్ల విద్యుత్ స్తంభాలు విరిగిపడ్డాయి. వైర్లు తెగిపడడంతో విద్యుత్ సరఫరాకు తీవ్ర అంతరాయం ఏర్పడింది. దీంతో స్థానికులు అంధకారంలో ఇబ్బందులు పడుతున్నారు. మరోవైపు విద్యుత్ శాఖ అధికారులు,పంచాయతీ సిబ్బంది సంఘటనా స్థలానికి చేరుకుని చెట్లను తొలగిస్తున్నారు. విద్యుత్ పునరుద్ధరణ పనులు కొనసాగుతున్నాయి. ఎలాంటి ప్రాణనష్టం జరగకపోవడంతో అంతా ఊపిరి పీల్చుకున్నారు.




# టాటా కొత్త టియాగో, టియాగో ఈవీ వచ్చేశాయ్..

### ధర, ఇతర వివరాలు ఇవీ..

**న్యూఢిల్లీ:**ప్రముఖ కార్ల తయారీ కంపెనీ టాటా మోటార్స్ పాసింజర్ వెహికల్ తదుపరి తరం టియాగో, టియాగో ఈవీని దేశీయ మార్కెట్‌లోకి లాంచ్ చేసింది. ఈ ఎంట్రీ లెవల్ హ్యాచ్‌బ్యాక్ ధరను రూ.4.69 లక్షలుగా (ఎక్స్‌షోరూమ్) నిర్ణయించింది. ఎలక్ట్రిక్ వెహికల్ ధరను రూ.6.99 లక్షలు (ఎక్స్‌షోరూమ్)గా పేర్కొంది. ఇదే టియాగో ఈవీని బ్యాటరీ అద్దె ప్రాతిపదికన (బ్యాటరీ యాజ్ ఏ సర్వీస్) తీసుకుంటే రూ.4.69 లక్షలు+ కిలోమీటరుకు రూ.2.6 చొప్పున చెల్లించాలి. ఐసీఎన్‌జీ వెర్షన్ ధరను రూ.5.79 లక్షలుగా (ఎక్స్ షోరూమ్) కంపెనీ నిర్ణయించింది.కొత్త టియాగోలో డిజైన్, ఇంటీరియర్, ఫీచర్ పరంగా చాలా వరకు మార్పులు చేపట్టారు. మారుతీ సుజుకీ స్విఫ్ట్, హ్యుందాయ్ గ్రాండ్ ఐ10 నియోస్ వంటి మోడళ్లకు పోటీ ఇచ్చేందుకు అవసరమైన మార్పులు చేశారు. ఐ బ్రో స్టైల్ ఎల్‌ఈడీ హెడ్‌ల్యాంప్, డీఆర్‌ఎల్స్ ఇచ్చారు. వెనుక వైపు కూడా ఎల్‌ఈడీ టెయిల్‌లైట్స్ ఇచ్చారు. 15 అంగుళాల డ్యూయల్ టోన్ అల్లాయ్ వీల్స్ ఉన్నాయి. టియాగో ఈవీలో కూడా ఇంచుమించు ఐస్ మోడల్ డిజైన్‌నే కొనసాగించారు. ఇక ఇంటీరియర్ విషయానికొస్తే.. ఇందులో 2 స్పోక్ స్టీరింగ్ వీల్ ఇచ్చారు. 10.25 అంగుళాల టచ్‌స్క్రీన్ సెంటర్ ఉంది. డ్యూయల్ వైర్‌లెస్ ఛార్జర్, 360 డిగ్రీల కెమెరా, బ్లైండ్ స్పాట్ మానిటర్, రియర్ ఏసీ వెంట్స్, క్రూయిజ్ కంట్రోల్, రెయిన్ సెన్సింగ్ వైపర్స్, ఆటో హెడ్‌ల్యాంప్స్ వంటి ఫీచర్లు ఉన్నాయి. సేఫ్టీ పరంగా ఆరు ఎయిర్‌బ్యాగులు ఇచ్చారు. ఎలక్ట్రానిక్ స్టెబిలిటీ, హిల్ హోల్డ్ కంట్రోల్ వంటివి ఉన్నాయి. టియాగోలో 1.2 లీటర్ నాచురల్ యాస్పిరేటెడ్ పెట్రోల్ ఇంజిన్ ఇచ్చారు. ఇది 86 హెచ్‌పీ పవర్‌ను, 113 ఎన్‌ఎం టార్క్‌ను ఉత్పత్తి చేస్తుంది. సీఎన్‌జీలోనూ 1.2 లీటర్ ఇంజిన్ అమర్చారు. ఇది 74 హెచ్‌పీ పవర్‌ను, 96 ఎన్‌ఎం టార్క్‌ను ఉత్పత్తి చేస్తుంది. 5 స్పీడ్ మాన్యువల్, 5 స్పీడ్ ఏఎంటీ ఆప్షన్లలో లభిస్తాయి.ఇక టియాగో ఈవీ రెండు బ్యాటరీ ప్యాక్ ఆప్షన్లలో లభిస్తుంది. 19.2 ఎచిప్త్ర బ్యాటరీ సామర్థ్యం కలిగిన కారు సింగిల్ ఛార్జింగ్‌తో 205 కిలోమీటర్లు, 24ఎచిప్త్ర బ్యాటరీ వేరియంట్‌తో 215 కిలోమీటర్లు ప్రయాణించొచ్చని కంపెనీ పేర్కొంది. 3.3ఎచి పోర్టబుల్ ఛార్జర్, 7.2ఎచి హోమ్ ఛార్జర్, 30ఎచి డీసీ ఫాస్ట్ ఛార్జింగ్ ఆప్షన్లతో లభిస్తుంది.




# రెండో రోజూ స్వల్ప నష్టాలు

- రూ.2.04 లక్షల కోట్లు పెరిగిన సంపద విలువ
- ఎఫ్ఐఐ విక్రయాలు: రూ.1,042.70 కోట్లు
- డీఐఐ కొనుగోళ్లు: రూ.3,821.00 కోట్లు

**న్యూఢిల్లీ:**పశ్చిమాసియా ఉద్రిక్తతల ఉపశమనానికి సంబంధించి వస్తున్న పరస్పర విరుద్ధ వార్తలు మదుపర్లను గందరగోళానికి గురిచేస్తున్నాయి. దీంతోపాటు మన స్టాక్ మార్కెట్ నుంచి విదేశీ పెట్టుబడిదార్లు నిధులు ఉపసంహరించడం వల్ల వరుసగా రెండో రోజైన బుధవారమూ సూచీలు నష్టాల్లో ముగిశాయి. డాలరుతో పోలిస్తే రూపాయి మారకపు విలువ 12 పైసలు పెరిగి 95.58 వద్ద ముగిసింది. బ్యారెల్ బ్రెంట్ ముడి చమురు ధర 3.24% తగ్గి 96.35 డాలర్ల వద్ద ట్రేడవుతోంది. ఆసియా మార్కెట్లలో దక్షిణ కొరియా, జపాన్ సానుకూలంగా ముగిశాయి. షాంఘై, హాంకాంగ్ సూచీలు నష్టపోయాయి. ఐరోపా మార్కెట్లు సానుకూలంగా కదలాడాయి.సూచీలు నష్టపోయినా, బీఎస్ఈలోని నమోదిత కంపెనీల మార్కెట్ విలువ రూ.2.04 లక్షల కోట్లు పెరిగి, రూ.470.75 లక్షల కోట్ల (4.91 లక్షల కోట్ల డాలర్ల)కు చేరింది. సెన్సెక్స్ ఉదయం 75,939.86 పాయింట్ల వద్ద (క్రితం ముగింపు 76,009.70 పాయింట్లు) ప్రతికూలంగా ప్రారంభమైంది. తర్వాత లాభాల్లోకి వచ్చిన సూచీ ఒక దశలో 76,224.68 పాయింట్ల వద్ద గరిష్ఠాన్ని తాకింది. మళ్లీ నష్టాల్లోకి జారుకుని 75,748.21 పాయింట్ల వద్ద కనిష్ఠ స్థాయిని నమోదు చేసింది. చివరకు 141.90 పాయింట్లు కోల్పోయి 75,867.80 పాయింట్ల వద్ద స్థిరపడింది. నిఫ్టీ 50 సూచీ 6.55 పాయింట్లు నష్టపోయి 23,907.15 పాయింట్ల వద్ద ముగిసింది. ఇంట్రాడేలో ఈ సూచీ 23,983.20 - 23,858.25 పాయింట్ల మధ్య కదలాడింది. సెన్సెక్స్ 30 షేర్లలో 10 నష్టపోయాయి. హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్



2.63%, ఇన్ఫోసిస్ 0.71%, ఐటీసీ 0.61%, హెచ్‌యూఎల్ 0.53% చొప్పున పడ్డాయి. పవర్‌గ్రిడ్ 2.56%, ఎటర్నల్ 2.54%, ఎన్‌టీపీసీ 2.23%, టాటా స్టీల్ 2.04%, ఇండిగో 1.9%, మారుతీ 1.22% లాభపడ్డాయి. రంగాల వారీ సూచీలకొస్తే టాప్ 10 బ్యాంక్స్, ప్రైవేట్ బ్యాంక్స్, ఆర్థిక సేవలు, బ్యాంకెక్స్, ఫోకస్డ్ ఐటీ, ఐటీ రంగాలు రాణించాయి. భారీ యంత్ర పరికరాలు, యుటిలిటీస్, విద్యుత్, లోహ, వాహన, టెలికాం రంగాలు డీలాపడ్డాయి. బీఎస్ఈలో 2,220 షేర్లు సానుకూలంగా, 1,996 షేర్లు ప్రతికూలంగా కదలాడాయి. 178 షేర్లలో మార్పు లేదు.గౌతమ్ అదానీకి చెందిన అదానీ పవర్ మార్కెట్ విలువ రూ.4.79 లక్షల కోట్లకు చేరింది. దీంతో దేశీయంగా అత్యధిక మార్కెట్ విలువ కలిగిన కంపెనీల జాబితాలో 11వ స్థానానికి చేరింది. ఐటీ దిగ్గజ కంపెనీ ఇన్ఫోసిస్ మార్కెట్ విలువ (రూ.4.70 లక్షల కోట్ల)ను అదానీ పవర్ మించడం గమనార్హం. ఈ ఏడాది ఇప్పటి వరకు అదానీ పవర్ మార్కెట్ విలువ 68% వృద్ధి చెందింది. షేరు ధర బుధవారం బీఎస్ఈలో 1.72% లాభపడి రూ.248.75 వద్ద ముగిసింది. ఫలితంగా సంస్థ మార్కెట్ విలువ రూ.4.79 లక్షల కోట్లకు చేరింది. అదానీ గ్రూప్‌లోని మిగతా కంపెనీల షేర్లు కూడా పెరిగాయి. అదానీ టోటల్ గ్యాస్ 13.35%, ఎన్‌డీటీవీ 10.39%, అదానీ ఎనర్జీ సొల్యూషన్స్ 5.28%, అంబుజా సిమెంట్స్ 2.28%, అదానీ గ్రీన్ ఎనర్జీ 2.23%, ఏసీసీ 1.09%, అదానీ పోర్ట్స్ 0.74%, అదానీ ఎంటర్‌ప్రైజెస్ 0.11% లాభపడ్డాయి.

## ఉద్యోగులకు ఆ కంపెనీ బంపరాఫర్..

### 30 శాతానికిపైగా బోనస్



**న్యూఢిల్లీ:**ఏఐ బూమ్‌తో సెమీ కండక్టర్ రంగంలో భారీగా పెట్టుబడులు వచ్చిపడుతుండటంతో తైవాన్ సంస్థ టీఎస్ఎంసీ మార్కెట్ విలువ అమాంతం పెరిగింది. దాంతో ఈ కంపెనీ తమ ఉద్యోగులకు బంపరాఫర్ ప్రకటించింది. ప్రాఫిట్ షేరింగ్ బోనస్‌ను 30 శాతానికిపైగా పెంచుతున్నట్లు కంపెనీ ఛైర్మన్, సీఈఓ సి.సి.వీయ్ వెల్లడించారు. మే 29న ఆ బోనస్‌లు ఇవ్వనున్నారు. సీనియారిటీ, గ్రేడ్, ప్రదర్శన ఆధారంగా ఈ మొత్తంలో మార్పులు ఉంటాయి. ఈ ఆర్థిక సంవత్సరం తొలి త్రైమాసికానికి టీఎస్ఎంసీ ఆదాయంలో 30 శాతం వృద్ధిని నమోదు చేసింది.తైవాన్ సెమీకండక్టర్ మాన్యుఫాక్చరింగ్ కంపెనీ (టీఎస్ఎంసీ).. ఎన్విడియా, యాపిల్ వంటి దిగ్గజ సంస్థలకు అధునాతన ప్రాసెసర్లను సరఫరా చేస్తోంది. రెవెన్యూ, తయారీపరంగా ప్రపంచంలోనే నంబర్‌వన్ చిప్ తయారీ సంస్థ ఇది. మార్కెట్ విలువ ప్రకారం తొలిస్థానం ఎన్విడియాది. ఇటీవల తైవాన్ స్టాక్ మార్కెట్ భారత్ దలాల్ స్ట్రీట్‌ను దాటి ఐదో స్థానంలో నిలిచిని సంగతి తెలిసిందే. అందుకు ఈ సంస్థే ప్రధాన కారణం. కృత్రిమ మేధ విస్తరిస్తుండటంతో భవిష్యత్తులో తమ ఉత్పత్తులకు డిమాండ్ కొనసాగుతుందనే విశ్వాసమే.. లాభాల్లో మెరుగైన వాటాను ఉద్యోగులతో పంచుకోవడానికి కారణంగా కనిపిస్తోంది.

### గుడ్ల ధరలు

| హైదరాబాద్ | వరంగల్ |
|---|---|
| ₹ 5.40 | ₹ 5.42 |

### బంగారం ధరలు (10 గ్రాములు)

హైదరాబాద్

| ₹ 1,45,800 | ₹ 1,59,060 |
|---|---|
| (22 క్యారెట్లు) | (24 క్యారెట్లు) |

### వెండి ధరలు (కేజీ)

హైదరాబాద్

₹ 2,95,000

## ఈక్విటీలపై ఎల్‌టీసీజీని రద్దు చేయాలి..

### కేంద్రానికి విజయ్ కేడియా వినతి

లిస్టెడ్ ఈక్విటీల్లో పెట్టుబడులపై దీర్ఘకాలిక మూలధన లాభాల పన్ను విధింపు అంశం మరోసారి తెరపైకి వచ్చింది. ప్రముఖ మదుపరి విజయ కేడియా ఈ అంశాన్ని తాజాగా లేవనెత్తారు. క్యాపిటల్ మార్కెట్ బలోపేతానికి ఈ లాంగ్-టర్మ్ క్యాపిటల్ గెయిన్స్ పన్నును పూర్తిగా రద్దు చేయాలని కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్‌కు, ఆర్థిక మంత్రిత్వ శాఖకు విజ్ఞప్తి చేశారు. ఈ మేరకు ఆయన ఎక్స్ వేదికగా పోస్ట్ పెట్టారు.భారత్‌లో ప్రపంచస్థాయి కంపెనీలు రూపుదిద్దుకోవాలంటే దీర్ఘకాలిక పెట్టుబడులు అవసరం అని విజయ్ కేడియా అభిప్రాయపడ్డారు. ఎల్‌టీసీజీ పన్నును రద్దు చేస్తే దీర్ఘకాలిక పెట్టుబడిదారులకు గొప్ప ప్రోత్సాహం ఇచ్చినట్లు అవుతుందన్నారు. ప్రస్తుత పన్ను విధానం స్వల్పకాలిక స్పెక్యులేటివ్ ట్రేడింగ్,



దీర్ఘకాలిక పెట్టుబడులకు మధ్య వ్యత్యాసాన్ని సరిగ్గా గుర్తించలేకపోతోందని పేర్కొన్నారు. దీర్ఘకాలిక మదుపరి కేవలం మార్కెట్ లావాదేవీల్లో పాల్గొనే వ్యక్తి మాత్రమే కాదని, దేశ సంపద సృష్టిలో భాగస్వామి అని ఆయన అభిప్రాయపడ్డారు.ఒక కంపెనీ వృద్ధి చెందే క్రమంలో ప్రభుత్వం ఇప్పటికే కార్పొరేట్ పన్ను, జీఎస్టీ, ఉద్యోగుల నుంచి ఆదాయపు పన్ను, కస్టమ్స్ డ్యూటీలు, స్టాంప్ డ్యూటీల రూపంలో భారీగా ఆదాయాన్ని సమకూర్చుకుంటోందని విజయ్ కేడియా అన్నారు. కాబట్టి ఆ కంపెనీల్లో పెట్టుబడులపై మళ్లీ లాంగ్-టర్మ్ క్యాపిటల్ గెయిన్స్‌పై పన్ను వేయడం సమంజసం కాదని పేర్కొన్నారు. ప్రజలు తమ పొదుపు మొత్తాలను బంగారం వంటి వాటిల్లో కాకుండా ఉపాధిని సృష్టించే, దేశ సంపదను పెంచే ఉత్పాదక వ్యాపారాలవైపు మళ్లించేలా పన్ను విధానాలు ఉండాలని అభిప్రాయపడ్డారు. అప్పుడే ప్రపంచస్థాయి కంపెనీలు అవతరిస్తాయన్నారు. ఎల్‌టీసీజీ 2004 వరకు ఉండేది. అప్పట్లో దాన్ని రద్దు చేశారు. 2018లో తిరిగి తీసుకొచ్చారు. 2024 నుంచి మూలధన లాభాలపై 12.5 శాతం (రూ.1.25 లక్షల వరకు మినహాయింపు) పన్ను వర్తిస్తోంది.

## ఉక్రెయిన్‌తో యుద్ధం రష్యా సైనికులకు

# మరణశాసనం

### ఇప్పటి వరకు 5 లక్షల మంది పుతిన్ సేనల మృతి



**మాస్కో:**రష్యా-ఉక్రెయిన్ మధ్య నాలుగేళ్లుగా కొనసాగుతోన్న యుద్ధం ఎప్పటికి ముగుస్తుందో తెలియని పరిస్థితి. ఈ నేపథ్యంలో కొన్ని సంచలన గణాంకాలు వెలుగులోకి వచ్చాయి. 2022 నుంచి జరుగుతోన్న ఈ ఘర్షణల్లో రష్యాకు సైనిక పరంగా భారీ నష్టం వాటిల్లినట్లు కనిపిస్తోంది. ఈ పోరులో 5 లక్షల మంది మాస్కో సైనికులు ప్రాణాలు కోల్పోయారని బ్రిటన్ నిఘా వర్గాలు అంచనావేశాయి.మరోవైపు, యుద్ధం ప్రారంభమైన దగ్గరినుంచి తాము 55వేలమంది సైనికులను కోల్పోయినట్లు ఉక్రెయిన్ అధ్యక్షుడు జెలెన్‌స్కీ ఈ ఫిబ్రవరిలో వెల్లడించారు. ఇరువైపులా ప్రాణనష్టం భారీగానే ఉన్నా.. రెండు దేశాలు వాస్తవ లెక్కలను వెల్లడించట్లేదనే ఆరోపణలున్నాయి. గత నాలుగేళ్లుగా డాన్‌బాస్ ప్రాంతంలోని ఉక్రెయిన్ స్థావరాలపై దాడుల కోసం రష్యా తన సైనికులను దశలవారీగా మోహరించింది. కొత్తగా చేరిన సైనికులు, జైళ్ల నుంచి నియమించుకున్నవారు ఈ ఘర్షణల్లో పాల్గొన్నారు. వారికి సరైన శిక్షణ లేకపోవడం.. యుద్ధరంగంలో భారీగా ప్రాణనష్టానికి దారితీస్తున్నట్లు కనిపిస్తోంది. మరోవైపు, అమెరికా, దాని మిత్రదేశాలు సరఫరా చేసే క్షిపణి వ్యవస్థలు, ఫిరంగి, అధునాతన డ్రోన్లను ఉక్రెయిన్ ఉపయోగిస్తోంది. కమాండ్ పోస్టులు, సైనిక సమూహాలు లక్ష్యంగా జెలెన్‌స్కీ సైన్యం దాడులు చేస్తోంది. దాంతో ఈ నష్టం మరింత పెరిగిందనే అంచనాలున్నాయి. ఈ దాడులను ఎదుర్కొనేలా రష్యా సుశిక్షితులైన సైనికులను నియమించుకోలేకపోతుందని, విధుల్లో ఉన్నవారిని కాపాడుకునేలా ఎలాంటి రక్షణకవచాలను సమీకరించలేకపోతుందని యూకే నిఘా వర్గాలు అంచనా వేశాయి. ఈ కారణాలే రష్యాను దెబ్బతీస్తున్నట్లు విశ్లేషణలు వినిపిస్తున్నాయి.ఇదిలా ఉంటే.. ఆర్మీలో యువతను చేర్చుకునేందుకు రష్యా ప్రభుత్వం వారికి పెద్ద ఎత్తున ప్రోత్సాహకాలు ప్రకటిస్తోంది. ఇందులో భాగంగా రక్షణశాఖతో ఒప్పందం కుదుర్చుకునే వారికి, వారి కుటుంబాలకు ఉండే రుణాల్లో 10 మిలియన్ రూబుల్స్ (సుమారు రూ.1.33కోట్లు) వరకు మాఫీ చేస్తామని హామీ ఇచ్చింది. కొత్తగా సైన్యంలో చేరాలనుకునే వారు కనీసం ఏడాది పాటు కొనసాగుతానని హామీ ఇవ్వాల్సి ఉంటుందని, ఇందుకు సంబంధించిన నిర్ణయంపై అధ్యక్షుడు పుతిన్ సంతకం చేసినట్లు వార్తలు వచ్చాయి.

## జల వివాదాలను సహకార ధోరణితో పరిష్కరించుకోవాలి

ఆయా రాష్ట్రాల్లో రూ.30 వేల కోట్ల విలువైన అభివృద్ధి పనులపై ప్రధాని సమీక్ష నిర్వహించారు. ప్రాజెక్టుల అమలులో జాప్యం.. ఖర్చుల పెరుగుదలకు దారితీయడమే కాకుండా, పౌరులకు అవసరమైన సౌకర్యాలను సకాలంలో అందకుండా చేస్తుందని మోదీ వ్యాఖ్యానించినట్లు ప్రభుత్వం ఓ ప్రకటనలో వెల్లడించింది.నీటి భద్రత కోసం నదుల అనుసంధానం, జల సంరక్షణ, భూగర్భ జలాల పునరుజ్జీవం వంటి అంశాల్లో అవకాశాలను గుర్తించాలని రాష్ట్రాలకు మోదీ సూచించారు. 'స్వచ్ఛభారత్ మిషన్- అర్బన్ 2.0'ను కూడా సమీక్షించారు. నగరాల్లో రూఫ్‌టాప్ సోలార్ ప్యానెళ్ల వినియోగాన్ని వేగవంతం చేయాల్సిన అవసరాన్ని చాటిచెప్పారు. కాల్వల వెంబడి, కాల్వలపై సోలార్ ప్యానెళ్ల ఏర్పాటు మార్గాలనూ అన్వేషించాలని సూచించారు. ఘన వ్యర్థాల నిర్వహణకు సంబంధించిన మౌలిక సదుపాయాలను కూడా వీలైనంత త్వరగా అందుబాటులోకి తీసుకురావాలన్నారు. పెండింగ్‌లో ఉన్న సమస్యల పరిష్కారానికి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు మరింత చురుకుగా పనిచేయాలని సూచించారు.

## 20 ఏళ్లు సౌదీ జైల్లో.. మరణశిక్ష నుంచి


# విముక్తి పొంది భారత్‌కు!



**జనంసాక్షి:**ఓ కేసులో 20 ఏళ్లుగా సౌదీ జైల్లో శిక్ష అనుభవిస్తున్న ఓ భారతీయుడికి ఎట్టకేలకు విముక్తి లభించింది. మరణశిక్ష ఎదుర్కొంటున్న కేరళ యువకుడికి అక్కడి ప్రభుత్వం క్షమాభిక్ష ప్రసాదించింది. ఆయన నేడు స్వదేశానికి చేరుకున్నట్టు సౌదీలోని భారత రాయబార కార్యాలయం వెల్లడించింది.కేరళలోని కొయ్‌కోడ్‌కు చెందిన అబ్దుల్ రహీమ్ 2006లో సౌదీ అరేబియాకు వెళ్లాడు. ఓ ఇంట్లో కారు డ్రైవర్‌గా చేరాడు. అక్కడే ఉన్న 15 ఏళ్ల దివ్యాంగ బాలుడికి కేర్ టేకర్‌గానూ ఉండేవాడు. అప్పటికే ఆ బాలుడు ప్రత్యేక పరికరం సాయంతో శ్వాస తీసుకునేవాడు. ఓ రోజు కారులో వెళ్తున్న సమయంలో బాలుడు గొడవ చేశాడు. దీంతో అతడిని సముదాయించే క్రమంలో ప్రత్యేక పరికరానికి రహీమ్ చేయి తాకడంతో అది ఊడిపోయింది. దీంతో బాలుడు ప్రాణాలు కోల్పోయాడు.ఈ కేసులో అబ్దుల్ రహీమ్‌పై హత్య కేసు నమోదైంది. అది ప్రమాదవశాత్తు జరిగిందని వాదించినప్పటికీ.. స్థానిక న్యాయస్థానం అతడికి మరణ శిక్ష విధించింది. దీనిని 2022లో అప్పీలు కోర్టు సమర్థించింది. సుప్రీం కోర్టు కూడా కింది కోర్టుల నిర్ణయానికి ఆమోదం తెలిపింది. చివరకు బ్లడ్‌మనీపైనే ఆశలు మిగిలాయి. ఈ కేసును మానవతా కోణంలో చూడాలని స్థానికంగా పెద్దఎత్తున ప్రచారం జరిగింది. భారత్ కూడా దౌత్యపరంగా సంప్రదింపులు జరిపింది. ప్రవాస భారతీయ సంఘాలు కూడా తోడ్పాటు అందించాయి. బ్లడ్‌మనీ ఇచ్చేందుకు క్రౌడ్ ఫండింగ్ ద్వారా విరాళాలు సేకరించాయి. చివరకు 2024లో బాధిత కుటుంబం బ్లడ్‌మనీకి అంగీకరించింది. దీంతో సౌదీ ప్రభుత్వం అబ్దుల్ రహీమ్‌కు క్షమాభిక్ష ప్రసాదించింది. అప్పటికే అతడు 20 ఏళ్లు జైలు శిక్ష అనుభవించాడు.ఈ కేసులో బాధిత కుటుంబీకులు 1.5 మిలియన్ సౌదీ రియాల్స్ (సుమారు రూ.34 కోట్లు) పరిహారం తీసుకునేందుకు అంగీకరించినట్లు సమాచారం. ఈ న్యాయ ప్రక్రియలో సాయం అందించిన సౌదీ అధికారులు, భారతీయ సంఘాలకు రియాద్‌లోని భారత రాయబార కార్యాలయం ధన్యవాదాలు తెలిపింది.

## 2 సార్లు ల్యాండింగ్ విఫలం.. ప్రయాణికుల్లో భయాందోళన

**జనంసాక్షి:**కొలంబియాలోని ఓ విమానానికి అనూహ్య పరిస్థితి ఎదురైంది. పర్వత శిఖరాల్లో ఉన్న విమానాశ్రయం వద్ద ల్యాండింగ్ సమయంలో వాతావరణం అనుకూలించకపోవడంతో రెండుసార్లు అంతరాయం ఏర్పడింది. దీంతో ప్రయాణికులు తీవ్ర భయాందోళనకు గురయ్యారు. పైలట్ అప్రమత్తతతో విమానానికి ప్రమాదం తప్పింది. ఇందుకు సంబంధించిన వీడియో సామాజిక మాధ్యమాల్లో వైరల్‌గా మారింది.ఈ విమానం కొలంబియాలోని బొగోటా నుంచి పాస్టోలోని విమానాశ్రయానికి బయలుదేరింది. ఈ ఎయిర్‌పోర్టు సముద్ర మట్టానికి దాదాపు 6 వేల అడుగుల ఎత్తులో ఉంది. దట్టమైన పొగమంచు, బలమైన గాలులు వీయడంతో పైలట్ తొలుత విమానాన్ని ల్యాండింగ్ చేయడానికి ప్రయత్నించి విఫలమయ్యారు. రెండోసారి ప్రయత్నించినా కుదరలేదు. దీంతో అందులోని ప్రయాణికులు ఒక్కసారిగా ఆందోళనలకు గురయ్యారు. భయంతో కొందరు అరవడం, మరికొందరు ఏడవడం, ఇంకొందరు ప్రార్థనలు చేశారు. ఇందుకు సంబంధించిన వీడియో సామాజిక మాధ్యమాల్లో వైరల్‌గా మారింది.ల్యాండింగ్‌కు అనుకూలంగా లేకపోవడంతో పైలట్ మరో ప్రయత్నం చేయకుండా విమానాన్ని తిరిగి బొగోటాకు మళ్లించాడు. దీంతో ప్రయాణికులు ఊపిరి పీల్చుకున్నారు. వాతావరణం కుదుటపడ్డాక విమానం ఎట్టకేలకు పాస్టోలోని ఎయిర్‌పోర్టుకు చేరుకుంది. ఈ ఘటనపై సదరు విమానయాన సంస్థ స్పందించింది. ప్రతికూల వాతావరణం కారణంగానే ఇలా జరిగిందని పేర్కొంది. క్లిష్ట పరిస్థితుల్లో పైలట్ సరైన నిర్ణయం తీసుకున్నారని అభినందించింది.



# విమాన సర్వీసులు తగ్గుతున్నాయ్




### ప్రకటించిన ఎయిరిండియా, ఎయిరిండియా ఎక్స్‌ప్రెస్, ఇండిగో ఇంధన ధరల భారమే కారణం

దేశీయ మార్గాల్లో విమాన సర్వీసుల సంఖ్య తాత్కాలికంగా తగ్గనుంది. రాబోయే వారాల్లో సర్వీసుల సంఖ్యలో 10-22% కోత విధిస్తున్నట్లు ఎయిరిండియా - ఎయిరిండియా ఎక్స్‌ప్రెస్, ఇండిగో సంస్థలు ప్రకటించాయి. వేసవి సెలవులు ముగిసి, గిరాకీ తగ్గడానికి తోడు, విమాన ఇంధన (ఏటీఎఫ్) ధర పెరగడం ఇందుకు కారణంగా సంస్థలు పేర్కొన్నాయి. ఎయిరిండియా.. జూన్ - జులై నెలలకు తమ దేశీయ విమాన సర్వీసుల్లో 20-22% కోత విధించింది. వివిధ దేశాలు తమ గగనతలంపై ఆంక్షలు విధించడానికి తోడు, ఏటీఎఫ్ ధర పెరుగుదలను కారణంగా చూపుతూ, అంతర్జాతీయ సర్వీసుల్లో 27% కోత విధిస్తున్నట్లు ఈనెల 13న ఎయిరిండియా ప్రకటించింది. ఇప్పుడు దేశీయ విమాన సర్వీసులనూ తగ్గించుకుంటోంది. ప్రస్తుతం వారానికి 4,400 విమాన సర్వీసులను ఎయిరిండియా నడుపుతోంది. ఇందులో 3,600 దేశీయ, 800 అంతర్జాతీయ సర్వీసులు ఉన్నాయి. 3,600 దేశీయ విమాన సర్వీసుల్లో 22% అంటే వారానికి 800 వరకు విమాన సర్వీసులు రద్దు కానున్నాయి. '2026 జూన్-ఆగస్టు మధ్య అంతర్జాతీయ సర్వీసుల్లో కొన్ని మార్పులను ఇప్పటికే ప్రకటించాం. ఇందుకు కొనసాగింపుగా దేశీయ మార్గాల్లో సర్వీసులను తాత్కాలికంగా కుదించామ'ని ఎయిరిండియా ప్రకటించింది. ఏటీఎఫ్ ధరలు స్థిరపడ్డాక ఈ సర్వీసులను మళ్లీ పునరుద్ధరిస్తామని కంపెనీ పేర్కొంది. ప్రయాణికులకు ప్రత్యామ్నాయాలు: దేశీయ మార్గాల్లో విమాన సర్వీసుల రద్దు వల్ల ఇబ్బంది పడే ప్రయాణికులకు, ప్రత్యామ్నాయ విమానాల్లో టికెట్లు, ఉచితంగా ప్రయాణ తేదీ మార్చుకునే అవకాశం కల్పిస్తామని లేదా టికెట్ డబ్బును పూర్తిగా రిఫండ్ చేస్తామని ఎయిరిండియా తెలిపింది.

**ఇండిగో:**దేశంలో అతిపెద్ద విమానయాన సంస్థ ఇండిగో, సెప్టెంబరు త్రైమాసికానికి 12-15% దేశీయ సర్వీసులను తగ్గించనుంది. ప్రస్తుతం ఈ కంపెనీ వారానికి 15,400 విమాన సర్వీసులు నడుపుతోంది. ఇందులో 13,000 దేశీయ సర్వీసులే ఉన్నాయి. 15% కోత వల్ల వారానికి దాదాపు 2,000 విమాన సర్వీసులు తగ్గనున్నాయి. ప్రతి సంవత్సరం

**ఎయిరిండియా ఎక్స్‌ప్రెస్..:**జూన్ మధ్య నుంచి ఆగస్టు వరకు డిమాండ్ తగ్గడం వల్ల చేసే సీజనల్ మార్పుల్లో భాగంగానే ఈ నిర్ణయం తీసుకున్నట్లు ఇండిగో తెలిపింది. జూన్‌లో 10% సర్వీసులను రద్దు చేయనుంది. సంస్థ వారానికి నడిపే 3,000 విమాన సర్వీసుల్లో.. దాదాపు 2,400 దేశీయ సర్వీసులే ఉన్నాయి. 10% కోత అంటే దాదాపు 240 విమాన సర్వీసులు రద్దు కానున్నాయి.

#### ఛార్జీలు ఇంకా పెరుగుతాయా?

వేసవి సెలవులు ముగిసి, విద్యాసంస్థలు ప్రారంభమయ్యే జూన్‌లోనూ విమాన టికెట్లకు గిరాకీ ఉంటుంది. ఏటీఎఫ్ ధరల వల్ల, ఇప్పటికే విమాన టికెట్ల ధరలు ఎక్కువగా ఉన్నాయి. ఇప్పుడు సర్వీసులు తగ్గుతున్నందున, సంబంధిత మార్గాల్లో నడుస్తున్న విమానాల్లోల టికెట్ల ధరలు ఇంకా పెరుగుతాయనే ఆందోళన వ్యక్తమవుతోంది. అయితే కంపెనీలు మాత్రం గిరాకీ తగ్గుతుంది

## కాజీపేటలో త్వరలో ఇంటర్ సిటీ రైళ్ల తయారీ

రానున్న ఐదేళ్లలో ఈ యూనిట్ 200 ఇంటర్‌సిటీ రైళ్లను తయారు చేస్తుందన్నారు. వీటిని దేశవ్యాప్తంగా స్వల్ప దూర ప్రయాణాల కోసం వినియోగించనున్నట్లు రైల్వే మంత్రి తెలిపారు."కొత్తగా అందుబాటులోకి వచ్చే ఇంటర్ సిటీ రైళ్లు ఆటోమేటిక్ డోర్ క్లోజింగ్, మెరుగైన వెంటిలేషన్‌తో రూపొందుతాయి. ప్రతి రైలులో 20 కోచ్‌లు ఉంటాయి. వీటిలో సురక్షితమైన కోచ్ డిజైన్, ఆధునిక సౌకర్యాలు అమర్చుతాం. ఈ రైళ్లు గంటకు 130 కి.మీ వేగంతో ప్రయాణించేలా రూపొందిస్తాం. వీటిలో రీజనరేటివ్ బ్రేకింగ్ కూడా ఉంటుంది. రైలు బ్రేకులు వేసినప్పుడు అది విద్యుత్ జనరేటర్‌గా మారి, పునరుత్పత్తి అయిన విద్యుత్‌ను తిరిగి గ్రిడ్‌లోకి పంపే అధునాతన పరిజ్ఞానంతో తయారు చేస్తున్నాం" అని అశ్వినీ వైష్ణవ్ పేర్కొన్నారు.



జనంసాక్షి
www.janamsakshi.org
శుక్రవారం
29 మే 2026

# జూన్ 2నే అపాయింట్‌మెంట్ డేట్ ప్రకటించాలి

- ఆర్టీసీ విలీనంపై యూనియన్ ఎన్నికల ముందు చర్యలు తీసుకోవాలి
- వేం నరేందర్ రెడ్డి, రఘురాం రెడ్డిలకు జేఏసీ విజ్ఞప్తి
- కార్మికుల హక్కులు కాపాడాలని డిమాండ్



**ముషీరాబాద్, మే 28 (జనంసాక్షి):** ఆర్టీసీ విలీనంపై జరుగుతున్న పరిణామాల నేపథ్యంలో యూనియన్ ఎన్నికల ముందుగానే జూన్ 2న విలీనం కోసం అపాయింట్ డేట్ ప్రకటించే విధంగా ప్రత్యేక చర్యలు తీసుకోవాలని ముఖ్యమంత్రి ప్రధాన సలహాదారులు, రాజ్యసభ సభ్యులు వేం నరేందర్ రెడ్డి, ఖమ్మం పార్లమెంటు సభ్యులు రఘురాం రెడ్డిలను టీజీఎస్ ఆర్టీసీ జేఏసీ నాయకులు విజ్ఞప్తి చేశారు. ఈ మేరకు గురువారం ఆర్టీసీ జేఏసీ చైర్మన్ ఈదురు వెంకన్న, వైస్ చైర్మన్ థామస్ రెడ్డి, కో కన్వీనర్ యాదగిరి, బాబు, బుద్ధ విశాల్, రవికిరణ్ తదితరులు వారిని కలిసి వినతిపత్రం అందించారు. రిటైర్డ్ ఉద్యోగుల బకాయిలను చెల్లించడానికి ప్రభుత్వం తగిన నిధులను విడుదల చేయాలని, విలీనంపై పలు అంశాలను పొందుపరిచిన వినతిపత్రం సమర్పించారు.
ఈ సందర్భంగా వేం నరేందర్ రెడ్డి మాట్లాడుతూ ఆర్టీసీ ఉద్యోగులను ప్రభుత్వంలో విలీనం చేసి కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన మాటను తప్పకుండా నిలబెట్టుకుంటుందని స్పష్టత ఇచ్చారు. జూన్ 2న అపాయింట్‌మెంట్ డేట్ ప్రకటన విలీన విధి విధానాల కోసం అధికారులు, కార్మిక సంఘాలతో కమిటీ వేసి విలీనం సక్రమంగా జరిగేందుకు ముఖ్యమంత్రి దృష్టికి తీసుకెళ్తానని హామీ ఇచ్చారు. ఆంధ్రలో ఆర్టీసీ ఉద్యోగులకు జరిగిన నష్టం తెలంగాణ ఆర్టీసీ ఉద్యోగులకు జరగకుండా కార్మిక సంఘాలు, అధికారులు తగు జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. విలీనంతో ఆర్టీసీ కార్మికులకు మేలు చేయాలని ముఖ్యమంత్రి భావిస్తున్నారని, అందుకు సక్రమంగా సజావుగా విలీనం జరగడానికి తన వంతు ప్రయత్నం చేస్తానని హామీ ఇచ్చారు.

## యాచారంలో ఉరి వేసుకొని 22 ఏళ్ల మహిళ మృతి

**యాచారం, మే 28(జనం సాక్షి) :** యాచారం పోలీస్ స్టేషన్ పరిధిలోని ఎర్రగొల్ల తండాలో ఒక విషాదకర ఘటన చోటుచేసుకుంది. తండాకు చెందిన శివాని వయస్సు 22 అనే మహిళ తన నివాసంలో మృతి చెందింది. స్థానికులు మరియు పోలీసుల కథనం ప్రకారం, శివాని ఆత్మహత్యకు పాల్పడినట్లు ప్రాథమిక సమాచారం. సమాచారం అందుకున్న యాచారం పోలీసులు వెంటనే సంఘటనా స్థలానికి చేరుకుని మృతదేహాన్ని స్వాధీనం చేసుకున్నారు. అనంతరం శవపంచనామా నిర్వహించి, పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాన్ని ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. శివాని ఈ నిర్ణయం తీసుకోవడానికి గల ఖచ్చితమైన కారణాలు ఇంకా తెలియాల్సి ఉంది. కుటుంబ కలహాలు లేదా ఇతర వ్యక్తిగత కారణాల వల్ల ఈ ఘటన జరిగిందా అనే కోణంలో పోలీసులు విచారణ జరుపుతున్నారు. మృతురాలి కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు యాచారం పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

## జిహెచ్ఎంసి ఎన్నికల్లో కలిసికట్టుగా పనిచేయాలి



**రాజేంద్రనగర్, మే28(జనంసాక్షి) :** రానున్న జిహెచ్ఎంసి ఎన్నికల్లో పార్టీ విజయం లక్ష్యంగా ప్రతి నాయకుడు, కార్యకర్త కలిసికట్టుగా పని చేయాలని ఎమ్మెల్యే ప్రకాశ్ గౌడ్ పేర్కొన్నారు. గురువారం మైలార్‌దేవ్‌పల్లి నివాసంలో కాటేదన్, మైలార్‌దేవ్‌పల్లి డివిజన్‌ల నాయకులు, మహిళా నాయకురాళ్లతో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ప్రతి బూత్ స్థాయిలో సభ్యులను గుర్తించి బూత్ కమిటీలను బలోపేతం చేయాలని సూచించారు. రానున్న ఎన్నికల్లో పార్టీ అభ్యర్థుల గెలుపు కోసం అంకితభావంతో పనిచేయాలని, పార్టీ కోసం కష్టపడిన వారికి భవిష్యత్తులో తగిన గుర్తింపు, మంచి అవకాశాలు ఉంటాయని ఎమ్మెల్యే హామీ ఇచ్చారు. ఈ సమావేశంలో మైలార్ దేవ్ పల్లి డివిజన్ ప్రెసిడెంట్ ధనుంజయ, సోమ శ్రీనివాస్ గుప్తా, ప్రేమ్ గౌడ్, వెంకటేష్ పలువురు సీనియర్ నాయకులు, మహిళా నాయకురాళ్లు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## ధాన్యం తరలింపులో అధికారులు అప్రమత్తంగా ఉండాలి

**ఎమ్మెల్యే బుయ్యని మనోహర్ రెడ్డి**

**యాలాల మే 28 (జనంసాక్షి) :** యాలాల్ పర్యటనలో భాగంగా తాండూర్ ఎమ్మెల్యే బుయ్యని మనోహర్ రెడ్డి స్థానిక నాయకులతో మాట్లాడి ధాన్యం కొనుగోలుపై ఆరా తీశారు.అనంతరం జిల్లా అధికారులతో, మిల్లర్లతో, ట్రాన్స్పోర్ట్ వారితో ఫోన్ లో మాట్లాడుతూ తాండూర్ నియోజకవర్గంలో స్టాక్ పాయింట్స్ పూర్తిగా ధాన్యంతో భర్తీ అవ్వడంతో ప్రత్యామ్నాయంగా ఇతర ప్రాంతాల్లో స్టాక్ పాయింట్స్ గుర్తించడంతో తాండూర్ ప్రాంతంలో గల ధాన్యంను ఇతర స్టాక్ పాయింట్స్ కు తరిలించే విధంగా పూర్తి ఏర్పాట్లు చేసి రైతులకు ఇబ్బందులు రాకుండా నాయకులు, అధికారులు సమన్వయంతో పని చేయాలని సూచించారు.



## సేకరించిన ధాన్యం ఎప్పటికప్పుడు తరలించాలి

**అదనపు కలెక్టర్ గడ్డం నగేష్**

వేములవాడ రూరల్, మే 28 (జనంసాక్షి): రైతుల నుంచి సేకరించిన ధాన్యం ఎప్పటికప్పుడు మిల్లులు, గోదాములకు తరలించేలా చర్యలు తీసుకోవాలని, సంబంధిత ట్రాన్స్ పోర్ట్ కాంట్రాక్టర్లు ధాన్యం తరలించేందుకు సరిపడా వాహనాలు సమకూర్చాలని అదనపు కలెక్టర్ గడ్డం నగేష్ ఆదేశించారు. వేములవాడ రూరల్ మండలం వట్టెంల, ఫాజుల్ నగర్ గ్రామాల్లోని ధాన్యం కొనుగోలు కేంద్రాలను గురువారం ఆయన తనిఖీ చేసి, కొనుగోలు కేంద్రాల నిర్వాహకులకు పలు సూచనలు చేశారు. కొనుగోలు కేంద్రాల్లో రైతుల నుంచి సేకరించిన ధాన్యానికి సంబంధించి ఆన్ లైన్ ట్యాబ్ ఎంట్రీ ఎప్పటికప్పుడు పూర్తి చేయాలన్నారు. కొనుగోలు కేంద్రాల్లో రైతులు తీసుకువచ్చిన ధాన్యాన్ని త్వరగా తూకం వేసి తరలించాలని, రైతులకు క్షేత్ర స్థాయిలో ఇబ్బందులు తలెత్తకుండా చూడాలని ఆదేశించారు. వర్షం కారణంగా తడిసిన ధాన్యం విషయంలో రైతులు అధైర్యపడకుండా ధాన్యం సేకరిస్తామని భరోసా కల్పించాలని సూచించారు. రైతులు ఆందోళన చెందకుండా అవగాహన కల్పించాలని స్పష్టం చేశారు. తూకం వేసిన ధాన్యం లోడింగ్ చేయడం కోసం హమాలీల సంఖ్య పెంచుకుని కొనుగోళ్ల ప్రక్రియ త్వరితగతిన పూర్తయ్యేలా చూడాలని ఆదేశించారు.

### అకాల వర్షాలకు తడిసిన ధాన్యం..

# వేగంగా మిల్లులకు తరలింపు

- రైతుల ప్రయోజనాలకు కలెక్టర్ చొరవ
- 1,064 టన్నుల ధాన్యం భద్రపరచిన జిల్లా యంత్రాంగం
- కొనుగోలు, చెల్లింపులు సజావుగా
- భవిష్యత్ వర్షాలకు ముందస్తు జాగ్రత్తలు



**కామారెడ్డి, మే 28 (జనంసాక్షి):** కామారెడ్డి జిల్లాలో ఈ నెల 27వ తేదీ తెల్లవారుజామున కురిసిన అకాల వర్షాల కారణంగా రామారెడ్డి, దోమకొండ, సదాశివనగర్, మాచారెడ్డి మండలాల్లోని కొన్ని ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో (పీపీసీ) తడిసిన ధాన్యం నిల్వలను జిల్లా యంత్రాంగం వేగంగా మిల్లులకు తరలించి భద్రపరిచింది. జిల్లా కలెక్టర్ ఆశిష్ సాంగ్వాన్ ప్రత్యక్ష పర్యవేక్షణలో తీసుకున్న చర్యలపై రైతులు సంతృప్తి వ్యక్తం చేశారు.
సుమారు 1,064 మెట్రిక్ టన్నుల ధాన్యం వర్ష ప్రభావానికి గురైన సందర్భంగా కలెక్టర్ పరిస్థితిని సమీక్షించి సంబంధిత శాఖల అధికారులకు తక్షణ ఆదేశాలు జారీ చేశారు. తహసీల్దార్లు, సివిల్ సప్లైస్ అధికారులు, డీఆర్డీవోలు, డీసీవోలు, పీపీసీ ఇన్‌చార్జీలు, ఫీల్డ్ స్థాయి సిబ్బంది వెంటనే కొనుగోలు కేంద్రాలకు చేరుకుని చర్యలు చేపట్టారు. ప్రభావితమైన ధాన్యాన్ని సమీపంలోని పార్‌బాయిల్డ్ రైస్ మిల్లులకు తరలించి భద్రపరిచారు. ధాన్యం మరింత దెబ్బతినకుండా ఉండేందుకు రవాణా, అన్‌లోడింగ్, నిరంతర పర్యవేక్షణ ఏర్పాట్లు యుద్ధ ప్రాతిపదికన నిర్వహించారు.
వాతావరణ హెచ్చరికలు, మరిన్ని వర్షాల అవకాశాల దృష్ట్యా అన్ని ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో ముందస్తు జాగ్రత్త చర్యలు చేపట్టాలని జిల్లా కలెక్టర్ అధికారులను ఆదేశించారు. జిల్లా యంత్రాంగం పరిస్థితిని నిరంతరం పర్యవేక్షిస్తూ అవసరమైన చర్యలు తీసుకోవడం జరుగుతోందని కలెక్టర్ తెలిపారు. ఇప్పటివరకు జిల్లాలో మొత్తం 3,82,760 మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని కొనుగోలు చేయగా, దాని విలువ రూ.914.41 కోట్లుగా నమోదైంది. ఇందులో 3,27,996 మెట్రిక్ టన్నుల ధాన్యానికి సంబంధించి రూ.783.57 కోట్ల చెల్లింపులు రైతుల ఖాతాల్లో జమ చేయడం జరిగింది. మొత్తం చెల్లింపుల శాతం 86 శాతానికి చేరుకుందన్నారు. రైతుల ప్రయోజనాల పరిరక్షణకు, అలాగే అన్ని కొనుగోలు కేంద్రాల్లో ధాన్యం కొనుగోలు, రవాణా, చెల్లింపుల ప్రక్రియలను సజావుగా కొనసాగించేందుకు జిల్లా యంత్రాంగం అహర్నిశలు పర్యవేక్షిస్తోందని కలెక్టర్ తెలిపారు.

# రైతుల పొలాల్లో మట్టి, రాళ్లు డంపింగ్

- కాంట్రాక్టర్లపై చర్య తీసుకోవాలి : భూ నిర్వాసితుల సంఘం జిల్లా గౌరవ అధ్యక్షులు జి.వెంకటరామిరెడ్డి



**మక్తల్, మే 28 (జనంసాక్షి) :** మక్తల్ నారాయణపేట కొడంగల్ ఎత్తిపోతల పథకంలో భాగంగా చేపట్టిన పనుల్లో కాంట్రాక్టర్లు రైతులను నిర్లక్ష్యం చేస్తూ పంట పొలాల్లో దౌర్జన్యంగా కాలువల్లో తవ్విన మట్టిని రాళ్లను డంప్ చేస్తూన్నారని భూ నిర్వాసితుల సంఘం జిల్లా గౌరవ అధ్యక్షులు జి.వెంకటరామిరెడ్డి ఆరోపించారు. మక్తల్ మండలం కాచువార్ లోని రైతులు నిర్వాసితుల సంఘం దృష్టికి తీసుకొచ్చినందున కాంట్రాక్టర్లు చేస్తున్న పనులను పంట పొలాలను భూ నిర్వాసితుల సంఘం బృందం జిల్లా నాయకులు పరిశీలించారు. అనంతరం వారు మాట్లాడుతూ మఖ్తల్ నారాయణపేట కొడంగల్ ఎత్తిపోతల పథకంలో చేపట్టిన పనుల్లో తీసిన రాళ్లు, మొరాన్ని కాంట్రాక్టర్లు భూసేకరణలో భాగంగా 20 మీటర్ల పరిధిలో కాలువ పనులు నిర్వహించాల్సి ఉండగా, కాంట్రాక్టర్లు పక్కలనే ఉన్నటువంటి రైతుల భూములను అదనంగా 15 మీటర్ల దాకా ఆక్రమించారు. దీంతో దిగువకు వర్షపు నీరు వెళ్లకుండా నీరు ఆగిపోయింది. వెంకటయ్య గౌడ్, ప్రమీలమ్మ, వడ్డే శివరాములు సంబంధించిన ఆరు ఎకరాల భూమిలో రైతులకు ఎలాంటి సమాచారం ఇవ్వకుండా కాలువల్లో తీసిన రాళ్లను, మట్టిని రైతుల పొలాల్లో వేయడం జరుగుతుందని తెలిపారు. కాంట్రాక్టర్ల దౌర్జన్యం నిర్లక్ష్యం కారణంగా సాయి రెడ్డి, వెంకటేశ్వరమ్మ, గోపాల్ రెడ్డి, అంజప్ప, మహేందర్, బాలప్ప లు సుమారు 15 ఎకరాల తమ పంట పొలాల్లో పంటలు వేయలేని పరిస్థితి ఏర్పడిందన్నారు. తక్షణమే కాంట్రాక్టర్ పై జిల్లా అధికారులు చర్య తీసుకుని రైతులకు న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. నిర్లక్ష్యంతో కాంట్రాక్టర్లు వ్యవహరించి రైతుల సహనాన్ని పరీక్షించవద్దని హెచ్చరించారు రైతులకు న్యాయం చేయకపోతే కాంట్రాక్టర్లకు వ్యతిరేకంగా ఆందోళన చేయాల్సిన పరిస్థితి వేస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో గోవింద్ రాజ్, చింతలి అంజప్పలు తదితరులు పాల్గొన్నారు.

# ఐకేపీ కొనుగోలు కేంద్రాన్ని సందర్శించిన బీజేపీ నేత

- ధాన్యం కొనుగోలులో జాప్యం, రైతులు ఇబ్బందులు
- తూకంలో కోతలు విధిస్తున్నారని విమర్శ
- రైతుల సమస్యలపై ఆర్డీఓతో ఫోన్‌లో చర్చ

**కథలాపూర్, మే 28 (జనంసాక్షి):** తాండ్రియాల గ్రామంలోని ఐకేపీ ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని బీజేపీ రాష్ట్ర అధికార ప్రతినిధి, వేములవాడ నియోజకవర్గ ఇన్‌చార్జి డాక్టర్ చెన్నమనేని వికాస్ గురువారం సందర్శించారు. ఈ సందర్భంగా కొనుగోలు కేంద్రంలో రైతులతో మాట్లాడి వారి సమస్యలను తెలుసుకున్నారు. ధాన్యం కొనుగోలులో తీవ్ర జాప్యం జరుగుతోందని, ప్రభుత్వం నిర్లక్ష్య ధోరణితో వ్యవహరిస్తోందని డాక్టర్ వికాస్ విమర్శించారు. కొనుగోలు కేంద్రాల్లో రైతులు రోజుల తరబడి ఎదురుచూడాల్సి వస్తోందని, సరైన సౌకర్యాలు లేక ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. ధాన్యం తూకాల్లో కోతలు విధిస్తూ రైతులను నష్టపరుస్తున్నారని ఆరోపించారు. ముఖ్యంగా 42 కిలోల బదులు 43 కిలోలు తూకం వేస్తున్నారని రైతులు ఆవేదన వ్యక్తం చేయడంతో, డాక్టర్ చెన్నమనేని వికాస్ వెంటనే స్థానిక ఆర్డీఓ జీవాకర్‌తో ఫోన్‌లో మాట్లాడారు. రైతులను తూకంలో మోసం చేస్తున్నారని, వర్షాలు పడితే ధాన్యం తడిసి రైతులు నష్టపోయే ప్రమాదం ఉందని ఆయన ఆర్డీఓ దృష్టికి తీసుకెళ్లారు. దీనిపై స్పందించిన ఆర్డీఓ జీవాకర్, ఎలాంటి కోతలు లేకుండా నిబంధనల ప్రకారం తూకం వేయాలని అధికారులకు ఆదేశిస్తామని తెలిపారు. అలాగే పెండింగ్‌లో ఉన్న ధాన్యాన్ని వెంటనే లారీల ద్వారా తరలించి కొనుగోలు ప్రక్రియను త్వరితగతిన పూర్తి చేయిస్తామని హామీ ఇచ్చారు. రైతులు కష్టపడి పండించిన పంటకు సరైన గౌరవం, సమయానికి చెల్లింపులు అందేలా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని డాక్టర్ చెన్నమనేని వికాస్ డిమాండ్ చేశారు. కొనుగోలు ప్రక్రియ పారదర్శకంగా నిర్వహించాలని కోరారు. ఈ కార్యక్రమంలో బీజేపీ నాయకులు మండల అధ్యక్షుడు మల్యాల మారుతి, జిల్లా ఉపాధ్యక్షుడు రాచమడుగు వెంకటేశ్వరావు, జిల్లా ప్రధాన కార్యదర్శి సిరికొండ శ్రీనివాస్, జిల్లా కిసాన్ మోర్చ అధ్యక్షుడు కోడిపల్లి గోపాల్ రెడ్డి, సీనియర్ నాయకులు బద్రి సత్యం, నాయకులు ప్రతాప్ రెడ్డి, రవి, ప్రతాప్, మహేష్, శ్రీకర్ తదితరులు పాల్గొన్నారు. రైతులు, గ్రామస్తులు కూడా ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.



## ఆశా వర్కర్ల సమస్యలు పరిష్కరిస్తాం

**మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్**

**ధర్మపురి జగిత్యాల జిల్లా మే 28 (జనం సాక్షి):** రాష్ట్రంలోని ఆశ వర్కర్ల సమస్యల పరిష్కారానికి రాష్ట్ర ప్రభుత్వం కృషి చేస్తుందని రాష్ట్ర సాంఘీక సంక్షేమ శాఖ మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్ అన్నారు. జగిత్యాల జిల్లా హకు చెందిన పలువురు ఆశ వర్కర్లు గురువారం ధర్మపురి లోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో మంత్రి అడ్లూరిని కలిసి వినతి పత్రం అందజేశారు.
ఈ సందర్భంగా మంత్రి అడ్లూరి మాట్లాడుతూ ఆశ వర్కర్ల న్యాయమైన సమస్యల పరిష్కారానికి రాష్ట్ర ముఖ్యమంత్రి శ్రీ రేవంత్ రెడ్డి సుముఖంగా ఉన్నారని మంత్రి తెలిపారు. దశలవారీగా ఆశ వర్కర్ల సమస్యలు పరిష్కరిస్తామని ఈ సందర్భంగా మంత్రి ఆశ వర్కర్లకు హామీ ఇచ్చారు.

### రాజకీయాలలో విప్లవాత్మకమైన మార్పులను

# తీసుకొచ్చి మహోన్నత వ్యక్తి ఎన్టీఆర్

- మండల వ్యవస్థ, సంక్షేమ పాలనకు నాంది
- పేదల కష్టాలు తీర్చిన మహానాయకుడు : సింగిరెడ్డి మురళీధర్ రెడ్డి
- యువత ఎన్టీఆర్ ఆశయాలను స్ఫూర్తిగా తీసుకోవాలి



**హయత్ నగర్, మే 28 (జనం సాక్షి) :** విశ్వవిఖ్యాత, నటసార్వభౌమ, తెలుగు ప్రజల ఆరాధ్య దైవం తెలుగుదేశం పార్టీ వ్యవస్థాపకులు ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ మాజీ ముఖ్యమంత్రి స్వర్గీయ నందమూరి తారక రామారావు జయంతి సందర్భంగా హయత్ నగర్ లో తెలుగు యువత మాజీ అధికార ప్రతినిధి, మల్కాజ్గిరి పార్లమెంట్ నియోజకవర్గ అడక్ కమిటీ సభ్యులు సింగిరెడ్డి మురళీధర్ రెడ్డి ఆధ్వర్యంలో ఆయన చిత్రపటానికి పూలమాల వేసి, ఘనంగా నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా మురళీధర్ రెడ్డి మాట్లాడుతూ తెలుగు ప్రజల అభ్యున్నతి కోసం తెలుగుదేశం పార్టీని స్థాపించి, ఓటర్ల లో రాజకీయ చైతన్యాన్ని తీసుకువచ్చిన మహోన్నత వ్యక్తి ఎన్టీఆర్ అని అన్నారు. తెలుగు రాజకీయాలలో విప్లవాత్మకమైన మార్పులను తీసుకొచ్చి, మండల వ్యవస్థను ఏర్పాటు చేసి పరిపాలన గ్రామస్థాయికు వరకు తీసుకొచ్చిన పాలనాదక్షుడు ఎన్టీఆర్. ఆయన రాజకీయ ఉద్దండలను మట్టి కరిపించి, రాజకీయాలలో నూతన ఒరవడిని సృష్టించి, ఎందరో యువ నాయకులను తయారుచేసిన వ్యక్తి ఎన్టీఆర్.
పేద ప్రజల అభ్యున్నతి కోసం "కూడు, గూడు, గుడ్డ," సంక్షేమం అనే నినాదంతో సౌకర్యాలను కల్పించి, ప్రజల మనసుల్లో చెరగని ముద్ర వేసుకున్నారు. వారి ఆశయాలను స్ఫూర్తిగా తీసుకొని నేటి యువత ముందుకు వెళ్లాలని పిలుపునిచ్చారు. తెలుగు ప్రజలకు వారు చేసిన సేవలను సేవలను గుర్తుచేస్తూ కొనియాడారు. ఈ కార్యక్రమంలో హయత్ నగర్ డివిజన్ అధ్యక్షులు మరాటి బిక్షపతి, మన్సూరాబాద్ డివిజన్ అధ్యక్షులు దుర్గం మల్లేష్ యాదవ్, సీనియర్ నాయకులు శ్రీనివాస్ గౌడ్, జనగా మహేందర్ కుమార్ యాదవ్, జనార్దన్, రమేష్ గౌడ్, వినోద్ నాయక్, సాహిత్ కొమ్మర్ల, కోటేష్, విజయ్ గౌడ్, సంతోష్ సాగర్, బాలస్వామి, నాయకులు, ఎన్టీఆర్ అభిమానులు తదితరులు పాల్గొన్నారు.

## తెలంగాణ ఆత్మగౌరవాన్ని తక్కువ చేస్తే క్షమించేది లేదు

- బక్కని నరసింహులు వ్యాఖ్యలపై తీవ్ర విమర్శలు
- 'తెలంగాణ' పదం డిక్షనరీలో లేదంటే అజ్ఞానం
- చారిత్రక ఆధారాలతో సయ్యద్ కలాం పాషా సవాలు
- బానిస మనస్తత్వం వీడాలని హెచ్చరిక

**అమర్‌చింత, మే 28 (జనంసాక్షి):** తెలంగాణ ఆత్మగౌరవాన్ని తక్కువ చేసి మాట్లాడిన తెలంగాణ పదం డిక్షనరీలో లేదన్న వ్యాఖ్యలను తెలుగుదేశం పార్టీ సీనియర్ నాయకులు, మాజీ ఎమ్మెల్యే బక్కని నరసింహులు వెంటనే ఉపసంహరించుకోవాలని తెలంగాణ ఉద్యమకారుడు సయ్యద్ కలాం పాష డిమాండ్ చేశారు. తెలంగాణ సమాజం మిమ్మల్ని క్షమించదని హెచ్చరించారు. ఈ మేరకు గురువారం ఆయన విడుదల చేసిన ప్రకటనలో తెలంగాణ అనే పదం డిక్షనరీలో లేదని, అదొక కృత్రిమ ఉద్వేగం అని చేసిన అజ్ఞానపు వ్యాఖ్యలను తీవ్రంగా ఖండించారు. తెలంగాణ అనేది నిన్న మొన్న పుట్టిన పదం కాదని, శతాబ్దాల చరిత్ర కలిగిన సజీవ సాంస్కృతిక అస్తిత్వమని స్పష్టం చేశారు.

**చారిత్రక ఆధారాలు సమర్పించిన కలాం పాషా**

తెలంగాణ చరిత్ర గురించి బక్కని నరసింహులు మరలేసే ఓపిక లేకపోవడం బాధాకరమని వ్యాఖ్యానించారు. హిస్టరీ బుక్స్ చదవని అజ్ఞానుల కోసం కొన్ని గట్టి చారిత్రక ఆధారాలు ఇచ్చారు. క్రీ.శ. 14వ శతాబ్దానికి చెందిన తెల్లాపూర్ శాసనంలోనే 'తెలంగాణ' అనే పదం స్పష్టంగా లిఖించబడిందని, వెలిచర్ల శాసనంలో (క్రీ.శ. 1510) గజపతి రాజులను ఓడించిన సందర్భంలో ప్రతాపరుద్రుడు 'తెలంగాణ కర్ణాటక సురత్రాణ' అని సంబోధించబడ్డాడని తెలిపారు.
14వ శతాబ్దంలోనే మహోపాధ్యాయ విద్యానాథుడు తన 'ప్రతాపరుద్ర యశోభూషణం'లో ఈ ప్రాంతాన్ని 'తిలింగ దేశం' అని స్పష్టంగా పేర్కొన్నాడని, నన్నయ కాలం నాటికే 'త్రిలింగ' శబ్దం వాడుకలో ఉందని వివరించారు. మొఘల్, కుతుబ్‌షాహీ కాలపు చరిత్రలో కూడా 'తెలంగాణ' అనే పదం స్పష్టంగా వాడబడిందని గుర్తు చేశారు. సొంత గడ్డను అవమానిస్తున్న పరాయి నాయకుడికి వంతపాడుతున్న తెలంగాణ తమ్ముళ్లారా... ఇప్పటికైనా ఆ బానిస మనస్తత్వాన్ని వీడండి అని సయ్యద్ కలాం పాష తీవ్రంగా విమర్శించారు. తెలంగాణ ఆత్మగౌరవాన్ని తక్కువ చేసి మాట్లాడితే ఈ సమాజం మిమ్మల్ని క్షమించదని హెచ్చరించారు.

### ప్రభుత్వం కొనుగోలు చేయలేక...

# ప్రైవేటు దళారులకు అమ్ముకుంటున్న రైతులు


- వడ్లు కొనుగోలు కేంద్రాన్ని సందర్శించిన బిఆర్ఎస్ పార్టీ ఇంచార్జి



**మల్దకల్ మే 28 (జనంసాక్షి) :** మండల కేంద్రంలో కురిసిన అకాల వర్షానికి తడిసి,మొలకెత్తిన ధాన్యాన్ని (వడ్ల)ను కేంద్రాన్ని గురువారం బిఆర్ ఎస్ నాయకులతో కలిసి, బాసు హనుమంతు నాయుడు పరిశీలించి,రైతుల సమస్యలను అడిగి తెలుసుకున్నారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూరైతులు ఎన్నో ఆశలతో తమ పంటను కొనుగోలు కేంద్రాలకు తీసుకొస్తే అక్కడ రోజుల తరబడి పంటను రోడ్లపైనే పడేసే పరిస్థితి ఏర్పడిందని ఆవేదన వ్యక్తం చేశారు.ఇక ఇదే సమయంలో అకాల వర్షాలు కురవడంతో కొనుగోలు కేంద్రాల వద్ద పేరుకుపోయిన వడ్లు పూర్తిగా తడిసిమొలకెత్తాయని,రైతులు తీవ్ర నష్టాల్లో కూరుకుపోయారని తెలిపారు.కష్టపడి పండించిన పంట కళ్లముందే నాశనం అవుతుంటే కాంగ్రెస్ ప్రభుత్వం మాత్రం చోద్యం చూస్తూ రైతుల జీవితాలతో ఆడుకుంటోందని తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. పండించిన ధాన్యాన్ని కొనుగోలు కేంద్రాలకు తెస్తే గన్నిబ్యాగులు,హమాలి,లారీలు లేక రోజులు తరబడి కేంద్రాల్లో రైతులు పడికాపులు కాసే పరిస్థితి ఏర్పడిందని ఆగ్రహం వ్యక్తం చేశారు.రైతులు ఎదుర్కొంటున్న దారుణ పరిస్థితులకు కాంగ్రెస్ ప్రభుత్వమే పూర్తి బాధ్యత వహించాలని ఆయన డిమాండ్ చేశారు.గత 25 రోజుల నుంచి వడ్లను కొనుగోలు కేంద్రంలో ఉంచిన, మోసపూరిత కాంగ్రెస్ ప్రభుత్వం కొనుగోలు చేయకపోవడంతో కర్ణాటక రాష్ట్రం రాయచూర్ రైస్ మిల్ ప్రైవేట్ దళారులకు రైతులు వడ్లుఅమ్ముకుంటున్నారు.రాష్ట్ర కాంగ్రెస్ ప్రభుత్వం సకాలంలో వడ్లు కొనుగోలు చేయకపోవడంతో అకాల వర్షానికి రైతులు తీవ్ర నష్టపోయారని ఆరోపించారు. అకాల వర్షానికి తడిసి, మొలకెత్తిన వడ్ల రైతులను కాంగ్రెస్ ప్రభుత్వం ఆదుకోవాలి అని డిమాండ్ చేశారు.రైతులకు బోనస్ కూడా ఇస్తామని చెప్పి మోసం చేసిందని ఆయన విమర్శించారు.ఈ కార్యక్రమంలో సీనియర్ నాయకులు పటేల్ జనార్దన్ రెడ్డి, శేఖర్ నాయుడు,చక్రధర్ రెడ్డి,వెంకటేష్ నాయుడు,తిమ్మప్ప గౌడ్, రాముడు, పూదూరు రఘునాయుడు, రమేష్, డ్యామ్ శ్రీను, రాము, వినయ్, తిమ్మప్పహరి కృష్ణ, మధు, మోహన్, భాస్కర్, నాగరాజు, కృష్ణ, రాజు, మహేష్, పార్టీ నాయకులు, కార్యకర్తలు, రైతులు పాల్గొన్నారు.

# హాక్ విత్తనాలు, ఎరువుల దుకాణం ప్రారంభించిన ఎమ్మెల్యే

- యువకులు స్వయం ఉపాధి వైపు మొగ్గు చూపాలి
- రైతులకు నాణ్యమైన విత్తనాలు, ఎరువులు అందుబాటులో
- బక్రీద్ సందర్భంగా మత సామరస్యం పాటించాలి
- ప్రజలందరూ కలిసికట్టుగా ముందుకు సాగాలి



**వనపర్తి బ్యూరో మే 28 జనంసాక్షి :** వనపర్తి పట్టణంలోని అంబేద్కర్ కూడలి సమీపంలో 6వ వార్డుకు చెందిన యువకుడు కురుమూర్తి ఏర్పాటు చేసుకున్న హాక్ విత్తనాలు, ఎరువుల దుకాణాన్ని గురువారం వనపర్తి శాసనసభ్యులు తూడి మేఘారెడ్డి, జిల్లా అధ్యక్షులు శివసేనరెడ్డి ప్రారంభించారు. వ్యాపార ధోరణిలో అన్నదాతలకు అధిక ధరలకు కాకుండా వారి అవసరానికి తగ్గట్టుగా అన్ని విత్తనాలు, ఎరువులు, మందులను అందుబాటులో ఉంచి ఇబ్బందులు రాకుండా చూసుకోవాలని యువకుడు కురుమూర్తికి వారు సూచించారు. యువకులు ఉద్యోగం కోసం ప్రయత్నిస్తూనే ఉపాధి అవకాశాలపై దృష్టి సారించి ఇలాంటి వాటిని ఏర్పాటు చేసుకుంటే భవిష్యత్తు బాగుంటుందని వారు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో వనపర్తి మున్సిపల్ చైర్మన్ మాధవి రమేష్, వనపర్తి వ్యవసాయ మార్కెట్ యార్డ్ అధ్యక్షులు శ్రీనివాస్ గౌడ్, వనపర్తి ఎంపీపీ కిచ్చారెడ్డి, కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు, పట్టణ కౌన్సిలర్లు తదితరులు పాల్గొన్నారు.

**త్యాగం, ప్రేమ, సహనం, సేవాభావానికి ప్రతీక బక్రీద్**

బక్రీద్ పండుగ సందర్భంగా గురువారం వనపర్తి శాసనసభ్యులు తూడి మేఘారెడ్డి గోపాలపేట రోడ్డులో ఉన్న ఈద్గా వద్ద ముస్లిం సోదరులకు పండుగ శుభాకాంక్షలు తెలియజేశారు. త్యాగం, ప్రేమ, సహనం, సేవాభావానికి ప్రతీకగా నిలిచే ఈ పవిత్ర పండుగ బక్రీద్ అని ఎమ్మెల్యే పేర్కొన్నారు. సమాజంలో సౌభ్రాతృత్వాన్ని మరింత బలోపేతం చేయాలని, మత సామరస్యం, పరస్పర గౌరవం మన సమాజానికి బలమైన పునాది అని ఎమ్మెల్యే అన్నారు. ప్రజలందరూ కలిసికట్టుగా శాంతి, అభివృద్ధి మార్గంలో ముందుకు సాగాలన్నారు.
ఈ కార్యక్రమంలో వనపర్తి మున్సిపల్ చైర్మన్ మాధవి రమేష్, వైస్ చైర్మన్ మధుసూదన్ గౌడ్, వనపర్తి మార్కెట్ యార్డ్ అధ్యక్షులు శ్రీనివాస్ గౌడ్, జిల్లా ఎస్పీ సునీత రెడ్డి, కాంగ్రెస్ పార్టీ పట్టణ అధ్యక్షులు కదిరె రాములు, జిల్లా యూత్ అధ్యక్షులు వాకిటి ఆదిత్య, వనపర్తి పట్టణ కౌన్సిలర్లు, మాజీ కౌన్సిలర్లు, కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

# అర్హులైన ప్రతి ఓటరు పేరు జాబితాలో ఉండేలా కృషి చేయాలి

- టిపిసిసి ప్రధాన కార్యదర్శి దుద్దిల్ల శ్రీను బాబు



మంథని, (జనంసాక్షి) : అర్హులైన ప్రతి ఓటరు పేరు జాబితాలో ఉండేలా పార్టీ శ్రేణులు కృషి చేయాలని టిపిసిసి ప్రధాన కార్యదర్శి దుద్దిల్ల శ్రీను బాబు పిలుపునిచ్చారు. కేంద్ర ఎన్నికల సంఘం తెలంగాణ రాష్ట్రంలో చేపడుతున్న ఓటరు జాబితా ప్రక్షాళనకు సంబంధించిన సర్ (స్పెషల్ ఇంటెన్స్ రివిజన్) నేపథ్యంలో కాంగ్రెస్ పార్టీ శ్రేణులు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. గురువారం పెద్దపల్లి జిల్లా మంథని పట్టణంలోని నృసింహ శివ కిరణ్ గార్డెన్స్‌లో నిర్వహించిన కాంగ్రెస్ పార్టీ మంథని నియోజకవర్గం విస్తృత స్థాయి సమావేశంలో టీపీసీసీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి దుద్దిల్ల శ్రీను బాబు పాల్గొన్నారు. ఈ సమావేశంలో పార్టీ బలోపేతం, రాబోయే పార్టీ కార్యక్రమాలు, గ్రామ స్థాయి నుండి పార్టీ నిర్మాణాన్ని మరింత బలపర్చే అంశాలపై నాయకులు, కార్యకర్తలతో విస్తృతంగా చర్చించారు. అలాగే మంథని నియోజకవర్గ బూత్ లెవల్ ఏజెంట్లు పార్టీ తరఫున నిర్వహించనున్న సర్ ప్రక్రియ విధి విధానాలపై ప్రత్యేక సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా బిఎల్ఎ బాధ్యతలు, ఓటరు జాబితా పరిశీలన, కొత్త ఓటర్ల నమోదు, అర్హులైన ప్రతి ఒక్కరి పేరును ఓటరు జాబితాలో చేర్చడం, తప్పుల సవరణ, డూప్లికేట్, అనర్హ ఓట్ల గుర్తింపు వంటి కీలక అంశాలపై సమగ్ర అవగాహన కల్పించారు. అదే విధంగా ఓటరు జాబితా సవరణ ప్రక్రియ, కొత్త ఓటర్ల నమోదు, మార్పులు – చేర్పులు, తొలగింపులపై తీసుకోవాల్సిన జాగ్రత్తలు, ఇంటింటి పరిశీలన సమయంలో బిఎల్ఏలు పాటించాల్సిన విధానాలపై చర్చించారు. ప్రతి అర్హుడైన ఓటరు పేరు ఓటరు జాబితాలో ఉండేలా కృషి చేయాలని, సర్ ప్రక్రియలో పార్టీ శ్రేణులు సమన్వయంతో పనిచేయాలని దుద్దిల్ల శ్రీను బాబు సూచించారు. ప్రజలకు అవగాహన కల్పిస్తూ, ఓటరు నమోదు ప్రక్రియను సులభతరం చేయడంలో బియల్ఏలు కీలక పాత్ర పోషించాలని ఆయన కోరారు. అలాగే సర్ ప్రక్రియను సమర్థవంతంగా నిర్వహించేందుకు పార్టీ నాయకులు, కార్యకర్తలు సమిష్టిగా పని చేయాలని పిలుపునిచ్చారు. మంథని నియోజకవర్గ అభివృద్ధి, ప్రజా సమస్యల పరిష్కారం, కాంగ్రెస్ పార్టీ సిద్ధాంతాలను ప్రజల్లోకి తీసుకెళ్లడంపై ప్రత్యేక దృష్టి సారించాలని దుద్దిల్ల శ్రీను బాబు పేర్కొన్నారు.

## ఎలక్ట్రాన్ మీడియా విలేకరిపై పెట్టిన
# కేసును వెనక్కి తీసుకోవాలి

రాజన్న సిరిసిల్ల జిల్లా ప్రతినిధి మే 28 (జనంసాక్షి) : వేములవాడ శ్రీ రాజరాజేశ్వర స్వామి అనుబంధ ఆలయమైన శ్రీ భీమేశ్వర స్వామి ఆలయంలో పనిచేస్తున్న ఉద్యోగిపై విధులకు ఆటంకం కల్పించారని, వేములవాడ బ్రాహ్మణ సంఘం నాయకులు,ఎలక్ట్రానిక్ మీడియా సీనియర్ విలేకరి బుడంగారి మహేష్ పై తప్పుడు కేసు పెట్టడాన్ని శ్రీ రాజరాజేశ్వర బ్రాహ్మణ నిత్యాన్న సత్రం, బ్రాహ్మణ సేవా సంఘం, ఆలయ అనువంశిక అర్చక ట్రస్ట్ తరఫున తీవ్రంగా ఖండిస్తూనమని గురువారం ఒక ప్రకటన విడుదల చేశారు.ఆలయ ఉన్నతాధికారులు తమ కింది స్థాయి ఉద్యోగులతో, ఆలయ ఉద్యోగ సంఘం నాయకులతో కావాలని ఉద్దేశపూర్వకంగా తప్పుడు కేసులు పెట్టించడం భావ్యం కాదన్నారు. సమాజంలో అన్ని వర్గాల శ్రేయస్సును,లోకం మొత్తం సుభిక్షంగా ఉండాలని అనునిత్యం భావించే,తమ వర్గానికి చెందిన వ్యక్తి గౌరవ ప్రతిష్టలకు భంగం కలిగించేలా ఉందన్నారు.గతంలో సైతం ఆలయ ఉన్నతాధికారులు ఆలయంలో పనిచేసే అర్చకులను,వేద పండితులను కూడ ప్రతిరోజు ఇబ్బందులకు గురి చేయడం, తనకు వ్యతిరేకంగా మాట్లాడిన వారిపై కక్షకట్టడం,భీమన్న దర్శనానికి వచ్చే అనువంశిక అర్చక కుటుంబాలను సైతం దర్శనం చేసుకుని ఇవ్వకుండా, సూటిపోటి మాటలతో వేధించడం ఆమెకు నిరంతర ప్రక్రియగా మారిందన్నారు. ఇప్పటికైనా ఆలయ ఉన్నతాధికారులు తన పద్ధతిని మార్చుకొని, మహేష్‌పై పెట్టిన కేసును ఉపసంహ రించుకోవాలని, లేనిపక్షంలో తమ సంఘం ప్రత్యక్ష కార్యాచరణకు పాల్పడుతుందన్నారు.



# "ఆవు"ను జాతీయ జంతువుగా ప్రకటించాలి

### ముస్లిం మత పెద్దల వినూత్న నిరసన

సిరిసిల్ల టౌన్ మే 28 (జనం సాక్షి) సిరిసిల్లలో బక్రీద్ పండుగ వేడుకలు వైభవంగా కొనసాగాయి. ఈద్గాలో శాంతియుత వాతావరణంలో ముస్లింలు ప్రార్థనలు చేసి అలాయి బలాయి తీసుకుని పండుగ శుభాకాంక్షలు ఒకరినొకరు తెలుపుకున్నారు. అనంతరం సిరిసిల్లలో మజీద్ కమిటీ ఆధ్వర్యంలో వినూత్నంగా ముస్లిం మత పెద్దలు ప్లకార్డులు ప్రదర్శిస్తూ "ఆవు"ను జాతీయ జంతువుగా కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు ప్రకటించాలని డిమాండ్ చేశారు. దేశంలో ఆవు పేరిట అనేక దాడులు జరుగుతున్న నేపథ్యంలో ఎవరు ఆవులు బలి ఇవ్వవద్దని పిలుపునిచ్చారు. ఆవును జాతీయ జంతువుగా ప్రకటిస్తేనే అమ్మడం కానీ, కొనడం కానీ నేరంగా పరిగణించబడుతుందని, జాతీయ పక్షి నెమలికి ఉన్న గౌరవం హోదా ఆవుకు కూడా కల్పించాలని ఆవును జాతీయ జంతువుగా గుర్తించి కేంద్ర ప్రభుత్వం ప్రత్యేకంగా ప్రకటన చేయాలని వారు కోరారు. మతసామరస్యానికి ప్రతీకగా సాగిన ఈ కార్యక్రమం స్థానికంగా చర్చనీయాంశమైంది.

# చివరి గింజ వరకూ కొంటాం రైతులు ఆందోళన చెందవద్దు

- వాహనాలు, హమాలీల కొరత వల్ల కొంత ఇబ్బంది కలుగుతుంది.
- రైతులకు భరోసా కల్పించిన సుడా చైర్మన్ కోమటిరెడ్డి నరేందర్ రెడ్డి



కరీంనగర్ బ్యూరో, మే 28 (జనంసాక్షి) : వరి ధాన్యం చివరి గింజ వరకూ కొంటామని రైతులు ఆందోళన చెందాల్సిన అవసరం లేదని సుడా చైర్మన్ కోమటిరెడ్డి నరేందర్ రెడ్డి స్పష్టం చేశారు. కరీంనగర్ మండలం నగునూర్ వద్ద కొనుగోలు కేంద్రాన్ని సందర్శించి రైతులతో మాట్లాడి అక్కడినుండే అధికారులతో మాట్లాడి ప్రత్యేక గోదాంలను కేటాయించే విధంగా సూచనలు ఇచ్చారు. ఈ సందర్భంగా రైతులతో నరేందర్ రెడ్డి మాట్లాడుతూ... కాంగ్రెస్ ప్రభుత్వం రైతు పక్షపాతి అని ఎవ్వరూ ఆందోళన చెందవద్దని చివరి గింజవరకూ కొనుగోలు చేస్తామని వారంలోగా సెంటర్ ఎత్తి వేస్తామని అకాల వర్షాలు పడ్డా రైతులు ఆందోళన చెందవద్దని భరోసా కల్పించారు. వాహనాల కొరత, హమాలీల కొరత వల్ల అక్కడక్కడ కొంత ఇబ్బంది ఏర్పడిందని అయినప్పటికీ రైతుకు ఎటువంటి నష్టం కలుగనీయమని నరేందర్ రెడ్డి తెలిపారు. ఈ కార్యక్రమం లో సుడా చైర్మన్ వెంట పెంచాల లక్ష్మణ్ రావు, ఉప సర్పంచ్ హన్మంత రావు, సెంటర్ ఇంచార్జి అజయ్, అశోక్ రెడ్డి, కృష్ణా రెడ్డి, సాయిల్ల రాజు, శేఖర్ తదితరులు ఉన్నారు.

# కరీంనగర్ రేకుర్తి ఈద్గాలో ఘనంగా బక్రీద్ ప్రార్థనలు

### ముస్లిం సోదరులకు బక్రీద్ శుభాకాంక్షలు తెలిపిన పోలీస్ కమిషనర్ గౌస్ ఆలం



కరీంనగర్ బ్యూరో, మే 28 (జనంసాక్షి) : త్యాగానికి, భక్తికి ప్రతీకగా నిలిచే ముస్లింల పవిత్ర పండుగ 'బక్రీద్' (ఈద్-ఉల్-అజ్హా) వేడుకలు కరీంనగర్ నగరంలో అత్యంత భక్తిశ్రద్ధలతో, ఘనంగా జరిగాయి. ఈ సందర్భంగా స్థానిక రేకుర్తిలోని ప్రధాన ఈద్గా వద్ద గురువారం ఉదయం జరిగిన పవిత్ర ప్రత్యేక ప్రార్థనల్లో కరీంనగర్ పోలీస్ కమిషనర్ గౌష్ ఆలం పాల్గొన్నారు. ఈద్గాకు చేరుకున్న పోలీస్ కమిషనర్‌కు ముస్లిం మత పెద్దలు, ఈద్గా కమిటీ సభ్యులు ఘన స్వాగతం పలికారు. ప్రార్థనల అనంతరం సీపీ గౌష్ ఆలం ముస్లిం సోదరులందరికీ ఆలింగనం చేసుకుని, బక్రీద్ పండుగ శుభాకాంక్షలు తెలిపారు. ఈ పండుగ సమాజంలో శాంతి, సోదరభావం, కరుణను మరింత పెంపొందించాలని ఆయన ఆకాంక్షించారు. నగరంలో పండుగ వేడుకలు ప్రశాంత వాతావరణంలో జరిగేలా శాంతిభద్రతల పరిరక్షణకు పోలీస్ శాఖ తరఫున అన్ని ముందస్తు ఏర్పాట్లు చేసినట్లు ఆయన పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న పోలీస్ కమిషనర్ గౌష్ ఆలం కి, ఈద్గా వద్ద విధుల్లో ఉన్న ట్రైనీ ఐపిఎస్ సోహం సునీల్, అడిషనల్ డీసీపీ వెంకటరమణ, రూరల్ ఏసీపీ విజయ కుమార్, కొత్తపల్లి ఇన్స్పెక్టర్ బిల్లా కోటేశ్వర్, ఇతర పోలీస్ అధికారులు, సిబ్బంది ప్రత్యేకంగా బక్రీద్ పండుగ శుభాకాంక్షలు తెలిపారు. సీపీ విధుల్లో ఉన్న సిబ్బందిని అభినందిస్తూ, వారికి పండుగ శుభాకాంక్షలు తెలిపారు. నగరంలో ఎక్కడా ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా భద్రతా చర్యలు పకడ్బందీగా నిర్వహించిన అధికారులను ఆయన అభినందించారు.

# బక్రీద్ పండుగ త్యాగం, ప్రేమ, సోదరభావానికి ప్రతీక

### ముస్లిం సోదరులతో బక్రీద్ వేడుకల్లో పాల్గొన్న ఎమ్మెల్యే ఎంఎస్ రాజ్‌ఠాకూర్



గోదావరిఖని, జనంసాక్షి: రామగుండం నియోజకవర్గంలో బక్రీద్ పండుగ వేడుకలు ఘనంగా నిర్వహించబడ్డాయి. గురువారం శారదనగర్‌లోని రామగుండం ఫ్లోరింక్లయిన్ ఈద్గా వద్ద జరిగిన ప్రత్యేక ప్రార్థనలు, మతపరమైన కార్యక్రమాల్లో రామగుండం ఎమ్మెల్యే ఎంఎస్ రాజ్‌ఠాకూర్ పాల్గొని ముస్లిం సోదరులకు హృదయపూర్వక బక్రీద్ శుభాకాంక్షలు తెలిపారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే రాజ్ ఠాకూర్ మాట్లాడుతూ బక్రీద్ పండుగ అనేది త్యాగం, ప్రేమ, మానవత్వం, సోదరభావానికి ప్రతీక అని పేర్కొన్నారు. సమాజంలో ఐక్యత, పరస్పర గౌరవం, శాంతి సామరస్యాలు మరింత బలపడాలని ఆకాంక్షించారు.రాష్ట్ర ప్రభుత్వం అన్ని వర్గాల ప్రజల సంక్షేమమే ధ్యేయంగా ముందుకు సాగుతోందని తెలిపారు.ముఖ్యంగా పేదలు, రైతులు, మహిళలు, యువత అభివృద్ధికి అనేక సంక్షేమ పథకాలు అమలు చేస్తున్నట్లు వెల్లడించారు. రామగుండం నియోజకవర్గ అభివృద్ధే తన ప్రధాన లక్ష్యమని స్పష్టం చేస్తూ, రోడ్లు, డ్రైనేజీలు, తాగునీటి సదుపాయాలు, కాలనీల అభివృద్ధి వంటి పలు అభివృద్ధి కార్యక్రమాలు వేగంగా కొనసాగుతున్నాయని అన్నారు. ప్రజల సమస్యల పరిష్కారానికి ఎల్లప్పుడూ అందుబాటులో ఉంటానని హామీ ఇచ్చారు. రాష్ట్రంలో శాంతి, సామరస్య వాతావరణం నెలకొని ప్రజలంతా సుఖసంతోషాలతో జీవించాలని ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు.ఈ కార్యక్రమంలో ప్రజాప్రతినిధులు, ముస్లిం మత పెద్దలు, కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు, ముస్లిం సోదరులు పాల్గొని వేడుకలను ఘనంగా నిర్వహించారు.

# సమాజంలో అట్టడుగున ఉన్న వ్యక్తి కూడా అభివృద్ధి చెందాలి

### శిక్షణ తరగతుల్లో అర్బన్ ఎమ్మెల్యే ధన్ పాల్




నిజామాబాద్ అర్బన్ మే 28 జనం సాక్షి :
ఇందూరు: సమాజంలో అట్టడుగున ఉన్న వ్యక్తి కూడా అభివృద్ధి చెందాలన్నదే పండిత్ దీన్ దయాళ్ ఉపాధ్యాయ లక్ష్యమని, అదే దిశగా బీజేపీ పని చేస్తుందని అర్బన్ ఎమ్మెల్యే ధన్ పాల్ సూర్యనారాయణ తెలిపారు. జిల్లా ప్రశిక్షణా తరగతులు గురువారం నగరంలోని బోర్గాం లో గల ఫంక్షన్ హాల్ లో ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. భారతదేశము ఒక భౌగోళిక ప్రాంతమే కాదని.. వేల సంవత్సరాల సంస్కృతి, సంప్రదాయాల విలువల సమాహారం అన్నారు. వసుధైక కుటుంబంగా భావించే గొప్ప సంస్కృతి కలదన్నారు. ప్రధానంగా సబ్ కా సాథ్.. సబ్ కా వికాస్, సబ్ కా విశ్వాస్ అనే నినాదాలతో బీజేపీ ముందుకెళ్తుందన్నారు. కార్యకర్తలు నాయకులకు కూడా పార్టీ సూచించిన మార్గంలో ముందుకెళ్లాలని, శిక్షణా తరగతులను సద్వినియోగం చేసుకొని ప్రజలకు చేరువకావాలన్నారు. బీజేపీ అనుబంధ సంస్థలతో ఎప్పటికప్పుడు సమాలోచనలు జరుపుతూ ముందుకు సాగాలన్నారు. అన్ని సంస్థలతో సమన్వయంతో పని చేయాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. ప్రతి ఒక్కరు దీన్ దయాల్ ఉపాధ్యాయ చరిత్ర చదవాలని సూచించారు. ప్రధానంగా బిజెపి భావజాలాన్ని కేంద్ర పథకాలను సోషల్ మీడియా వేదికగా ప్రజల్లోకి తీసుకెళ్లాలన్నారు. రాష్ట్రంలో కాషాయ జెండా ఎగరేసే బాధ్యత అందరిపై ఉందని పేర్కొన్నారు. కార్యక్రమంలో బీజేపీ జిల్లా అధ్యక్షులు దినేష్ కులాచారి, పసుపు బోర్డు జాతీయ అధ్యక్షులు పల్లె గంగారెడ్డి, ఎంపీ ధర్మపురి అరవింద్, రాష్ట్ర కార్యదర్శి స్రవంతి రెడ్డి, రాష్ట్ర నాయకులు నాయుడు ప్రకాష్, మల్లికార్జున్, సీనియర్ నాయకులు భూపతి రెడ్డి, మండల అధ్యక్షులు, కార్పొరేటర్లు తదితరులు పాల్గొన్నారు.

# తెలంగాణను అవమానించే వ్యాఖ్యలు చేస్తే సహించం

- చంద్రబాబు వెంటనే బహిరంగ క్షమాపణ చెప్పాలి
- బీఆర్ఎస్వీ నేత కంచర్ల రవి గౌడ్



సిరిసిల్ల టౌన్ మే 28 (జనం సాక్షి) : మహానాడు వేదికగా తెలుగుదేశం పార్టీ మరోసారి తెలంగాణ ప్రజల ఆత్మగౌరవాన్ని అవమానించేలా మాట్లాడిందని బిఆర్ఎస్వి రాష్ట్ర నాయకులు కంచర్ల రవి గౌడ్ తీవ్రస్థాయిలో మండిపడ్డారు. గురువారం తెలంగాణ భవన్ లో నిర్వహించిన విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ "తెలంగాణ" అనే పదం డిక్షనరీలో లేదని, టిడిపి నాయకులు మాట్లాడడం వారి అహంకారానికి, తెలంగాణపై ఉన్న ద్వేషానికి నిదర్శనమని అన్నారు. తెలంగాణ రాష్ట్ర సాధన కోసం వేలాది మంది యువకులు ప్రాణ త్యాగాలు చేస్తే, ఇప్పుడు అదే తెలంగాణను అవమానించేలా మాట్లాడటం అత్యంత దారుణమని ఆగ్రహం వ్యక్తం చేశారు.జ తెలంగాణను ఎప్పుడూ చులకనగా చూసే చంద్రబాబు నాయుడు సంస్కృతి ఇప్పటికీ టిడిపి నాయకుల్లో కనిపిస్తోందన్నారు. తెలంగాణ ప్రజలు టిడిపిని రాజకీయంగా ఎప్పుడో బొంద పెట్టారని, అయినా ఇంకా బుద్ధి రాక తెలంగాణపై విషం కక్కడం సిగ్గుచేటని విమర్శించారు.
నర్సింలు చేసిన వ్యాఖ్యలు చంద్రబాబు డైరెక్షన్‌లోనే వచ్చాయని ఆరోపించిన రవి గౌడ్, తెలంగాణలో పుట్టి తెలంగాణ గడ్డపై పెరిగి ఆంధ్ర నాయకులను మెప్పించేందుకు మాట్లాడటం సిగ్గుమాలిన చర్య అని అన్నారు. తెలంగాణ ప్రజల మనోభావాలను కించపరిచేలా మాట్లాడిన ప్రతి ఒక్కరికి ప్రజలే తగిన బుద్ధి చెబుతారని హెచ్చరించారు. తెలంగాణను అవమానించే వ్యాఖ్యలపై చంద్రబాబు నాయుడు వెంటనే బహిరంగ క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. లేకపోతే తెలంగాణ వ్యాప్తంగా టిడిపి నాయకులను ఎక్కడికక్కడ ప్రజలు అడ్డుకుంటారని, బి.ఆర్.ఎస్.వి ఆధ్వర్యంలో భారీ స్థాయిలో నిరసనలు చేపడతామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో నాయకులు మట్టే శ్రీనివాస్,వినయ్ కుమార్,అల్లే గణేష్ ,మిట్టపల్లి రాజు, కిరణ్, రాజు, నవీన్ తదితరులు పాల్గొన్నారు.

# కలుషిత నీటితో కార్మిక కుటుంబాలు

- ఫిల్టర్‌బెడ్, పంప్‌హౌస్‌ను సందర్శించిన సీఐటీయూ బృందం
- రూ.2 కోట్లు విడుదల చేయాలని రాజారెడ్డి డిమాండ్

గోదావరిఖని, జనంసాక్షి: స్థానిక కార్మిక కాలనీల నుంచి నీరు బాగాలేదని, నీసువాసన వస్తుందని, తాగడానికి పనికిరావని ఫిర్యాదులు రావడంతో హుటాహుటిన సీఐటీయూ ఆర్‌జీ-1 బ్రాంచ్ కమిటీ ఆధ్వర్యంలో గ్రావిటీ ఫిల్టర్ బెడ్ నిర్మాణం పనులు పరిశీలించారు. గురువారం గంగానగర్‌లోని ఫిల్టర్‌బెడ్,గోదావరి దగ్గర ఉన్న పంప్‌హౌస్ సందర్శించారు. సిఐటియు పోరాటం వల్ల కాస్త మెరుగుగా ఉన్నా సరైన చర్యలు తీసుకోవాలని హెచ్చరించారు. ముఖ్యంగా ఫిల్టర్‌బెడ్‌లో ఇసుక ఇంకో ఇంచు వరకు తీసి కొత్త ఇసుక వేస్తే బాగుంటుందని సూచించారు.నూతన గ్రావిటీ ఫిల్టర్‌బెడ్ నిర్మాణం చివరి దశలో ఉందని, రూ.2 కోట్లు విడుదల చేసి స్టోరేజ్ ట్యాంక్ నిర్మించాలన్నారు. తుమ్మల రాజారెడ్డి వెంట ఆర్జీవన్ బ్రాంచ్ గౌరవ అధ్యక్షులు అరెపల్లి రాజమౌళి, అధ్యక్షులు వంగల శివరామ్‌రెడ్డి, వేణుగోపాల్ రెడ్డి, జెల్ల గజేంద్ర, అన్నబోయిన శంకర్, పెద్దపల్లి శశి కిరణ్, ఈదుల సాగర్, విప్రవ్, జంగపల్లి మల్లేష్, ఒద్నాల సాగర్, హరీష్ తదితరులున్నారు.

# చివరి గింజ వరకూ మద్దతు ధరతో ధాన్యం కొనుగోలు చేస్తాం

- రాష్ట్ర పౌర సరఫరాల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి
- వర్షాలకు తడిసిన ధాన్యాన్ని కూడా పూర్తి మద్దతు ధరతోనే కొనుగోలు
- ఇసుక రవాణా వాహనాలను ధాన్యం కొనుగోలుకు వినియోగించాలి
- డిఫాల్ట్ రైస్ మిల్లులు బకాయిలు చెల్లిస్తే ధాన్యం కేటాయింపు
- మే నెలాఖరులోగా యాసంగి కొనుగోళ్లు పూర్తి చేయాలి
- ధాన్యం కొనుగోలుపై సంబంధిత అధికారులతో రివ్యూ నిర్వహించిన మంత్రి



పెద్దపల్లి, మే 28 (జనంసాక్షి) : ప్రతి ధాన్యం కొనుగోలు కేంద్రంలో చివరి గింజ వరకు మద్దతు ధరతో ప్రభుత్వం కొనుగోలు రాష్ట్ర పౌర సరఫరాల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి హామీ ఇచ్చారు. గురువారం పెద్దపల్లి ఐడిఓసీలో నిర్వహించిన యాసంగి ధాన్యం కొనుగోళ్ల సమీక్ష సమావేశంలో పౌరసరఫరాల శాఖ మంత్రి ఉత్తంకుమార్ రెడ్డి మంత్రులు దుద్దిళ్ల శ్రీధర్ బాబు, పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి, అడ్లూరి లక్ష్మణ్ కుమార్, ప్రభుత్వ విప్ చింతకుంట విజయ రమణా రావు, పౌర సరఫరాల శాఖ కమిషనర్ స్టీఫెన్ రవీంద్ర పెద్దపల్లి జిల్లా కలెక్టర్ కోయ శ్రీహర్ష, భూపాలపల్లి కలెక్టర్ రాహుల్ శర్మ, రామగుండం ఎమ్మెల్యే మక్కన్ సింగ్ రాజ్ ఠాకూర్, భూపాలపల్లి ఎమ్మెల్యే గండ్ర వెంకటరమణారెడ్డిలతో కలిసి పాల్గొన్నారు.ఈ సందర్భంగా మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి మాట్లాడుతూ రాష్ట్రంలో యాసంగి ధాన్యం కొనుగోళ్లు గత ప్రభుత్వంతో పోలిస్తే 25 నుంచి 30 శాతం అధికంగా జరుగుతున్నాయని తెలిపారు.రాష్ట్ర వ్యాప్తంగా ఇప్పటివరకు 58 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని కొనుగోలు చేసి, 8 లక్షల మంది రైతులకు రూ.11 వేల కోట్లు చెల్లించినట్లు వెల్లడించారు. 15 నుంచి 17 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలు చేయాల్సి ఉందన్నారు.వర్షాలకు తడిసిన ధాన్యాన్ని కూడా ఎలాంటి కోతలు లేకుండా పూర్తి మద్దతు ధరతోనే కొనుగోలు చేసి బాయిలర్ మిల్లులకు తరలిస్తామని తెలిపారు. మిల్లర్లకు ఏవైనా నష్టాలు వచ్చినా ప్రభుత్వం భరిస్తుందని, రైతులకు మాత్రం నష్టం జరగనివ్వమన్నారు.రైతుల చివరి గింజ వరకూ ప్రభుత్వం కొనుగోలు చేస్తుందని స్పష్టం చేశారు. గతంలో డిఫాల్ట్ అయిన రైస్ మిల్లులు బకాయిలు, వడ్డీలు చెల్లిస్తే తిరిగి ధాన్యం కేటాయింపులు ఇస్తామని తెలిపారు. తెలంగాణ ప్రభుత్వం సుమారు 75 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని కొనుగోలు చేస్తుండగా, ఎఫ్‌సీఐ కేవలం 51 లక్షల మెట్రిక్ టన్నులకే పరిమితమైందన్నారు. ఎఫ్‌సీఐ కేటాయింపులకు మించి అదనంగా 25 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని రాష్ట్ర ప్రభుత్వం కొనుగోలు చేస్తోందని తెలిపారు.డిసెంబర్ 2023 తర్వాత కనీస మద్దతు ధర విధానాన్ని కచ్చితంగా అమలు చేస్తూ రైతులకు ఇప్పటివరకు అదనంగా రూ.16,479 కోట్లు చెల్లించినట్లు వెల్లడించారు. ప్రస్తుతం వర్షాల కారణంగా కేవలం 9 వేల మెట్రిక్ టన్నుల ధాన్యం మాత్రమే తడిసిందని, ఆ ధాన్యాన్ని కూడా పూర్తి మద్దతు ధరతో కొనుగోలు చేస్తున్నామని తెలిపారు.మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు మాట్లాడుతూ ధాన్యం కొనుగోళ్ల కోసం ప్రత్యేక కార్యాచరణ ప్రణాళిక అమలు చేస్తున్నామని తెలిపారు. రైతులను ఇబ్బంది పెట్టే మిల్లులపై కఠిన చర్యలు తీసుకోవాలని సూచించారు.పెద్దపల్లి కలెక్టర్ కోయ శ్రీహర్ష మాట్లాడుతూ జిల్లాలో యాసంగిలో 4 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం వచ్చే అవకాశం ఉందన్నారు.ఇప్పటివరకు రూ.788 కోట్ల విలువైన 3.32 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని కొనుగోలు చేసినట్లు తెలిపారు. జూన్ 5 నాటికి 100 శాతం కొనుగోళ్లు పూర్తి చేస్తామని వెల్లడించారు.ఆన్‌లైన్ ఎంట్రీలు, ట్రక్ షీట్ జనరేషన్, రైతుల చెల్లింపుల్లో పెద్దపల్లి జిల్లా రాష్ట్రంలోనే అగ్రస్థానంలో ఉందన్నారు. జిల్లాలో 6.9 లక్షల మెట్రిక్ టన్నుల మిల్లింగ్ సామర్థ్యం ఉండగా ప్రస్తుతం 5.7 లక్షల మెట్రిక్ టన్నులు వినియోగంలో ఉన్నాయని, ఇంకా 1.2 లక్షల మెట్రిక్ టన్నుల సామర్థ్యం అందుబాటులో ఉందన్నారు.మొక్కజొన్న కొనుగోళ్లు కూడా సమర్థవంతంగా కొనసాగుతున్నాయని, ఇప్పటివరకు 22 వేల మెట్రిక్ టన్నుల మొక్కజొన్న కొనుగోలు చేసి అవసరమైన నిల్వ సదుపాయాలు ఏర్పాటు చేసినట్లు తెలిపారు.
భూపాలపల్లి జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ మాట్లాడుతూ యాసంగి సీజన్ లో లక్షా 60 వేల మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలు లక్ష్యం కాగా ఇప్పటి వరకు 185 కొనుగోలు కేంద్రాల ద్వారా 65 వేలు మెట్రిక్ టన్నులు కొనుగోలు చేసినట్లు కలెక్టర్ తెలిపారు. భూపాలపల్లి జిల్లాకు సంబంధించి పెద్ద పల్లిలో 20 వేల వరంగల్ లో 20 వేల మెట్రిక్ టన్నుల, హన్మకొండ లో 10 వేల మెట్రిక్ టన్నులు మిల్లింగ్ కొరకు పౌరసరఫరాల శాఖ అలాట్మెంట్ చేసిందని తెలిపారు..ఈ సమావేశంలో రెవెన్యూ డివిజన్ అధికారులు బి గంగయ్య సురేష్ జిల్లా పౌరసరఫరాల శాఖ అధికారి శ్రీనాథ్ జిల్లా సహకార అధికారి శ్రీమాల,జిల్లా గ్రామీణ అభివృద్ధి అధికారిని కాలిందిని జిల్లా మార్కెటింగ్ అధికారి ప్రవీణ్ రెడ్డి సంబంధిత అధికారులు రైస్ మిల్లర్లు తదితరులు పాల్గొన్నారు

# తడిసిన ధాన్యాన్ని ప్రభుత్వ పరంగా కొనుగోలు చేస్తున్నాం

### రైతులు ఆందోళనకు గురి కావద్దు : కలెక్టర్ ఇలా త్రిపాఠి

నిజామాబాద్ జిల్లా ప్రతినిధి మే 27 జనం సాక్షి :
అకాల వర్షం వల్ల తడిసిన ధాన్యాన్ని మద్దతు ధర చెల్లిస్తూ ప్రభుత్వంపరంగా కొనుగోలు చేస్తామని, రైతులు ఎలాంటి ఆందోళనకు గురి కావద్దని శ్రీ కలెక్టర్ ఇలా త్రిపాఠి భరోసా కల్పించారు. కొనుగోలు కేంద్రాల ద్వారా రైతుల నుండి సేకరిస్తున్న తడిసిన ధాన్యాన్ని బాయిల్డ్ రైస్ మిల్లులకు తరలించే ప్రక్రియను వేగవంతం చేయాలని అధికారులను ఆదేశించామని అన్నారు.రాష్ట్ర సచివాలయం నుండి బుధవారం రాత్రి డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క, రాష్ట్ర పౌర సరఫరాల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి, ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి రామకృష్ణారావు తదితరులు వీడియో కాన్ఫరెన్స్ ద్వారా అన్ని జిల్లాల కలెక్టర్లు, ఎస్పీలతో సమీక్ష నిర్వహించారు. ఆకాల వర్షాల నేపథ్యంలో ఆయా జిల్లాల్లో ధాన్యం సేకరణను వేగవంతం చేసేందుకు చేపట్టాల్సిన చర్యలపై కలెక్టర్లకు స్పష్టమైన దిశా నిర్దేశం చేశారు. అధికారులు క్షేత్రస్థాయిలో ఉంటూ, ఎట్టి పరిస్థితుల్లోనూ రైతులకు ఇబ్బందులు తలెత్తకుండా చూడాలన్నారు.వీ.సీ అనంతరం కలెక్టర్ ఇలా త్రిపాఠి జిల్లా అధికారులతో సమావేశమై కీలక సూచనలు చేశారు. జిల్లాలో ఇప్పటికే ధాన్యం సేకరణ ప్రక్రియ ముగింపు దశకు చేరిందని అన్నారు. అయితే దిగుబడులు ఆలస్యంగా వచ్చిన చోట ధాన్యం సేకరణ కోసం ఇంకనూ సుమారు 120 వరకు కొనుగోలు కేంద్రాలను అందుబాటులో ఉంచామని తెలిపారు. అకాల వర్షం కురిసిన కారణంగా జిల్లాలో బషీరాబాద్, ఉప్లూర్ తదితర ప్రాంతాల్లో సుమారు 40 మెట్రిక్ టన్నుల వరకు ధాన్యం బస్తాలు తడిసినట్లు తమ దృష్టికి వచ్చిందని అన్నారు. ప్రభుత్వ ఆదేశాలకు అనుగుణంగా అధికారులను క్షేత్రస్థాయిలో పరిశీలన కోసం పంపడం జరిగిందని, తడిసిన ధాన్యాన్ని వేగవంతంగా బాయిల్డ్ రైస్ మిల్లులకు తరలించేలా చర్యలు తీసుకున్నామని తెలిపారు. తాను కూడా స్వయంగా మిల్లులను సందర్శించి, ధాన్యం తరలింపు, అన్ లోడింగ్ ప్రక్రియలను పరిశీలించాలని కలెక్టర్ వెల్లడించారు.
తడిసిన ధాన్యం విషయమై ఎలాంటి ఆందోళనకు గురి కావద్దని, ప్రభుత్వం కల్పించిన వెసులుబాటు మేరకు తడిసిన ధాన్యాన్ని సైతం కొనుగోలు చేయడం జరుగుతోందని ఈ సందర్భంగా కలెక్టర్ రైతులకు భరోసా కల్పించారు.రైతులకు ఎలాంటి ఇబ్బందులు కలుగకుండా ముందుగా తడిసిన ధాన్యాన్ని బాయిల్డ్ రైస్ మిల్లులకు తరలించేలా చర్యలు తీసుకోవాలని కలెక్టర్ అధికారులను ఆదేశించారు. వీడియో కాన్ఫరెన్స్ లో అదనపు డీసీపీ శుభం నగ్రాలే, సంబంధిత శాఖల అధికారులు పాల్గొన్నారు.

# కాంగ్రెస్ పార్టీ బలోపేతం కోసం కృషి చేయాలి : షబ్బీర్ అలీ



కామారెడ్డి ప్రతినిధి, మే 28 (జనంసాక్షి) :
కామారెడ్డి ప్రభుత్వ సలహాదారు మహమ్మద్ అలీ షబ్బీర్ చేతుల మీదుగా కాంగ్రెస్ పార్టీ ఎస్సీ సెల్ జిల్లా చైర్మన్‌గా భూమని బాలరాజ్ నియామక పత్రం అందుకోగా, ఎస్టీ సెల్ జిల్లా చైర్మన్‌గా రెడ్డి నాయక్ నియామక పత్రం అందుకున్నారు. ఈ సందర్భంగా మహమ్మద్ అలీ షబ్బీర్ గారు మాట్లాడుతూ, బడుగు బలహీన వర్గాలు, దళితులు, గిరిజనుల అభివృద్ధి కోసం కాంగ్రెస్ పార్టీ అహర్నిశలు కృషి చేస్తోందన్నారు.
పార్టీ బలోపేతం కోసం జిల్లా వ్యాప్తంగా తిరుగుతూ గిరిజనులు, దళితుల సమస్యలను తెలుసుకొని మండలాలు, గ్రామాల వారీగా అధ్యక్షులను నియమించుకుంటూ ప్రజలకు అండగా నిలవాలని సూచించారు. మీకు అప్పగించిన బాధ్యతలను సమర్థవంతంగా నిర్వహిస్తూ కాంగ్రెస్ పార్టీని మరింత పటిష్టం చేయాలని, ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకొని పార్టీకి మంచి పేరు తీసుకురావాలని కోరారు. అలాగే ఈ బాధ్యతలు అప్పగించిన టీపీసీసీ అధ్యక్షుడు మహేష్ కుమార్ గౌడ్ కు రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి, అలాగే కామారెడ్డి జిల్లాకు మంచి పేరు తీసుకురావాలని ఆకాంక్షించారు. ఎస్సీ సెల్ జిల్లా అధ్యక్ష బాధ్యతలు స్వీకరించిన వెంటనే భూమని బాలరాజ్ ఢిల్లీలో రాహుల్ గాంధీని కలిసి వారి సమక్షంలో ప్రసంగించే అవకాశం దక్కడం అభినందనీయమని షబ్బీర్ అలీ ప్రశంసించారు. ఈ సందర్భంగా నూతనంగా నియామక పత్రాలు అందుకున్న భూమని బాలరాజ్, రెడ్డి నాయక్‌లు మాట్లాడుతూ, తమపై నమ్మకం ఉంచి అవకాశం కల్పించిన మహమ్మద్ అలీ షబ్బీర్ కి ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. పార్టీ బలోపేతం కోసం కృషి చేస్తామని హామీ ఇచ్చి, షబ్బీర్ అలీ ఆశీర్వాదం తీసుకున్నారు.

# ప్రధాని కార్యాలయ పర్యవేక్షణలో నీట్

- పకడ్బందీ చర్యలకు దిగిన కేంద్రం

**న్యూఢిల్లీ, మే 28 (జనంసాక్షి) :** నీట్ పేపర్ లీక్ వ్యవహారం దేశవ్యాప్తంగా సంచలనం సృష్టించింది. దాంతో మే 3న జరిగిన ప్రవేశపరీక్ష రద్దు కావడంతో.. జూన్ 21 రీటెస్ట్ నిర్వహించేందుకు కేంద్ర విద్యాశాఖ నిర్ణయించిన సంగతి తెలిసిందే. ఈ నేపథ్యంలో మరోసారి ఎలాంటి లోపాలు తలెత్తకుండా కేంద్రం చర్యలు తీసుకుంటోంది. ఈసారి రీటెస్ట్ పక్రియను ప్రధానమంత్రి కార్యాలయం నిశితంగా పరిశీలిస్తున్నట్లు జాతీయ మీడియా కథనాలు వెల్లడించాయి. దిల్లీలోని తన నివాసంలో రక్షణశాఖ మంత్రి రాజ్‌నాథ్ సింగ్ ఉన్నతస్థాయి సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా నీట్ రీటెస్ట్ (ఔఇఇ÷-జఉ స।బి।బబి)లో ఎలాంటి అవకతవకలు జరగకుండా తీసుకోవాల్సిన చర్యలపై చర్చించారు. తాజాగా జరిగిన సమావేశంలో కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్, కేంద్రమంత్రి జ్యోతిరాదిత్య సింధియా, ఎన్టీఏ డైరెక్టర్ జనరల్ అభిషేక్ సింగ్, పీఎంఓ ఉన్నతాధికారులు పాల్గొన్నారు. పేపర్ తయారు చేయడం, ప్రింటింగ్, ట్రాన్స్‌పోర్టేషన్, పరీక్షా కేంద్రాలకు చేర్చడం వంటి ప్రతి పక్రియను ప్రధాన మంత్రి కార్యాలయం పర్యవేక్షించనుందని సంబంధిత వర్గాలు వెల్లడించాయి. ఈ పరీక్షకు సంబంధించి ప్రతి అప్‌డేట్‌ను మోదీ తెలుసుకుంటున్నారని పేర్కొన్నాయి. ఈ రీటెస్ట్‌కు దేశవ్యాప్తంగా 23 లక్షల మంది హాజరుకానున్నారు.

# జూన్ 4లోగా కొనుగోళ్లు పూర్తి చేయాలి

## గన్నీ సంచుల కొరత లేదు - ప్రతి గింజను కొనుగోలు చేస్తాం

- తడిసిన ధాన్యాన్ని కూడా కొనుగోలు చేసి గోదాములకు తరలిస్తున్నాం
- రాష్ట్ర పౌర సరఫరాలు, నీటిపారుదల శాఖ మంత్రి ఎన్. ఉత్తమ్ కుమార్ రెడ్డి




**హనుమకొండ ప్రతినిధి, మే 28 (జనంసాక్షి) :** ఉమ్మడి వరంగల్ జిల్లాకు సంబంధించిన ధాన్యం, మొక్కజొన్న కొనుగోలు ప్రక్రియను జూన్ 4వ తేదీలోగా పూర్తి చేయాలని రాష్ట్ర పౌర సరఫరాలు, నీటిపారుదల శాఖ మంత్రి ఎన్. ఉత్తమ్ కుమార్ రెడ్డి అధికారులను ఆదేశించారు.రైతులు పండించిన ప్రతి గింజను ప్రభుత్వం కొనుగోలు చేస్తుందని స్పష్టం చేశారు.గురువారం హనుమకొండ జిల్లా కలెక్టరేట్‌లోని కాన్ఫరెన్స్ హాల్‌లో ఉమ్మడి వరంగల్ జిల్లాలకు సంబంధించిన ధాన్యం కొనుగోలు అంశంపై రాష్ట్ర రెవెన్యూ, గృహ నిర్మాణ, సమాచార పౌర సంబంధాల శాఖ మంత్రి, ఉమ్మడి వరంగల్ జిల్లా ఇన్‌చార్జ్ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డితో కలిసి మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి సమీక్షా సమావేశం నిర్వహించారు.ఈ సమావేశంలో రాష్ట్ర ఫైనాన్ చైర్మన్ సిరిసిల్ల రాజయ్య, ఎమ్మెల్సీ బస్వరాజు సారయ్య, వరంగల్ పశ్చిమ శాసనసభ్యులు నాయిని రాజేందర్ రెడ్డి, స్టేషన్ ఘనపూర్ శాసనసభ్యులు కడియం శ్రీహరి, పరకాల శాసనసభ్యులు రేవూరి ప్రకాష్ రెడ్డి, భూపాలపల్లి శాసనసభ్యులు గండ్ర సత్యనారాయణ రావు, వర్ధన్నపేట శాసనసభ్యులు కె ఆర్ నాగరాజు, హుజురాబాద్ శాసనసభ్యులు పాడి కౌశిక్ రెడ్డి, కుడా చైర్మన్ ఇనగాల వెంకట్రామిరెడ్డి, రాష్ట్ర పౌర సరఫరాల కమిషనర్ స్టీఫెన్ రవీంద్ర, హన్మకొండ, వరంగల్, ములుగు, జనగామ జిల్లాల కలెక్టర్లు చాహాట్ బాజ్ పాయి, డాక్టర్ సత్య శారద, బొర్ఖడే హేమంత్ సహదేవ్ రావు, సందీప్ కుమార్ ఝా, డిసిపి ధార కవిత కలెక్టర్లు, అదనపు కలెక్టర్లు, సంబంధిత శాఖల అధికారులు పాల్గొన్నారు.ఈ సందర్భంగా ఉమ్మడి వరంగల్ జిల్లాలకు చెందిన కలెక్టర్లు ధాన్యం, మొక్కజొన్న కొనుగోలు, నిల్వ, రవాణా ప్రక్రియలపై మంత్రులకు వివరించారు.మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి మాట్లాడుతూ, రాష్ట్రంలోని పలు ఉమ్మడి జిల్లాల్లో ధాన్యం కొనుగోలు ప్రక్రియను వేగవంతం చేసేందుకు మంత్రులు పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి, దుద్దిళ్ల శ్రీధర్ బాబు తదితరులతో కలిసి సమీక్ష సమావేశాలు నిర్వహిస్తున్నామని తెలిపారు. రాష్ట్రంలో గన్నీ సంచుల కొరత లేదని స్పష్టం చేసిన మంత్రి, ఈ యాసంగి సీజన్‌కు అవసరమైన 24 కోట్ల గన్నీ సంచులను కొనుగోలు కేంద్రాల వద్ద సిద్ధంగా ఉంచినట్లు తెలిపారు. అవసరమైన ప్రాంతాలకు అదనపు గన్నీ సంచులను వెంటనే పంపిస్తున్నామని పేర్కొన్నారు. అకాల వర్షాలకు తడిసిన ధాన్యాన్ని కూడా కనీస మద్దతు ధరకు కొనుగోలు చేసి వెంటనే బాయిల్డ్ రైస్ మిల్లులకు తరలిస్తున్నామని తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వానికి సహకరించే రైస్ మిల్లర్లకు అదనపు బాయిల్డ్ రైస్ టార్గెట్ల కేటాయింపు చేస్తామని పేర్కొన్నారు.ఈ సందర్భంగా రాష్ట్ర రెవెన్యూ, గృహ నిర్మాణ, సమాచార పౌర సంబంధాల శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి మాట్లాడుతూ, ధాన్యం కొనుగోలు ప్రక్రియలో ఆర్డీవోలు, సివిల్ సప్లై అధికారులు, రవాణా, పోలీస్ శాఖలు సమన్వయంతో పనిచేయాలని సూచించారు. రైతులు పండించిన ఒక్క గింజ కూడా మిగలకుండా కొనుగోలు చేసే బాధ్యతను కలెక్టర్లు తీసుకోవాలని ఆదేశించారు.తాలు, తరుగు పేరుతో రైతులను ఇబ్బందులకు గురిచేసే రైస్ మిల్లర్లపై తహసీల్దార్లు, సంబంధిత అధికారులు కఠిన చర్యలు తీసుకోవాలని స్పష్టం చేశారు. జిల్లాల మధ్య గోదాముల కేటాయింపుల విషయంలో కలెక్టర్లు, పౌర సరఫరాల కమిషనర్ సమన్వయంతో ముందుకు సాగాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఉమ్మడి వరంగల్ జిల్లా సంబంధిత పలు శాఖల అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# ఉనికి కోసమే బీజేపీ నాయకుల యాత్ర

- ఎఫ్‌సీఐ ద్వారా ఎందుకు కొనరో చెప్పాలి
- బీజేపీ నేతలపై మండిపడ్డ మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్



**జగిత్యాల, మే 28 (జనంసాక్షి) :** ఉనికి కోసమే బీజేపీ నాయకుల రైతు భరోసా యాత్ర చేస్తున్నారని మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్ విమర్శించారు. ఎఫ్‌సీఐ ద్వారా ధాన్యాన్ని ఎందుకు కొనుగోలు చేయడం లేదో బీజేపీ నేతలు సమాధానం చెప్పాలని ప్రశ్నించారు. గురువారం జగిత్యాల జిల్లాలో మంత్రి అడ్లూరి పర్యటించి, పలు కార్యక్రమాల్లో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మీడియాతో మాట్లాడారు. తాలు పేరుతో దోచుకుంటు న్నామని బీజేపీ నాయకులు ఆరోపించడం సిగ్గుచేటని అన్నారు. బీజేపీ నాయకులకు చిత్తశుద్ధి ఉంటే భద్రాద్రి రాముడి ఆలయం ముందు మాట్లాడాలని మంత్రి అడ్లూరి సవాల్ చేశారు. రాష్ట్రంలో బీజేపీ నాయకత్వం సరిగా లేకే ప్రధానమంత్రి నరేంద్రమోదీ.. సీఎం రేవంత్‌రెడ్డితో కలసి పనిచేద్దామని అన్నారని ప్రస్తావించారు. కేంద్ర ప్రభుత్వం నుంచి రాష్ట్రానికి రావాల్సిన నిధులను తీసుకురా వడంలో కేంద్ర మంత్రులు విఫలమయ్యారని విమర్శించారు. గోదావరి పుష్కరాలకు కేంద్రం నుంచి బీజేపీ ఎంపీలు నిధులను తీసుకురావాలని మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్ సవాల్ చేశారు. ఇదిలావుంటే ముస్లింల సంక్షేమానికి కాంగ్రెస్ ప్రభుత్వం కట్టుబడి ఉందని సంక్షేమ శాఖ మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్ తెలిపారు. బక్రీద్ సందర్భంగా ధర్మపురిలోని ఈద్గా వద్ద నిర్వహించిన ప్రత్యేక ప్రార్థనల్లో మంత్రి పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పేద ముస్లింల సంక్షేమానికి రాష్ట్ర ప్రభుత్వం పలు పథకాలను అమలు చేస్తోందన్నారు. నియోజకవర్గంలో మసీదులు, ఈద్గాల అభివృద్ధికి రూ.7 కోట్లు కేటాయించినట్లు చెప్పారు. అదేవిధంగా ఎస్సీ సంక్షేమ శాఖ ద్వారా నిరుద్యోగ యువతీ యువకులు స్వయం ఉపాధి పొందడానికి ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నా మన్నారు. ధర్మపురి నియోజకవర్గంలో పదో తరగతి, ఇంటర్ పూర్తయిన యువతీయువకులకు స్వయం ఉపాధి కోసం రూ.2 లక్షల రుణాలు బ్యాంకు ద్వారా ఇప్పించడానికి చర్యలు తీసుకుంటున్నా మన్నారు. ఆసక్తి కలిగిన యువత రుణాల ద్వారా స్వయం ఉపాధి పొందాలని మంత్రి కోరారు. మంత్రి వెంట ధర్మపురి మున్సిపల్ చైర్మన్ వేముల నాగలక్ష్మి, జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ సంగనభట్ల దినేష్ తదితరులు ఉన్నారు.

# పల్లెల్లో జోరుగా ఉపాధి హామీ పనులు

- మంత్రి సీతక్క వరుస సమీక్షలతో భారీగా కూలీల హాజరు
- రోజుకు 16 లక్షలకు చేరిన కూలీల హాజరు



**హైదరాబాద్ (జనంసాక్షి) :** తెలంగాణ గ్రామాల్లో మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధీ హామీ పథకం పనులు వేగంగా కొనసాగుతున్నాయి. మంత్రి సీతక్క వరుస సమీక్షలతో రాష్ట్రవ్యాప్తంగా ఉపాధీ పనుల్లో కొత్త ఉత్సాహం కనిపిస్తోంది. ప్రతిరోజూ జిల్లా గ్రామీణాభివృద్ధి అధికారులు (డీఆర్డీఓలు), ఎంపీడీఓలతో పంచాయతీ రాజ్ శాఖ స్పెషల్ చీఫ్ సెక్రటరీ దానకిషోర్, కమిషనర్ దివ్యా దేవరాజన్ వీడియో కాన్ఫరెన్స్‌లు నిర్వహిస్తూ పనుల పురోగతి ని సమీక్షిస్తున్నారు. మే నెల ప్రారంభంలో మండుతున్న ఎండలు, సాంకేతిక సమస్యలు, మొబైల్ ఫోటో క్యాప్చరింగ్ ఇబ్బందులతో కూలీలు ఉపాధీ పనులకు రావడంలో ఆసక్తి చూపలేదు. ఆ సమయంలో రోజుకు లక్ష మంది కూలీలు కూడా పనులకు రావడం కష్టంగా మారింది. అయితే మంత్రి సీతక్క వరుస సమీక్షలు, అధికారుల ప్రత్యేక డ్రైవ్‌తో పరిస్థితి పూర్తిగా మారిపోయింది. ప్రస్తుతం రాష్ట్రవ్యాప్తంగా రోజుకు కనీసం 16 లక్షల మంది కూలీలు ఉపాధీ హామీ పనులకు హాజరవుతున్నారు. మే మొదటి వారంలో 7 లక్షల పరిధిలో ఉన్న హాజరు, క్రమంగా పెరిగి ఇప్పుడు 16.24 లక్షలకు చేరడం ప్రభుత్వ చొరవకు నిదర్శనంగా నిలిచింది. కూలీల హాజరు తక్కువగా ఉన్న జిల్లాలు, మండలాలను ప్రత్యేకంగా గుర్తించి అధికా రులతో సమావేశాలు నిర్వహిం చారు. గ్రామాల వారీగా ఇంచార్జ్‌లను నియమిం చి ప్రతి కూలీకి పని అందేలా చర్యలు తీసుకున్నారు. రాష్ట్ర స్థాయి సమీక్షల్లో కొన్ని జిల్లాలు అద్భుత ప్రదర్శన కనబరు స్తుండగా, మరికొన్ని జిల్లాలు ఇంకా మెరు గుదల అవసరమని ప్రభుత్వం గుర్తిం చింది. అత్యుత్తమ ప్రదర్శన కనబరుస్తూ వికారాబాద్, ఆదిలాబాద్, నిజామాబాద్, నల్గొండ, రాజన్న సిరిసిల్ల జిల్లాలు మంచి పురోగతి సాధించాయి. నల్గొండ జిల్లాలో ప్రతి రోజు ఏకంగా 1.23 లక్షల మందికి పైగా కూలీలు పనులకు హాజరుకావడం విశేషం. కూలీల సంఖ్య కాస్త తక్కువగా ఉంటున్న గద్వాల్, రంగారెడ్డి, నారాయణపేట్, నాగర్‌క ర్నూల్, వనపర్తి జిల్లాల్లో ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేసి కూలీల హాజరు పెంచేందుకు ప్రభుత్వం చర్యలు చేపట్టింది.

# రైతుగా మారిన టెక్కీ

- పిడుగుపాటుకు గురై హఠాన్మరణం

**బెంగళూరు, మే28 (జనంసాక్షి) :** సాఫ్ట్‌వేర్ జాబ్‌ను వదిలి వ్యవసాయ రంగంలోకి దిగిన ఒక వ్యక్తి పొలంలో పిడుగుపాటుకు గురై మరణించాడు. ఈ విషాద ఘటన బుధవారం కర్ణాటకలో చోటుచేసుకుంది. స్థానిక మీడియా కథనాల ప్రకారం, మడికేరి టౌన్‌కు చెందిన రోషన్ బాలకృష్ణ ఇటీవలే సాఫ్ట్‌వేర్ జాబ్‌కు రాజీనామా చేసి వ్యవసాయ రంగంలోకి దిగారు. తన స్నేహితుడితో కలిసి పనిచేస్తున్నారు. వ్యవసాయ యంత్రాల మార్కెటింగ్ కూడా చేస్తున్నారు. మైసూరులోని ఒక పొలాన్ని పరిశీలిం చేందుకు వెళ్లారు. ఆయన వెంట భార్య, కొడుకు కూడా వెళ్లారు. ఈ క్రమంలో పొలం సమీ పంలోని చెట్టు నుంచి మామిడి పండును ఆయన కోసేందుకు ప్రయత్నిస్తుండగా పిడుగు పడింది. దీంతో, కుప్పకూలిన రోషన్ ఘటనా స్థలంలోనే మరణించారు. ఈ ఘటనలో మరో వ్యక్తి కూడా స్వలంగా గాయపడ్డారు. బాధిత కుటుంబానికి జిల్లా విపత్తు నిర్వహణ విభాగం రూ.5 లక్షల పరిహారాన్ని ప్రకటించింది. ఇందులో రూ.4 లక్షలు రాష్ట్ర విపత్తు నిర్వహణ నిధి నుంచి, మిగతా మొత్తం కేంద్ర ప్రభుత్వ నిధి నుంచి బాలకృష్ణ కుటుంబానికి అందజేయనున్నారు.

## ఎన్టీఆర్‌కు ప్రధాని మోడీ నివాళి

**న్యూఢిల్లీ, మే28 (జనంసాక్షి) :** మాజీ సీఎం, తెలుగుదేశం పార్టీ వ్యవస్థాపకుడు నందమూరి తారక రామారావు 103వ జయంతి సందర్భంగా ప్రధానమంత్రి నరేంద్రమోదీ ఘన నివాళులు అర్పించారు. ఈ మేరకు సామాజిక మాధ్యమం ఎక్స్ వేదికగా ప్రధాని ఓ పోస్టు పెట్టారు. 'మహనీ యులు ఎన్టీఆర్ గారి జయంతి సందర్భంగా వారికి ఘన నివాళులు. ఆయన జీవితం, ఆశయాలు ఎంతోమందికి అపారమైన స్ఫూర్తిని అందిస్తూనే ఉంటాయి. నా మిత్రుడు చంద్రబాబు నాయుడు నాయకత్వంలో ఆంధ్రప్రదేశ్‌లోని ఎన్డీఏ ప్రభుత్వం, ప్రజల కోసం ఆయన కలలుగన్న ఆశయాలను సాకారం చేయడానికి కట్టుబడి ఉంది' అని ప్రధాని మోదీ వ్యాఖ్యానించారు.

# అర్ధరాత్రి పోలీస్ కార్యాలయం ముందే దారుణం

- ఒంటరిగా వెళుతున్న యువతిపై ఐదుగురు నేపాలీల దాడి
- కేకలు వేయడంతో స్థానికులు వచ్చి ఐదుగురికి దేహశుద్ధి

**హైదరాబాద్, మే 28 (జనంసాక్షి) :** హైదరాబాద్ బషీర్ బాగ్‌లో ఒంటరిగా వెళ్తున్న ఓ యువతి పట్ల కొందరు దుండగులు అసభ్యంగా ప్రవర్తించారు. బుధవారం రాత్రి బషీర్ బాగ్ సీసీఎస్ కార్యాలయం ఎదురుగా ఈ దారుణం చోటుచేసుకుంది. రోడ్డుపై ఒంటరిగా నడుచుకుంటూ వెళ్తున్న యువతిని చూసి... ఐదుగురు నేపాలీ యువకులు రెచ్చిపోయారు. నడిరోడ్డుపైనే ఆమె చేయి పట్టి లాగుతూ అసభ్యంగా ప్రవర్తించారు. ఈ ఊహించని పరిణామంతో తీవ్ర భయాందోళనకు గురైన ఆ యువతి.. ధైర్యం చేసి గట్టిగా కేకలు వేసింది. యువతి అరుపులు విన్న చుట్టుపక్కల ప్రజలు, స్థానికులు వెంటనే అప్రమత్తమయ్యారు. పారిపోవడానికి ప్రయ త్నించిన ఆ ఐదుగురు నేపాలీలను చుట్టుముట్టి నిర్బంధించారు. నడిరోడ్డుపైనే వారికి స్థానికు లు దేహశుద్ధి చేశారు. అనంతరం నిందితు లను అబిడ్స్ పోలీసులకు అప్పగించారు. పోలీసుల విచారణలో వీరంతా స్థానికంగా ఉండే ఓ ఫాస్ట్ ఫుడ్ సెంటర్‌లో పని చేస్తున్నట్లు తేలింది. నిందితులను సునీల్, ఉమేష్, లక్ష్మణ్, పురుషోత్తం, రామ్ గా గుర్తించారు. ఈ ఐదుగురిపై కేసు నమోదు చేసిన అబిడ్స్ పోలీసులు... దర్యాప్తును వేగవంతం చేశారు. నడిరోడ్డుపై, అది కూడా పోలీస్ కార్యాలయం ముందే ఇలాంటి ఘటన జరగడం స్థానికంగా తీవ్ర కలకలం రేపింది.

# మధుబని రైల్వే స్టేషన్‌లో ప్రమాదం

- ఖాళీ బోగీలో చెలరేగిన మంటలు



**పాట్నా, మే28 (జనంసాక్షి) :** బీహార్ మధుబని రైల్వే స్టేషన్‌లో గురువారం అగ్నిప్రమాదం చోటుచేసుకుంది. జయనగర్- ఉద్నా అంత్యోదయ ఎక్స్‌ప్రెస్ రైలు అగ్నిప్రమాదానికి గురైంది. ఓ ఖాళీ బోగీలో ఒక్కసారిగా మంటలు చెలరేగాయి. నిమిషాల వ్యవధిలోనే బోగీ మొత్తం మంటలు వ్యాపించి పూర్తిగా దగ్ధమైంది. ప్లాట్‌ఫామ్ నంబర్-3పై షంటింగ్ పనుల నిమిత్తం రైలు నిలిచి ఉన్న సమయంలో ప్రమాదం జరిగింది. దీంతో అధికారులు, ప్రయాణికులు తీవ్ర ఆందోళనకు గురయ్యారు. మధుబని రైల్వే స్టేషన్ ప్రాంగణంలో భయాందోళనలు నెలకొన్నాయి. రైల్వే సిబ్బంది వెంటనే అగ్నిమాపక సిబ్బందికి సమాచారం అందించారు. సుమారు పది అగ్నిమాపక వాహనాలు రైల్వే స్టేషన్‌కు చేరుకున్నాయి. గంటపాటు శ్రమించి వారు మంటలను అదుపు చేశారు. ఈ ప్రమాదంపై సమస్తిపూర్ డివిజన్ డివిజనల్ రైల్వే మేనేజర్ జ్యోతి ప్రకాశ్ మిశ్రా స్పందించారు. రైల్వే యంత్రాంగం ప్లాట్‌ఫామ్ ప్రాంతాన్ని ఖాళీ చేయించి విస్తృతంగా భద్రతా ఏర్పాట్లు చేసినట్లు పేర్కొన్నారు. అగ్నిప్రమాదానికి గల కారణాలపై దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు. ఈ ఘటనలో అసాంఘిక శక్తుల ప్రమేయంపైనా ఆరా తీస్తున్నట్లు జ్యోతి ప్రకాశ్ మిశ్రా చెప్పారు. ఇదిలా ఉండగా.. 2022లో అదే ప్లాట్‌ఫామ్‌పై నిలిచి ఉన్న స్వతంత్ర సేనాని ఎక్స్‌ప్రెస్ ప్రమాదానికి గురై ఐదు కోచ్‌లు దహనమయ్యాయి.

# గ్రీన్ ఎనర్జీ హబ్‌గా తెలంగాణ

- ప్రజా పాలనలో 'సౌర క్రాంతి'
- బోనకల్, కొడంగల్ మండలాల్లో సంపూర్ణ సోలరైజేషన్
- తడిసిన ధాన్యానికి కొంటాం
- మొక్కజొన్న కొనుగోళ్లకు రూ.5,000 కోట్లు విడుదల
- డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క




**హైదరాబాద్ (జనంసాక్షి) :** రాష్ట్రవ్యాప్తంగా పర్యావరణ హిత ఇంధన వనరులను ప్రోత్సహించడమే లక్ష్యంగా ప్రభుత్వం అడుగులు వేస్తోందని ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క ప్రకటించారు. ఖమ్మం జిల్లా బోనకల్ మండలం గర్లపాడు గ్రామంలో మీడియాతో మాట్లాడారు. అంతకుముందు చిన్నబీరవల్లి గ్రామంలో మోడల్ సోలార్ విలేజ్ లో భాగంగా ఈ ఇంటింటి పైకప్పు పై ఏర్పాటు చేసిన సోలార్ విద్యుత్తుని ప్రారంభించారు. తరువాత గార్లపాడు గ్రామంలో రైతు వ్యవసాయ క్షేత్రంలో ఏర్పాటు చేసుకున్న సోలార్ పంపుసెట్లను ఆయన ఆయన ప్రారంభించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో మొట్టమొదటిసారిగా బోనకల్, కొడంగల్ మండలాలను పైలట్ ప్రాజెక్టు కింద సంపూర్ణ సోలరైజేషన్ మండలాలుగా ఏర్పాటు చేస్తున్నట్లు చెప్పారు. రైతుల పొలాల్లో ఏర్పాటు చేసిన సోలార్ పవర్ పంప్ సెట్ల పనితీరును ఆయన పరిశీలించారు. ఇవి కేవలం నీటిని అందించడమే కాకుండా, మిగులు విద్యుత్ ద్వారా రైతులకు అదనపు ఆదాయాన్ని అందిస్తాయని డిప్యూటీ సీఎం చెప్పారు. గ్రామీణ ప్రాంతాల్లో ఇళ్లపై సోలార్ ప్యానెల్స్ ఏర్పాటును తమ ప్రభుత్వం ప్రోత్సహిస్తున్నట్లు చెప్పారు. దీనివల్ల కరెంటు ఖర్చు తగ్గడమే కాకుండా, నెలవారీగా సుమారు 500 వరకు ఆదాయం పొందే అవకాశం ఉందని వివరించారు. రెడ్కో సంస్థ రూపొందించిన ప్రత్యేక సోలార్ షెడ్లను ఆయన అభినందించారు. ఇవి పొలాల్లో విద్యుత్ ఉత్పత్తి చేయడమే కాకుండా, రైతులకు విశ్రాంతి గదులుగా, సామాగ్రి దాచుకునే షెడ్లుగా ఉపయోగపడతాయన్నారు. రైతులకు సాగుతో పాటు విద్యుత్ ద్వారా ఆదాయం రావాలన్నదే ప్రజా ప్రభుత్వ లక్ష్యమని.. ఆ సంకల్పంతోనే పని చేస్తున్నామని డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క చెప్పారు.

బోనకల్ మండలంలో రూఫ్ టాప్ సోలార్ పనులు 40% నుంచి 50% వరకు పూర్తయ్యాయని అన్నారు. అగ్రికల్చర్ పంప్ సెట్ల ఏర్పాటు ప్రక్రియ వేగంగా జరుగుతోందని డిప్యూటీ సీఎం తెలిపారు. తెలంగాణను గ్రీన్ ఎనర్జీ హబ్‌గా మార్చే దిశగా ఈ ప్రాజెక్టులు మైలురాళ్లుగా నిలుస్తాయని ఆయన ఆశాభావం వ్యక్తం చేశారు. ఎర్రుపాలెం మండలంలోని వెంకటాపురం గ్రామంలో మహిళా సంఘాల ద్వారా సోలార్ పవర్ ప్లాంట్లను ఏర్పాటు చేసిన విషయాన్ని ఈ సందర్భంగా మరొకసారి ఆయన గుర్తు చేశారు. ఈ ప్లాంట్ల నిర్వహణ, యాజమాన్య బాధ్యతలను మహిళలే చూసుకుంటూ స్వయం సమృద్ధి సాధించేలా ప్రజా ప్రభుత్వం ప్రణాళికలు రూపొందించిందని చెప్పారు. ఈ సోలార్ ప్రాజెక్టు ద్వారా మహిళా సంఘాలకు ఏడాదికి 4.5 నుంచి 5 లక్షల రూపాయల వరకు ఆదాయం వస్తుందని ఆయన తెలిపారు. రాష్ట్రవ్యాప్తంగా ప్రతి జిల్లాలో రెండు 1,000 మెగావాట్ల సోలార్ విద్యుత్తును ఇందిరా మహిళా శక్తి సంఘాలకు అందించడమే ప్రభుత్వ లక్ష్యమన్నారు. రాష్ట్రంలో దాదాపు 81 గ్రామాలను మోడల్ సోలార్ గ్రామాలుగా ప్రకటించి, అక్కడ పనులు వేగంగా చేపడుతున్నారు. రైతులు, గృహ వినియోగదారులు ఈ సోలార్ పథకాలను వినియోగించుకుని, పంటతో పాటు విద్యుత్ ద్వారా ఆదాయం పొందాలని ఆయన పిలుపునిచ్చారు. నాణ్యమైన విద్యుత్తును అందించడం ద్వారా వ్యవసాయం, పరిశ్రమలు, సేవా రంగాల్లో ఉత్పత్తిని పెంచాలని ప్రభుత్వం భావిస్తోందన్నారు. ప్రజాప్రభుత్వం విద్యుత్ రంగంలో నిరంతరం పరిశోధనలు చేస్తూ, అధునాతన సాంకేతికతను ప్రజలకు చేరువ చేస్తోందని తెప్పారు. ముఖ్యంగా రాష్ట్రంలో విద్యుత్ వ్యవస్థను ఎప్పటికప్పుడు అప్‌డేట్ చేస్తూ, ప్రజలకు మెరుగైన సేవలు అందించడమే తమ ప్రాధాన్యతని భట్టి విక్రమార్క స్పష్టం చేశారు. రాష్ట్రంలో విద్యుత్ వినియోగం గణనీయంగా పెరిగినప్పటికీ ప్రభుత్వం తీసుకున్న పకడ్బందీ చర్యల వల్ల ఎక్కడా అంతరాయం కలగలేదని ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క స్పష్టం చేశారు. 2023-24లో విద్యుత్ పీక్ డిమాండ్ 15,000 మెగావాట్లు ఉండగా, ప్రస్తుతం అది 18,542 మెగావాట్లకు చేరుకుందన్నారు. కేవలం రెండున్నర ఏళ్లలోనే సుమారు 3,542 మెగావాట్ల అదనపు డిమాండ్ పెరిగినా.. ప్రజలకు ఎక్కడ పవర్ కట్లు లేకుండా ప్రభుత్వం చర్యలు తీసుకుందని ఆయన వివరించారు. ట్రాన్స్‌మిషన్ వ్యవస్థను బలోపేతం చేయడం, కొత్త ట్రాన్స్‌ఫార్మర్ల ఏర్పాటు, విద్యుత్ ఉత్పత్తిని అంచనాలకు అనుగుణంగా పెంచడం జరిగిందని ఆయన చెప్పారు. ప్రభుత్వం తీసుకున్న ముందస్తు జాగ్రత్త చర్ల వల్ల ప్రజలకు నాణ్యమైన విద్యుత్ అందించగలుగుతున్నామని ఆయన తెలిపారు.

# వేసవిలో వలసొచ్చిన పోలంకి..

## మూడు నెలలు ఆదిలాబాద్ జిల్లా అడవుల్లోనే..



**ఆదిలాబాద్ ప్రతినిధి (జనంసాక్షి) :** శీతాకాలంలో మాత్రమే ఆదిలాబాద్ జిల్లా అడవుల్లో దేశ విదేశాల నుంచి ఎన్నో రకాల అందమైన పక్షులు కనువిందు చేసి తిరిగి వెళ్ళి పోతుంటాయి. అయితే మండు వేసవిలో అది కూడా మే మాసంలో జిల్లా దట్టమైన అడవుల్లో ఓ వలస పక్షి కనువిందు చేస్తోంది. దాని పేరే పోలంకి పిట్ట ఇంగ్లీష్‌లో దీని పేరు ఇండియన్ పిట్ట అని పిలుస్తారు. ఈ పిట్ట తొమ్మిది అందమైన రంగుల్లో ఉంటుంది. ఇది ఉదయం సూరీడు ఉదయిస్తున్న సమయంలో పిల్లన గోవి మాదిరి సన్నని వినసొంపైన తీయని కూత పెడుతుంది. ఇవి ఒకటి లేదా రెండుకంటే ఎక్కువ కనిపించవు. ఈ పక్షులు హిమాలయాల పర్వత ప్రాంతం నుంచి ఇక్కడికి వలస వస్తుంటాయి. ఎండిన ఆకుల మధ్య ఉండే చిన్న చిన్న క్రిమి కీటకాలను అదే విధంగా జెర్రీ వంటి పురుగులను ఇష్టంగా తింటాయి. మూడు మాసాలపాటు ఇక్కడే ఉండి తిరిగి వెళ్ళిపోతాయి. ఈ పిట్ట ఫోటోను ప్రముఖ వైల్డ్ లైఫ్ ఫోటోగ్రాఫర్ లింగంపల్లి కృష్ణ మంగళవారం తెలంగాణ, మహారాష్ట్ర సరిహద్దు గండి అడవుల్లో ఉదయం తన కెమెరాలో బంధించాడు.

Printed, Published and Owned by M.M.RAHMAN Printed at M/s. Manair Enterprises, Plot No. 16E/4, IDA, Kattedan, Ranga Reddy Dist, Telangana - 500077, Published at Flat No. 301, 8-2-273, 276 & 277, 3rd Floor,Pavani Estate, Indradhanush Complex,Road No. 2, Banjara Hills,Hyderabad – 500034, Telangana, Editor : M.M.RAHMAN RNI No. APTEL/2013/50370